అనుదినం... జనస్వరం

www.navatelangana.com

సంపుటి : 10 సంచిక : 269

14 పేజీలు వెల : 6.50

నవతెలంగాణ

శుక్రవారం 27-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar





ఉసురు తీస్తున్న మానసిక ఒత్తిడి

పనిభారంతో బలవన్మరణాలు


సెలవు రోజూ ల్యాప్‌టాప్‌తో కుస్తీ..ఊపిరి పీల్చటానికీ దొరకని సమయం

కార్పొరేట్ రంగంలో విషపూరితమైన పని సంస్కృతిపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగు తుండగానే చెన్నయ్‌లో ఓ ఉద్యోగి మానసిక ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన హృదయాన్ని కలచివేస్తోంది. కార్తికేయన్ అనే టెకీ గత పదిహేనేండ్లుగా ఓ సంస్థలో పనిచేస్తున్నారు. పని ఒత్తిడి కారణంగా తీవ్ర నిరాశానిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న ఆయన గత కొంత కాలంగా మందులు వాడుతున్నాడని, చివరికి విద్యుత్ వైర్లు చుట్టుకొని విగతజీవిగా మారాడని కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు.

న్యూఢిల్లీ: కార్పొరేట్ ఉద్యోగం.. లక్షల్లో జీతం అని బంధు, మిత్రులనుకుంటుంటారు. ఇది నాణేనికి ఓవైపు..మరో వైపు కార్పొరేట్ ఉద్యోగాల్లో వర్క్ ప్రెషర్ ప్రాణాలు తీయటానికీ వెనుకాడటం లేదు.అయితే సానుకూల సహజీవనం కంటే పోటీకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న ఈ రోజులలో ఇలాంటి విషాదకర ఘటనలు జరుగుతూనే ఉంటాయి. ఇవేమీ మనకు కొత్త కావు. కాకపోతే ఆయా ఉదంతాల లోని సున్నితత్వాన్ని మనం గుర్తించడం లేదు. ఫలితంగా మరిన్ని విషాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దేశంలోని బహుళజాతి సంస్థలలో పనిచేస్తున్న నిపుణులే ఎక్కువగా ఆత్మహత్యకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మెరుగైన ఉద్యోగావకాశాల కోసం యువత ప్రధాన నగరాల బాట పడుతోంది. యువతను ఆకర్షిస్తున్న ఆ నగరాలే ఇప్పుడు దురదృష్టవశాత్తూ ఆత్మహత్యలకు కేంద్రాలుగా మారాయని 2022లో 'బిజినెస్ ఇన్‌సైడర్' అనే వెబ్‌సైట్ తెలిపింది. దేశంలోని 53 మెగా నగరాలలో నమోదైన మొత్తం ఆత్మహత్యలలో నాలుగు ప్రధాన నగరాలైన ఢిల్లీ (2,760), చెన్నయ్ (2,699), బెంగళూరు (2,292), ముంబయి (1,436)లోనే 35.5 శాతం జరిగాయని ఆ వెబ్‌సైట్ వివరించింది.

ఇవి ఉదాహరణలు మాత్రమే

దేశంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని తాజా గణాంకాలు చెబుతున్నాయి. పని ప్రదేశంలో ఒత్తిడిని తగ్గించాలని, ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా మేనేజర్లకు శిక్షణ ఇవ్వాలని



యాజమాన్యాలకు సూచనలు అందుతున్నాయి. 2022 జనవరిలో 31 సంవత్సరాల ఐటీ ఉద్యోగి రూప్ కిషోర్ సింగ్ హైదరాబాద్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పని ఒత్తిడిని తట్టుకోలేకపోతు న్నానంటూ అంతకుముందు ఆయన తన కుటుంబ సభ్యులకు ఓ సందేశం పంపారు. అదే సంవత్సరం సెప్టెంబరులో గురుగ్రామ్‌లో 39 సంవత్సరాల అసిస్టెంట్ మేనేజర్ అమిత్ కుమార్ బలవన్మరణానికి పాల్పడ్డారు. అంతకుముందు...తన క్యారెక్టరును దెబ్బతీశారంటూ ఆయన

...5లో

వారానికి యాభై ఆత్మహత్యలు

వృత్తి నిపుణులలో ఆత్మహత్యలు అధికంగా జరుగుతున్నాయని ఇటీవల విడుదలైన గణాంకాలు చెబుతున్నాయి. 2021లో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం పని ప్రదేశంలో సమస్యల కారణంగా దేశంలో ప్రతి వారం కనీసం యాభై మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. 2021లో దేశంలో 1,64,033 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 2020తో పోలిస్తే ఇది 7.2 శాతం అధికం. వాస్తవానికి బలవన్మరణానికి పాల్పడుతున్న వారి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని నిపుణులు తెలిపారు. ఇంత జరుగుతున్నప్పటికీ పలు కంపెనీలు ఇప్పటికీ సమస్యను సరిగా అర్థం చేసుకోవడం లేదు. పని ప్రదేశంలో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం వెల్లివిరిసేలా చర్యలు తీసుకోవడం లేదు. శారీరక ఆరోగ్య సమస్యలు అందరికీ తెలుస్తాయి కానీ మానసిక ఆరోగ్య సమస్యలు తెలియవు. ఇటీవల జరిగిన ఘటనలను చూసైనా బహుళజాతి, సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ ఉద్యోగులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయని, అవసరమైతే వారికి వైద్య నిపుణులను అందుబాటులో ఉంచుతాతాయని ఆశించడం తప్పు కాదేమో.

30 రోజుల్లో డిజిటల్ హెల్త్‌కార్డులు

క్యాన్సర్‌ను అత్యవసరంగా ఎదుర్కోవాలి

లాభాలార్జించే సర్కారు కాదు

ప్రజల సంక్షేమం కోరే ప్రభుత్వం : సీఎం రేవంత్‌రెడ్డి

దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించిన ముఖ్యమంత్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్ విద్యానగర్‌లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు. వీలైనంత మేరకు ప్రజలకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సిన అవసరముందని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఫ్యామిలీ డాక్టర్లు ఉండరనీ, ప్రతిసారి అనేక పరీక్షలు చేస్తే తప్ప వైద్యం అందించలేని పరిస్థితిని వైద్యులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి సంబంధించిన డాటాతో ఒక్కొక్కరికి విడివిడిగా హెల్త్ ప్రొఫైల్ రూపొందించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొఫైల్స్‌ను డిజిటలైజ్ చేసి ఈ హెల్త్ కార్డుల్లో గతంలో వారు తీసుకున్న చికిత్స వివరాలను పొందుపర్చనున్నట్టు తెలిపారు. దీంతో అత్యవసర పరిస్థితితో పాటు ఎప్పుడు ఏ డాక్టర్ దగ్గరికి చికిత్స కోసం వెళ్లినా ఆ పేషంట్ గత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వేగంగా చికిత్స అందించడం సులభమవుతుందని సీఎం వివరించారు.

ప్రభుత్వపరంగా తాము విధానాలను రూపొందించగలుగుతామని చెప్పారు. అయితే ఆ విధానాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. ఈ రూపకల్పనలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం త్వరలోనే స్వచ్ఛంద సంస్థలతో సహకారం తీసుకుంటామని తెలిపారు. ఎన్జీవోలతో త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనలు స్వీకరిస్తామనీ, వారిని భాగస్వాములను చేసుకుంటామని చెప్పారు. దీంతో తక్కువ రోజుల్లో ఎక్కువ సమాచారాన్ని సేకరించగలుగుతామన్నారు.

క్యాన్సర్ మహమ్మారిని అరికట్టేందుకు తక్షణం దృష్టి సారించాల్సిన అసరముందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తనకు తెలిసిన ఒక పాత్రికేయుడు క్యాన్సర్ బాధను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. తమను సంప్రదించిన తర్వాత చికిత్స కోసం తగిన సాయం చేద్దామనుకునేలోపు మరణించడం కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. ఈ మహమ్మరిని పాలద్రోలేందుకు ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు కలిసికట్టుగా

...13లో



ప్రాధాన్యతా ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా చూడండి

గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లుల్ని చెల్లించండి

ఆర్నెల్లలో వీలైనంత ఎక్కువ ఆయకట్టుకు నీరందించాలి

సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్

2లో..

నీళ్లను ఒడిసిపట్టి ప్రజలకందించాలి

ఏఈఈ ఉద్యోగ నియామక పత్రాలందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి

13లో..



ముందు ప్రత్యామ్నాయం-పునరావాసం

ఆ తర్వాతే ఇండ్లు కూల్చాలి

మూసీ అభివృద్ధి పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేయొద్దు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎలాంటి ప్రత్యామ్నాయం, పునరావాసం కల్పించకుండానే హైదరాబాద్ మూసీ నది పరిసర ప్రాంతాల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల ఇండ్లు, గుడిసెలను హైడ్రా అధికారులు వెంటనే తొలగించేందుకు పూనుకోవడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ముందుగా పునరావాసం కల్పించిన తర్వాతే ఇండ్లను కూల్చే పనిని చేపట్టాలని కోరింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూసీ అభివృద్ధి పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్ జోన్‌లో దశాబ్దాలుగా ఉన్న రెండు వేలకుపైగా పేదల ఇండ్లు కూల్చడానికి హైడ్రా ప్రస్తుతం సర్వే చేసి మార్కింగ్ చేస్తున్నదని తెలిపారు. ఈ పేదలంతా కూలీ పని, చిన్నచిన్న షాపుల్లో ఇతర పనులు చేసుకుంటున్నారనీ, బలహీనవర్గాలకు చెందిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందుల వల్ల గుడిసెలు వేసుకున్న వారు కొందరైతే, స్థలాలను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్లు చేసుకుని, ఇంటి నిర్మాణానికి మున్సిపల్ అనుమతి తీసుకుని ఇండ్లు కట్టుకున్న వారు కొందరున్నారని వివరించారు. అందువల్ల వారు నివాసం ఉంటున్న సమీప ప్రాంతాల్లో ఇండ్లను కేటాయించాల్సిన అవసరముందని సూచించారు. ప్రభుత్వం వారికి హైదరాబాద్ నగర శివార్లలో డబుల్‌బెడ్రూం ఇండ్లు ఇవ్వడం వల్ల రోజువారీ పనిచేసుకుంటున్న పేదలు ఆ పనులకు వెళ్లడం ఆచరణలో సాధ్యం కాదని తెలిపారు. కావున ప్రత్యామ్నాయం కల్పించకుండా ఇండ్ల తొలగింపునకు పూనుకోరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

చెరువులో భారీ భవనం

డిటోనేటర్లు పెట్టి నేలమట్టం చేసిన అధికారులు

నవతెలంగాణ-కొండాపూర్

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని కుతుబ్‌షాహిపేట, మల్కాపూర్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా నిర్మించిన బహుళ అంతస్థు భవనాన్ని గురువారం అధికారులు కూల్చేశారు. మండల రెవెన్యూ అధికారి, ఇరిగేషన్ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య డిటోనేటర్లు పెట్టి భవనాన్ని నేలమట్టం చేశారు. కుతుబ్‌షాహిపేట్, మల్కాపూర్ చెరువులో అక్రమంగా నిర్మించారని పత్రికల్లో కథనాలు రావడంతో.. కలెక్టర్ వల్లూరి క్రాంతి మండల రెవెన్యూ అధికారిని, ఇరిగేషన్ అధికారులను విచారణకు ఆదేశించారు. పరిశీలించిన అధికారులు భవనం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని చెప్పడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు.. డిటోనేటర్లు పెట్టి కూల్చేశారు. పూర్తిగా చెరువు నీటిలో ఉన్న భవనానికి ఒడ్డు నుంచి పిల్లర్ల సాయంతో మెట్లు ఏర్పాటు చేయడం గమనార్హం. కూల్చివేతల సమయంలో విధుల్లో



హోంగార్డు గోపాల్ తలకు కాంక్రీట్ ముక్కలు తగిలి గాయమైంది. అధికారులు వెంటనే ఆయన్ని ఆస్పత్రికి తరలించారు.

ఆపరేషన్ మూసీ

రివర్ బెడ్‌లో సర్వే ప్రారంభం..

మూడు జిల్లాల్లో 25 బృందాల పర్యటన

1643 ఇండ్లలో వెయ్యి ఇండ్లకు పైగా మార్కింగ్ పూర్తి

నిర్వాసితుల ఆందోళన..వేరే చోట 'డబుల్' ఇండ్లు కేటాయిస్తామన్న అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధిపై దృష్టిసారించిన ప్రభుత్వం.. ఆపరేషన్ మూసీని ప్రారంభించింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన ప్రాంతాలను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మొదటి విడతగా రివర్‌బెడ్ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలకు మార్కింగ్ చేసి, నివాసితులను డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు తరలించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో రెవెన్యూ అధికారుల సర్వే ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 16 బృందాలు, రంగారెడ్డి జిల్లాలో నాలుగు టీమ్స్, మేడ్చల్ జిల్లాలో 5 టీమ్స్.. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ప్రతి ఇల్లూ తిరుగుతూ.. వివరాలు సేకరించి, ఇండ్లకు మార్క్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు వెళ్లడానికి నివాసితులను ఒప్పించారు. కొన్నిచోట్ల అధికారులకు తమ డిమాండ్లను నివాసితులు తెలియచేశారు. నిర్మాణాలు అధికంగా ఉన్న బహదూర్‌పురాలో ఐదు



బృందాలు, హిమాయత్‌నగర్, నాంపల్లిలో మూడు టీములు పనిచేశాయి. ఉదయం 9 గంటలకే ఫీల్డ్‌లోకి వెళ్లిన అధికార బృందాలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాయి. సొంత ఇండ్లా? అద్దెకు ఉంటున్నారా? ఎన్నేండ్ల నుంచి ఉంటున్నారు? ఎంతమంది ఉంటున్నారు? ఆధార్ కార్డ్?, రేషన్‌కార్డు?, కరెంట్ బిల్లు?, ఇంటి కాగితాలు, యజమాని ఎవరు? తదితర డాక్యుమెంట్లను పరిశీలించి సర్వే పత్రంలో నమోదు చేసుకున్నారు. చాదర్‌ఘాట్,

...13లో



బిల్కిస్ బానో కేసులో

గుజరాత్ సర్కార్‌కు షాక్

దోషులతో బీజేపీ ప్రభుత్వం కుమ్మక్కైనట్టుందని సుప్రీం వ్యాఖ్య

వివరాలు 13లో..

ప్రాణాలు తీసిన పవిత్ర స్నానం

బీహార్‌లో 47 మంది భక్తులు మృతి

వీరిలో 37 మంది చిన్నారులు

సీఎం నితీశ్ సంతాపం

మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

13లో..





నాణ్యతలేదు

50కి పైగా మందులు గుర్తింపు

ఇందులో పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు

ఇవన్నీ మార్కెట్‌లో విరివిగా దొరికేవే

గుర్తించిన సీడీఎస్‌సీఓ

వివరాలు 3లో..

లడ్డూ వెనుక రాజకీయం..

ఓట్ల కోసం నేతల పాట్లు

హిందూత్వ వాదాన్ని తలకెత్తుకుంటున్న టీడీపీ, జేడీయూ

చంద్రబాబుకు కలిసొచ్చిన తిరుపతి ప్రసాద వివాదం


సీతాదేవి కేంద్రంగా నితీశ్ రాజకీయాలు

తమ ఓట్లకు ఎసరు పెడతారేమోనని కలవరపడుతూనే, పవన్ తీరుతో సంబరపడుతున్న బీజేపీ



ఎన్డీఏలో కీలక భాగస్వాములుగా ఉన్న తెలుగుదేశం, జేడీయూ పార్టీలు తమ హిందూ ఓటు బ్యాంకును చెక్కుచెదరకుండా చేసుకునే ప్రయత్నాలలో ఉన్నాయని ఇటీవలి పరిణామాలను బట్టి అర్థమవుతోంది. తిరుపతి లడ్డూ వివాదాన్ని తెలుగుదేశం పార్టీ తనకు అనుకూలంగా మలచుకుంటోంది. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ వచ్చిన ఆరోపణలను పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మొదలు కొని కింది స్థాయి కార్యకర్త వరకూ అందిపుచ్చుకుంటున్నారు. రాష్ట్రంలో తన ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న జగన్‌మోహన రెడ్డి పాలనలో తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారని, ఇదిహిందువుల మనోభావాలను దెబ్బతీయడమే అవుతుందని వారంతా మండిపడుతున్నారు. మరోవైపు జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని కొనియాడారు. మందిర నిర్మాణం జరిగిన ఎనిమిది నెలల తర్వాత ఆయనకు ఈ విషయం గుర్తుకు వచ్చింది. సీతాదేవి జన్మస్థలంగా భావిస్తున్న సీతామర్హిలోని పునౌరా ధామ్‌ను అభివృద్ధి చేస్తామని ఆయన ప్రకటించారు. ఈ ఇరువురు నేతల అడుగులు చూస్తుంటే హిందూ ఓట్లన్నీ గుంపగుత్తగా బీజేపీకి పడకుండా చూడాలనే ప్రయత్నంగా కన్పిస్తోంది. ముఖ్యంగా తెలుగు నాట లడ్డూ చుట్టూ తిరుగుతున్న ఈ రాజకీయ వివాదాల మాటున ప్రజలెదుర్కొంటున్న అసలు సమస్యలు మరుగున పడుతుండటం కొసమెరుపు. ఈ రాజకీయ క్రీడ భక్తుల విశ్వాసాలను దెబ్బతీయడమే కాక మత విద్వేశాలకు తావిస్తుండటం ఆందోళనాకరం.

న్యూఢిల్లీ : కేంద్రంలోని సంకీర్ణ సర్కారులోని పార్టీలు హిందూత్వ అంశాన్ని ఓటు బ్యాంకుగా వాడుకోవటానికి ప్రయత్నిస్తున్నాయి.అటు నితీశ్, ఇటు చంద్రబాబు పోటీపడుతున్నారు. వీరిద్దరి ఓటు రాజకీయాలపై మోడీ మన్‌కీబాత్ మాత్రం బయటకు రావటంలేదు. తిరుపతి లడ్డూ వివాదం ప్రాథమికంగా చూస్తే జగన్‌మోహన రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నట్టు కన్పించినా దీర్ఘకాల ప్రయోజనాల రీత్యా తమ హిందూ ఓటు బ్యాంకును పటిష్ఠపరచుకునేందుకు చేస్తున్న ప్రయత్నంగా చూడవచ్చునని టీడీపీ వర్గాలు అంతరంగికంగా చెబుతున్నాయి. 'జగన్‌ను ఇరుకున పెట్టేందుకు చంద్రబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఆయన కేవలం లడ్డూ వివాదాన్నే లేవనెత్తడం లేదు. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రవేశించేటప్పుడు క్రైస్తవుడైన జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోవడాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. ఈ అంశాలను



ముందుకు తేవడం ద్వారా జగన్‌ను కోలుకోకుండా చేయాలని చంద్రబాబు చూస్తున్నారు. ఈ క్రమంలో ఆయన హిందూ భక్తుల మెప్పు కూడా పొందుతున్నారు' అని బీజేపీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. 'జగన్‌ను ఆయన ఇరుకున పెడుతున్నప్పుడు టీడీపీతో పొత్తులో ఉన్న మా పార్టీ కూడా ఏం చేయగలదు? బాబును అనుసరించక తప్పదు. ఇక్కడ చంద్రబాబు మంచి ఎత్తుగడ వేశారు' అని చెప్పారు. చంద్రబాబు వ్యూహం వెనుక రాజకీయ ఎత్తుగడలు ఉన్నాయని తాము భావించడం లేదని టీడీపీ నేతలు అంటూనే రాజకీయ ప్రయోజనాలు చేకూరుతాయని అంగీకరిస్తున్నారు. హిందువులలో ఇప్పటికే మంచి మద్దతు ఉన్నందున

...13లో

విద్యాధికారుల పోస్టులను మంజూరు చేయాలి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా జిల్లాలు, అర్బన్ మండలాలు, అర్బన్ రెవెన్యూ డివిజన్లకు విద్యాధికారుల పోస్టులను మంజూరు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 21 జిల్లాలకు డీఈవో, 28 డిప్యూటీ విద్యాధికారి (డిప్యూటీఈవో), 59 మండల విద్యాధికారి (ఎంఈవో), ఐదు అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులను మంజూరు చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్, ముఖ్యకార్యదర్శికి ఈ ఏడాది ఫిబ్రవరి 12న లేఖ రాశానని గుర్తు చేశారు. ఏడు నెలలు పూర్తవుతున్నా ఇంత వరకు ఆ పోస్టులను మంజూరు చేయలేదని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల పర్యవేక్షణ లోపించి పాఠశాలల నిర్వహణలో లోపం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పంపించిన ప్రతిపాదనల్లో పాఠశాలల సంఖ్య, విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకోకుండా రెవెన్యూ మండలాలు, డివిజన్ల ప్రాతిపదికన ఎంఈవో, డిప్యూటీఈవో పోస్టులను ప్రతిపాదించారని తెలిపారు. అర్బన్ మండలాల్లో పాఠశాలల సంఖ్య, విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటుందని వివరించారు. అర్బన్ మండలాలకు ఒకటి కంటే ఎక్కువ ఎంఈవో పోస్టులను ఇవ్వాల్సి ఉంటుందని సూచించారు. అర్బన్ రెవెన్యూ డివిజనర్లకు కూడా ఒకటి కంటే ఎక్కువ డిప్యూటీ ఈవో పోస్టులను ఇవ్వాలని కోరారు. అర్బన్ మండలాలు, డివిజనర్లకు అవసరమైన ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టులను అదనంగా లెక్కించి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నందున ఆ పోస్టులను వెంటనే మంజూరు చేయాలంటూ బుధవారం లేఖ ఇచ్చానని పేర్కొన్నారు.

విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు అభినందనీయం

- మాజీమంత్రి బస్వారాజ్ సారయ్య

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చిట్యాల ఐలమ్మ పేరు పెట్టడం అభినందనీయమని మాజీ మంత్రి బస్వారాజ్ సారయ్య చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరపల్లి శంకర్, సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొల్లు కిషన్, ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్, జనరల్ సెక్రెటరీలు, రజక సంఘం రాష్ట్ర నాయకులు మిద్దె శ్రీనివాసులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 30న ముగుస్తుండటంతో వాటిని మరో మూడు నెలలు (31 డిసెంబర్-24 వరకు) పెంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఎం.హన్మంతరావు గురువారం సర్క్యులర్ జారీ చేశారు. తెలంగాణ మీడియా రూల్స్ 2016ను సమీక్షించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ తాజా మార్గదర్శకాలను ఇంకా ఖరారు చేయకపోవడం వల్ల పాత కార్డుల గడువును పెంచుతున్నట్టు సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

నిమ్స్ వైద్యులు చేస్తున్న కృషి ఆదర్శం

- బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిమ్స్ వైద్యులు చేస్తున్న కృషి ఆదర్శం అని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. నిమ్స్‌లో గత నాలుగు రోజులుగా ప్రముఖ బ్రిటన్ వైద్యులు దన్నపనేని రమణ, నిమ్స్ కార్డియో థోరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు సారథ్యంలో చిన్నారులకు గుండె ఆపరేషన్లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గురువారం నిమ్స్ మిలినియమ్ బ్లాక్‌లోని పీడియాట్రిక్ గుండె విభాగాన్ని పరిశీలించిన గారెత్ అక్కడ చిన్నారులకు అందుతున్న వైద్యం పట్ల అరా తీశారు. సొంత గడ్డకు సేవ చేస్తున్నారని రమణను ప్రశంసించారు. పుట్టుకతోనే గుండె సమస్యలతో బాధ పడుతున్న చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ సహకారంతో ఉచితంగా వైద్యం అందించి వారికీ కొత్త జీవితాలను ప్రసాదిస్తున్నారని దీంట్లో బ్రిటన్ వైద్యులు పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం, నిమ్స్ గుండె విభాగాదిపతి అమరేశ్వర్ రావు సహకారంతో గుండె ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. గుండె జబ్బులతో చాలా మంది చిన్నారులను ఇక్కడికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తున్నారని తెలియచేసారు.

హూవర్ డ్యామ్ ఇంజినీరింగ్ అద్భుతం


- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలోని నేవడ, అరిజోనా రాష్ట్రాల సరిహద్దులో కొలరాడో నదిపై ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించిన అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు హూవర్ డ్యామ్ ఇంజినీరింగ్ అద్భుతమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రశంసించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన బుధవారం రాష్ట్ర ప్రతినిధి బృందంలో గల ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, స్పెషల్ సెక్రెటరీ కృష్ణభాస్కర్ ఇతర అధికారులతో కలిసి డ్యామ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఫెడరల్ గవర్నమెంట్ అధికారులు ప్రాజెక్టు వివరాలను వివరించారు. 17 జనరేటర్ల ద్వారా 2080 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతుందనీ, తద్వారా మూడు రాష్ట్రాల విద్యుత్ అవసరాలను ఈ ప్రాజెక్టు తీరుస్తున్నదని తెలిపారు. డ్యామ్ వెనక ఉన్న సరస్సును ఏటా సుమారు 80 లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తారని వివరించారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అక్కడ జరుగుతున్న జల విద్యుత్ ఉత్పాదకత, యంత్రాల సామర్థ్యం, నీటి లభ్యత, రక్షణ చర్యలు, తదితర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. హువర్ డ్యామ్ జలవిద్యుత్ ఉత్పాదకతను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలోని ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుదలకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. అనంతరం మైనెక్స్-2024 అంతర్జాతీయ ప్రదర్శనలో వివిధ ప్రఖ్యాత కంపెనీల స్టాల్స్‌ను సందర్శించారు. ఆధునిక సాంకేతికత వల్ల గనుల్లో పని చేసే కార్మికులకు ప్రమాదాన్ని నివారించవచ్చని ఈ సందర్భంగా భట్టి పేర్కొన్నారు. ఈ తరహా సాంకేతికతను గనుల్లో ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ ను కోరారు.

సాయి దుర్గ సర్వీస్ సెంటర్‌ను సందర్శించిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి



నవతెలంగాణ - హైదరాబాద్

ప్రముఖ నాయకులు, బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి కాచీగూడలో నిర్వహిస్తున్న సాయిదుర్గ సర్వీస్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సాయిదుర్గ సర్వీస్ సెంటర్ ప్రొప్రైటర్ పభాకర్‌చారి వారిని సంత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, సుధాకర్, కిరణ్, నర్సింగ్ గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్సవంగా వెంకటస్వామి వర్ధంతి

- జీవో జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి వర్ధంతిని ఇక నుంచి రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ఏడాది డిసెంబర్ 22న రాష్ట్ర ఉత్సవంగా జరుపనున్నారు.

ప్రాధాన్యతా ప్రాజెక్టులకు
నిధుల కొరత లేకుండా చూడండి

- గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లుల్ని చెల్లించండి
- ఆర్నెల్లలో వీలైనంత ఎక్కువ ఆయకట్టుకు నీరందించాలి : సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్



పవర్ పాయింట్ ప్రజంటేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కృష్ణా, గోదావరి బేసిన్లలో ప్రాధాన్యతగా ఎంచుకున్న ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తక్కువ సమయంలో ఎక్కువ ఆయకట్టుకు నీటిని అందించే ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఆర్నెల్లలో వీలైనంత ఎక్కువ ఆయకట్టుకు నీటిని అందించాలనీ, అలాంటి ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాబోయే రెండేండ్లలో పూర్తయ్యే ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు నిర్ణీత గడువుతోపాటు లక్ష్యాలను చేరుకునేలా కార్యాచరణ రూపొందించుకోవాలని కోరారు. ఎప్పుడో అయిదారేండ్లకు పూర్తయ్యే ప్రాజెక్టులపై దృష్టి సారించి, అక్కడ నిధులను ఖర్చు చేయటం వల్ల ఉపయోగం ఉండబోదన్నారు. ఇప్పటికే 75 శాతం, అంతకుమించి పనులు పూర్తయిన ప్రాజెక్టులపై దృష్టి సారిస్తే వచ్చే ఖరీఫ్‌లోగా మరింత ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశముంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పనులను పూర్తి చేసేందుకు ఉన్న అడ్డంకులు, అవరోధాలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు ప్రధానంగా విద్యుత్ విభాగంతో బిల్లుల చెల్లింపులకు సంబంధించిన సమస్యలున్నాయనే విషయాన్ని ఈ సందర్భంగా అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ ఇతర విభాగాలతో సమన్వయం లోపిస్తే పనులు ముందుకెళ్లే పరిస్థితి ఉండబోదన్నారు. అందువల్ల ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలతో...ఒక సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సాగునీటి విభాగం అధికారులకు ఆయన సూచించారు. భూ సేకరణ వేగంగా పూర్తయ్యేందుకు రెవెన్యూ విభాగంతోనూ సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఆయా సమన్వయ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలతో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని ముందుకెళ్లాలని మార్గదర్శనం చేశారు.

చిన్న కాళేశ్వరం, మోడికుంటవాగు, లోయర్ పెన్‌గంగా, ఛనఖా కొరటా, జే చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, కోయిల్ సాగర్ లిఫ్ట్, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్, జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్, రాజీవ్ భీమా లిఫ్ట్, ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్ఎల్బీసీ, డిండి లిఫ్ట్, ఎస్సారెస్పీ 2, సదర్‌మట్ బ్యారేజ్, నీల్వాయి, పాలెంవాగు ప్రాజెక్టులను వీలైనంత తొందరగా పూర్తి చేసేందుకు అవకాశాలున్నాయని సాగునీటి అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. సంబంధిత వివరాలతో వారు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

ఎంత కాలంలో ప్రాజెక్టులు పూర్తవుతాయి? ప్రస్తుతానికి వాటి పనుల్లో పురోగతి ఎంత? అవి పూర్తవటానికి ఎన్ని నిధులు కావాలి? అనే అంశాలతో కూడిన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించారు. అనంతరం సీఈలతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్ఈలతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో
సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యం

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యం చెందారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. గురువారం సీఎంను కలిసేందుకు ఆయన నివాసానికి వెళ్లి గంటలకొద్దీ వేచిచూశామని చెప్పారు. అనంతరం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా విద్యార్థుల గోస తీరడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా విద్యావ్యవస్థలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా తయారైందని చెప్పారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉంచుకుని కనీసం ఇంతవరకు పూర్తిస్థాయి సమీక్ష కూడా నిర్వహించలేదని అన్నారు. ఇంటికి వస్తున్న వారందరినీ కలుస్తున్నా అని అంటున్న రేవంత్‌రెడ్డి విద్యార్థి నాయకులను ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల్లేవనీ, మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేని పరిస్థితిలో ఉన్నాయని విమర్శించారు. గురుకులాల విద్యార్థుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను ఇవ్వాలనీ, పౌష్టికాహారం అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగంపై వెంటనే సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరిం చాలనీ, లేదంటే విద్యా ర్థులను సమీకరించి ఉద్య మిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్య క్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఇటిక్యాల రామకృష్ణ, గ్యార నరేష్, బానోత్ రఘురాం, కాసోజు నాగ జ్యోతి, బాలసాని లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ ఔట్‌సోర్సింగ్ కార్మికుల
వేతనాలు విడుదల చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖలోని పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 19 నెలల వేతనాలను విడుదల చేయాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ లేఖ రాశారు. జీవో నెంబర్ 527 (క్యాటరింగ్ విధానం) రద్దు చేసి పాత విధానం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ జీవో 60 ప్రకారం వేతనాలను చెల్లించాలని కోరారు. వారికి ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించారని తెలిపారు. 2022, అక్టోబర్ వరకు నెలకు రూ.12 వేల వేతనం చెల్లించారని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జీవో నెంబర్ 527ను పంపించి పీఎంహెచ్ హాస్టళ్లలో క్యాటరింగ్ విధానం అమలు చేయాలని నిర్ణయించారని పేర్కొన్నారు. ఆ జీవో ప్రకారం వేతనాలు రూ.2,800 తగ్గిపోయాయని వివరించారు. గతంలో పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేశారనీ, ఇప్పుడు అమలు చేయడం లేదని తెలిపారు. వేతనాలను పెంచాల్సింది పోయి తగ్గించడం, ఉన్న సౌకర్యాలను తొలగించడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. 527 జీవోను రద్దు చేసి పాత పద్ధతిలోనే వేతనాలను చెల్లించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శికి గతేడాది అక్టోబర్ ఆరున గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ లేఖ రాశారని వివరించారు. గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రస్తుతం 19 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటికి సంబంధించి చెక్‌లు ఈ ఏడాది జులై రెండు నుంచి ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని వేతన బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 527 జీవోను రద్దు చేసి ప్రీ మెట్రిక్‌లో హాస్టళ్లలో చెల్లిస్తున్న విధంగా 60 జీవో ప్రకారం వేతనాలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

చాకలి ఐలమ్మ త్యాగాలు స్ఫూర్తిదాయకం

- ప్రావిజన్స్ అండ్ లాజిస్టిక్స్ ఐజీపీ రమేశ్



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

చారిత్రక తెలంగాణ సాయుధ పోరాటంలో సమరయోధురాలు చాకలి ఐలమ్మ జరిపిన వీరోచిత పోరాటం, చేసిన త్యాగాలు ఈ తరానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పోలీస్ ప్రావిజన్స్ అండ్ లాజిస్టిక్స్ ఐజీపీ రమేశ్ అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని డీజీపీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఆమె ఫొటోకు పూల మాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం రజాకార్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అనేక మంది వీర యోధులు అలుపెరుగని పోరాటం జరిపి వీర మరణం పొందారని అన్నారు.

ఈ పోరాటంలో నల్గొండ జిల్లాలో వీర వనిత చాకలి ఐలమ్మ నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా జరిపిన పోరును ఎవరూ మర్చిపోలేరని శ్లాఘించారు. ఆ కాలంలోనే ఒక మహిళ సాయుధులైన రజాకార్ ముష్కరులను ఎదురించటంలో చూపిన సాహసం, ధీరోదాత్తలు ప్రస్తుత మహిళలు తమ సమస్యలను ఎదుర్కోవ టానికి అనుసరణీయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ కార్యాలయానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత గూటికి హౌజింగ్ ఉద్యోగులు

242 మంది డిప్యూటేషన్లు రద్దు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన ఉద్యోగుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు గురువారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జీవో 109ని జారీ చేశారు. రవాణా, రహదారులు, భవనాల శాఖ మొదలగు విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులందరూ వెంటనే రిలీవ్ అయి, మాతృ సంస్థల్లో రిపోర్ట్ చేయాలని జీవోలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా గత ప్రభుత్వం 2016లో హౌజింగ్ విభాగంలో ఉన్న ఉద్యోగులందరినీ ఇతర శాఖలకు డిప్యూటేషన్ మీద పంపించి కార్పొరేషన్‌ను తాత్కాలికంగా మూసేసింది. అప్పటి నుంచి ఉద్యోగులు ఇతర శాఖల్లో పని చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి పేదలకు ఉచితంగా ఇచ్చేందుకు సిద్ధపడింది. ఈ క్రమంలో వారి సేవలను ఉపయోగించుకునేందుకు డిప్యూటేషన్లను రద్దు చేసినట్టు సమాచారం.

ఉద్యోగుల హర్షం

డిప్యూటేషన్లను రద్దు చేసి తిరిగి తమను మాతృ సంస్థలోకి మార్చడం పట్ల హౌజింగ్ ఉద్యోగుల సంఘం హర్షం ప్రకటిం చింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు గవ్వ రవీందర్ రెడ్డి, కార్యదర్శి రఘువీర్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొగ్గుల వెంకటరామిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ వెంకయ్య, ఆంజనేయులు,చామర్తి, అనీల్ కుమార్ రెడ్డి, తదితరులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాల్సిందే...

లేదంటే సమ్మెకైనా సిద్ధం

నోటిఫికేషన్లను అడ్డుకుంటాం

కాంగ్రెస్ ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

ఆర్టిజన్ల మహాధర్నాలో జేఏసీ నేతల హెచ్చరిక



టీజీఎస్‌పీడీసీఎల్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్న ఆర్టిజన్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్- జేఏసీ డిమాండ్ చేసింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడానికైనా సిద్ధమని ప్రకటించింది. ఆర్టిజన్లను కాదని, కొత్త నోటిఫికేషన్లు వేసినా, కొత్త నియామకాలు చేపట్టినా అడ్డుకుంటామని హెచ్చరించింది. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని మింట్‌కంపౌండ్ టీజీఎస్‌పీడీసీఎల్ ఆఫీస్ వద్ద ఆర్టిజన్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తమను కన్వర్షన్ చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.

'వుయ్ వాంట్ కన్వర్షన్' అంటూ పెద్ద పెట్టున నినదించారు. ఈ సందర్భంగా ఆర్టిజన్లను కన్వర్షన్ చేసే వరకు జేఎల్ఎం, సబ్ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేటర్స్ పోస్టులను భర్తీ చేయొద్దంటూ టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మెన్, ఎమ్‌డీకి జేఏసీ నేతలు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ధర్నానుద్దేశించి జేఏసీ చైర్మెన్ కే ఈశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో 23వేల మంది ఆర్టిజన్లు పని చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తున్నామంటూ 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని అనేక వేదికల మీద చెప్పిందన్నారు. ఆ తర్వాత ఆర్టిజన్లను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఈనేపథ్యంలో ఆర్టిజన్లు జేఏసీగా ఏర్పడి ఉద్యమానికి సిద్ధమవుతున్నట్టు తెలిపారు. కేసీఆర్ మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తమను కన్వర్షన్ చేయాలని కోరారు. 23వేల మంది ఆర్టిజన్లలో చాలా మంది రిటైర్డ్ అయ్యారనీ, కొంత మంది విధి నిర్వహణలో ప్రమాదానికి గురై చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా మిగిలింది 20వేల మందేననీ, వారినైనా కన్వర్షన్ చేయాలని కోరారు. ఆర్టిజన్లలో డిప్లొమా చేసిన వారికి సబ్ ఇంజనీర్, ఐటీఐ చదివిన వారికి జూనియర్ లైన్‌మెన్, డిగ్రీ, బిటెక్, ఎంటెక్ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్, టెన్త్, ఇంటర్ చదివిన వారికి సబార్డినేటర్ పోస్టు, చదువుకోలేని వారికి అటెండర్ పోస్టులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈవిధంగా చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపైగానీ, విద్యుత్ సంస్థపైగానీ ఆర్థిక భారం పడదని వివరించారు. ప్రస్తుతం ఈ పోస్టులు ఉన్నాయనీ, ఆ పోస్టుల్లో ఆర్టిజన్లను నియమించాలని సూచించారు. ఈ విషయాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ ఉద్యమాన్ని ప్రారంభించామని తెలిపారు.

కన్వర్షన్ చేయకుండా రిక్రూట్ చేస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయకుండా నోటిఫికేషన్లు ఇచ్చి రిక్రూట్‌మెంట్ చేస్తామంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని జేఏసీ చైర్మెన్ హెచ్చరించారు. ఏ త్యాగాలకైనా జేఏసీ సిద్ధంగా ఉందన్నారు. ఈ విషయంలో ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కామ్‌లు చొరవ చేసి ముందుకెళితే సమ్మెకు వెళ్లడానికైనా సిద్ధమని హెచ్చరించారు. ఆ దశకు పోకుండా కచ్చితంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గతంలో కొంత మంది ఉద్యోగులను పర్మినెంట్ చేశారనీ, ఆర్టిజన్లను కన్వర్షన్ చేయడం చట్టం వ్యతిరేకం కాదని చెప్పారు. జేఏసీ కన్వీనర్ ఎంఏ వజీర్ మాట్లాడుతూ జీవో 308 ప్రకారం కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. కొంత మంది ఆర్టిజన్లు ఉన్నత చదవులు చదివినా వారికి ప్రమోషన్లు రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. డిపార్టుమెంట్లలో ఎన్నో సర్వీస్ రూల్స్‌కు సవరణలు జరిగాయనీ, ఆర్టిజన్ల విషయంలో ఎందుకు జరగదని ప్రశ్నించారు. ఆర్టిజన్ల గోసను పట్టించుకోవాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ తమకు అనేక హామీలు ఇచ్చిందనీ, వాటిని నెరవేర్చాలని కోరారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ కో చైర్మెన్ ఎల్లయ్య మాట్లాడుతూ ఆర్టిజన్స్ కార్మికులు రిటైర్‌మెంట్ అయినా కూడా కనీసం బెనిఫిట్స్ పూర్తి చేయడంలేదన్నారు. మరణించిన కుటుంబాలకు సాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నాయకులు శారద మాట్లాడుతూ ఆర్టిజన్లు తమ బాధను చెప్పుకునేందుకే ఇక్కడికి వచ్చారన్నారు. వయస్సు మీరుతున్న ఆర్టిజన్లు తమ పిల్లల భవిష్యత్తు కోసం కలిసికట్టుగా పోరాటం చేయాలని కోరారు. జేఏసీ నేత శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆర్టిజన్స్‌పై కొన్ని యూనియన్లు విలనిజం చూపిస్తున్నాయని విమర్శించారు. ఉద్యమవీరుల స్ఫూర్తితో ముందుకు పోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో చైర్మెన్లు, కో కన్వీనర్లు బి శంకర్, వి. నరేందర్, జి నాగరాజ్, జి. అరవింద్‌కుమార్, వడ్ల తిరుపతి, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్టిజన్లు తరలి వచ్చారు.



మహారాష్ట్రను ముంచెత్తిన భారీ వర్షాలు

ఐదుగురు మృతి

ముంబయికి ఐఎండీ ఆరెంజ్ అలర్ట్

థానే, పాల్ఘర్, రాయ్‌గడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్

ముంబయి : భారీ వర్షాలు మహారాష్ట్రను ముంచెత్తుతున్నాయి. బుధవారం కురిసిన భారీ వర్షాలు పలు నగరాలను అతలాకుతలం చేశాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో ఐదుగురు మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. ఇందులో ఒకరు ముంబయి నుంచి, ఒకరు రాయ్‌గఢ్ నుంచి, ముగ్గురు కళ్యాణ్ నుంచి ఉన్నారు. రాష్ట్రంలో వర్షాలు మరింతగా పడే అవకాశమున్నదని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) హెచ్చరించింది. అలాగే, ముంబయికి ఆరెంజ్ అలర్ట్‌ను, థానే, పాల్ఘర్, రాయ్‌గడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. ముంబయిలో ఉరుములు, మెరుపులతో గంటలకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. గురువారం పూణేలో అత్యధికంగా 133 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందనీ, సెప్టెంబర్‌లో ఇదే అధిక వర్షపాతమని గుర్తించింది. ఇది పూణే చరిత్రలో మూడో అత్యధిక వర్షపాతమని తెలిపింది.

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముంబయి, థానే, పాల్ఘర్, పూణే, పింప్రి- చింఛ్వాడ్‌తో సహా పలు జిల్లాల్లో పాఠశాలలు, కాలేజీలు మూతపడ్డాయి. భారీ వర్షాల తర్వాత గురువారం ముంబయిలో వాహన రాకపోకలు, రైలు సర్వీసులు కొనసాగాయి. నగరంలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విమానాలు, లోకల్ ట్రైన్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలకు ముంబయిలోని అంధేరీ ఈస్ట్‌లో ఒక మహిళ ఓపెన్ డ్రైయినేజీలో మునిగి చనిపోయింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపటం కోసం బృహన్‌ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భూషన్ గగ్రానీ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయటానికి ఆదేశించారు. మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని తెలిపారు. వచ్చేనెల 1 వరకు ముంబయిలో వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షాలకు ముంబయిలోని పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. పలు ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది.

జిల్లాకో స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ యువత భవిత కోసం రాష్ట్రంలో జిల్లాకో స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ ఏర్పాటు చేయబోతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీఎస్) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో "స్వచ్ఛత హి సేవా" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయి నైపుణ్యాలను యువతలో పెంపొందించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించే అగ్రగామిగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే తెలంగాణా నైపుణ్యాల విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా యువతను తయారు చేసేందుకు ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మారుస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుందని అన్నారు. గత పదేండ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందగా, ఈ ఏటీసీలతో రానున్న పదేండ్లలో 4 లక్షల మంది శిక్షణ పొందేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.

కేటీఆర్‌కు సృజన్‌రెడ్డి లీగల్ నోటీస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సూదిని సృజన్‌రెడ్డి లీగల్ నోటీస్ పంపించారు. అమృత్ టెండర్ల విషయంలో లేనిపోని ఆరోపణలు చేసినందుకు లీగల్ నోటీసులు పంపించినట్టు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరి బంధువు కావడం వల్లే టెండర్లు ఇచ్చారంటూ కేటీఆర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. తన కంపెనీ శోభ కన్‌స్ట్రక్షన్‌ను 2010లో ఏర్పాటు చేశామనీ, 2020 నుంచి ఏఐఆర్, ఐహెచ్‌పీలతో కలిసి జాయింట్ వెంచర్‌గా పనిచేస్తుందని పేర్కొన్నారు. అమృత్ టెండర్లలో రూ.1,110 కోట్ల పనులను నిబంధనల ప్రకారమే దక్కించుకున్నామని అన్నారు. కేటీఆర్ చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవాలనీ, లేకుంటే చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని నోటీస్‌లో పేర్కొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో మత్స్యకారుల హక్కుల కోసం ఉద్యమం

మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మత్స్యకారుల హక్కుల కోసం ఉద్యమాలు సాగించాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు.

గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి చైతన్య సభల ప్రారంభం సందర్భంగా ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. లెల్లెల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీతారాములు మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకైన ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించటం నేటి పరిస్థితుల్లో ఎంతో అవసరమన్నారు.

భూస్వాముల దమనకాండకు వ్యతిరేకంగా నిలబడి, అణగారిన రైతులకు, వృత్తిదారులకు ఆమె ధైర్యాన్నిచ్చిం దని గుర్తు చేశారు. ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిందన్నారు. కార్యక్రమంలో వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ. రమణ, టీఎంకెఎంకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడుగు వెంకట్, కల్లెల్లి లలిత ఉపాధ్యక్షులు శీలం శ్రీను, చనమోని శంకర్, మురారి మోహన్ దుబ్బుల దుర్గయ్య, దర్గయ్య, గాండ్ల అమరావతి, బక్కి బాలమాని, గాడేపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేదు

50కి పైగా మందులు గుర్తింపు

ఇందులో పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు

ఇవన్నీ మార్కెట్‌లో విరివిగా దొరికేవే

గుర్తించిన సీడీఎస్‌సీఓ



న్యూఢిల్లీ : మార్కెట్‌లో విరివిగా దొరికే 50కి పైగా మందులలో నాణ్యతలేదని తేలింది. సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌-సీఓ) తన తాజా సర్వేలో దీనిని గుర్తించింది. నాణ్యతలేనివిగా గుర్తించబడిన ఈ మందులు హైబీపీ, యాసిడ్ రీఫ్లక్స్ వంటి సాధారణ పరిస్థితులలో వినియోగించబడతాయి. అయితే, సీడీఎస్‌సీఓ నాణ్యత లోపాన్ని గుర్తించటంతో మార్కెట్‌లో వీటి అమ్మకం, వినియోగంపై ఆందోళనలు కలుగుతున్నాయి. కొత్త మందులు, క్లినికల్ ట్రయల్స్ ఆమోదానికి బాధ్యత వహించే ఉన్నత సంస్థ సీడీఎస్‌సీఓ. అయితే, ఈ మందులు మార్కెట్‌లో విరివిగా అమ్ముడవుతున్నాయని సీడీఎస్‌సీఓ హెచ్చరించింది. పలు కంపెనీలు తయారు చేసిన 50కి పైగా మందు బ్యాచ్‌లలో నాణ్యత కరువైందని తన తాజా సర్వే సమాచారంలో సీడీఎస్‌సీఓ గుర్తించింది. ఇందులో ప్రముఖ కంపెనీలు విక్రయించిన మందులు కూడా ఉండటం గమనార్హం. ఉదాహరణకు, సన్ ఫార్మాస్యూటికల్స్ తయారు చేసిన పుల్మోసిల్ (సిల్డెనాఫిల్ ఇంజెక్షన్) నిర్దిష్ట బ్యాచ్ నాణ్యత లేనిదిగా గుర్తించబడటం గమనార్హం. అయితే, దీనిపై సన్ ఫార్మాస్యూటికల్స్ స్పందించింది. ఆ నాణ్యతలేని ఉత్పత్తిని తాము తయారు చేయలేదనీ, అది నకిలీదని వివరించింది. అలాగే, ఇదే కంపెనీ తయారు చేసిన యాసిడ్ రీఫ్లక్స్, అజీర్ణానికి సాధారణంగా ఉపయోగించే పాంటోసిడ్ నిర్దిష్ట బ్యాచ్ కూడా నకిలీదిగా గుర్తించబడటం గమనార్హం. అలాగే, గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ ద్వారా తయారైన రక్తపోటును నియంత్రించటం కోసం ఉపయోగించే రెండు మెడిసిన్‌ల కలయిక అయిన టెల్మా హెచ్ (టెల్మిసర్టన్ 40 ఎంజీ, హైడ్రోక్లోరోథియాజైడ్ 12.5 ఎంజీ టాబ్లెట్స్ ఐపీ)లోనూ నాణ్యత లేదని గుర్తించబడింది. అయితే, గ్లెన్‌మార్క్ సైతం నిర్దిష్ట బ్యాచ్‌ను తాము తయారు చేయలేదని వివరించటం గమనార్హం. అనేక ప్రముఖ కంపెనీలు కూడా ఇవే సమాధానాలను వినిపించాయి. ఏదైనా నిర్దిష్ట బ్యాచ్ డ్రగ్ ప్రమాణాలను పాటించటంలో విఫలమైతే.. అదే పేరుతో విక్రయించబడే అన్ని మందులూ నాణ్యతను కలిగిలేవని కాదని సీడీఎస్‌సీఓ సీనియర్ అధికారి ఒకరు వివరణ ఇచ్చారు.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అటవీ శాఖ అనుమతులు అడ్డంకి

పెసా చట్టం జాతీయ సదస్సులో మంత్రి సీతక్క | గ్రామ సభలకు అనుమతులివ్వాలని కేంద్రానికి సూచన

ఇతర జిల్లాలో హైడ్రాలాంటి వ్యవస్థ ఏర్పాటుకు డిమాండున్నట్టు వెల్లడి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అటవీ శాఖ అనుమతులు అడ్డంకిగా మారుతున్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. కనీస వసతులు కల్పించడానికి సైతం సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల గిరిజన ప్రాంతంలో పాఠశాల భవనానికి అనుమతి లేకపోవడంతో కంటైనర్ పాఠశాలను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఇలా రోడ్లు, మంచినీటి వ్యవస్థ, స్కూల్స్, విద్యుత్, హెల్త్ సెంటర్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణాలకు అటవీ చట్టాలు ఆటంకం కలిగిస్తున్నాయని తెలిపారు. గురువారం ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పెసా చట్టంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో తెలంగాణ నుంచి మంత్రి సీతక్కతో పాటు పెసా యాక్ట్ అమలులో ఉన్న పలు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు హాజర య్యారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన సీతక్క సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆదివాసీ, గిరిజనుల అభివద్ధి, పెసా చట్టం అమల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, పరిష్కార మార్గాలపై ప్రసంగించారు. పెసా యాక్ట్ అమలులో ఉన్న తెలంగాణతో పాటు, 10 రాష్ట్రాల్లో ఎదురవుతోన్న సమస్యలను ఈ సందర్భంగా కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. గనులు, భారీ ప్రాజెక్టులకు అనుమతులు వేగంగా మంజూరవుతున్నాయని, అడవి పుత్రులకు కనీస సదుపాయాలు కల్పించే విషయంలో మాత్రం అనుమతులు రావడం లేదని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఎన్నో స్కీంల ద్వారా నిధులు ఇస్తున్నప్పటికీ... అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఆ నిధులు మురిగిపోతున్నాయని వివరించారు. ఇనాటికి అనేక గిరిజన గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు, విద్యుత్తు సదుపాయం, ఇతర మౌలిక వసతులు లేవని గుర్తు చేశారు. అటవీ, పర్యావరణ అనుమతుల్లో ఆటంకాల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతోందని నివేదించారు. అందువల్ల అటవీ ప్రాంత గ్రామాల అభివృద్ధికి గ్రామ సభలకు అధికారం ఇవ్వాలని కేంద్రానికి సూచించారు.

అక్రమ నిర్మాణాలను కాపాడుకునే యత్నం

పేదలను ముందుపెట్టి కొంతమంది కబ్జాదారులు తమ అక్రమ నిర్మాణాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. చెరువులను కాపాడాలి, భవిష్యత్ తరాలకు ఉపయోగ పడే చర్యల్లో భాగంగానే హైడ్రా కూల్చివేతలు చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. చెరువుల పరిరక్షణ కోసం హైడ్రాకు స్వయం ప్రతిపత్తి ఇచ్చామని మంత్రి తెలిపారు. తాజా వరదలతో తీవ్రంగా నష్టపోయిన మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం ప్రజల నుంచి హైడ్రాలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో చెరువులు విధ్వంసం అయ్యాయని విమర్శలు చేసిన బీఆర్ఎస్ ఎన్ని చెరువులను పునరుద్ధరించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు తాము ఆ పని చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కూల్చివేతల్లో పేదవాళ్ల ఇండ్లు ఉంటే న్యాయం చేస్తామని ఇప్పటికే సీఎం హామీ ఇచ్చారని, వారికి త్వరలోనే వేరే చోట డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయిస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ స్కీంలో ఏమైనా తప్పిదాలు జరిగితే కేంద్రమే చర్యలు తీసుకుంటుందన్నారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సృజన్‌రెడ్డిని రేవంత్ రెడ్డి బంధువుగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు. అదే సజన్ రెడ్డితో కల్వకుంట్ల ఇంటి ఆడపడుచు లిక్కర్ వ్యాపారాలు చేసినట్టు, ఆ స్కాంలో పాత్ర ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేకు సజన్ రెడ్డి మేనల్లుడని గుర్తు చేశారు. ఈ నిజాలను దాచి పెట్టి దురుద్దేశాలతో సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం పై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయండి : కేంద్ర మంత్రికి సీతక్క విజ్ఞప్తి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికలు జరగలేదన్న కారణంతో గ్రామ పంచాయతీలకు కేంద్రం ప్రభుత్వం నిలిపివేసిన 15 వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్.పి సింగ్ బఘేల్‌ను మంత్రి సీతక్క కోరారు. సదస్సు ముగిసిన తరువాత కేంద్ర మంత్రి బఘేల్‌తో ఆమె ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు రావాల్సిన నిధులను విడుదల చేయలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడు తుందని బఘేల్ దష్టికి తీసుకెళ్లారు. అయితే సీతక్క విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఇదే రకమైన విజ్ఞప్తులు వస్తున్నందున, గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణపై మంత్రుల బృందం సమావేశం

వందకు పైగా వస్తువుల మీద పన్నురేటు సర్దుబాటుపై చర్చ

తదుపరి మీటింగ్ వచ్చేనెల 20న

న్యూఢిల్లీ : జీఎస్టీ రేటు హేతబద్ధీకరణపై ఆరుగురు మంత్రుల బృందం (జీఓఎం) సమావేశమైంది. వందకు పైగా వస్తువుల మీద పన్ను రేటు సర్దుబాటుపై చర్చించింది. కొన్ని వస్తువులపై 12 నుంచి ఐదు శాతానికి పన్నులు తగ్గించటం కూడా ఇందులో చర్చకు వచ్చింది. బుధవారం జరిగిన సమావేశపు విషయాన్ని పశ్చిమ బెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమ భట్టాచార్య వెల్లడించారు. జీఓఎం తదుపరి సమావేశం అక్టోబర్ 20న ఉంటుందని తెలిపారు. సైకిళ్లు, వాటర్ బాటిళ్ల మీద పన్నుల హేతుబద్ధీకరణపై ఈ సమావేశంలో చర్చకు వస్తుందని వివరించారు. 12 శాతం పన్ను స్లాబ్‌లో మెడికల్, ఫార్మా సంబంధిత ఐటెమ్స్‌పై పన్ను రేటు తగ్గింపు అంశాన్ని కూడా జీఓఎం చేపట్టింది. వచ్చే నెల సమావేశంలో దీనిపై చర్చించాలని నిర్ణయించింది. బేవరేజెస్ వంటి కొన్ని వస్తువులపై ప్రస్తుతం ఉన్న 28 శాతం జీఎస్టీ నుంచి పన్ను రేట్లను పెంచే అవకాశం పైనా మంత్రుల బృందం చర్చించింది. ప్రస్తుతం జీఎస్టీ 5, 12, 18, 28 శాతం స్లాబులతో ఫోర్-టైర్ ట్యాక్స్ నిర్మాణాన్ని కలిగి ఉన్నది. జీఎస్టీ చట్టం ప్రకారం వస్తువులు, సేవలపై 40 శాతం వరకు పన్ను విధించొచ్చు.

వచ్చేనెల 20న జరిగే సమావేశంలో జీఓం తన సభ్యుల అభిప్రాయాలపై చర్చించనున్నది. అలాగే, తమ ప్రతిపాదనలను జీఎస్టీ కౌన్సిల్ ముందు ఉంచనున్నది. జీఎస్టీ కౌన్సిల్‌కు కేంద్ర ఆర్థికమంత్రి నేతృత్వం వహిస్తారు. ఇందులో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మంత్రులు ఉంటారు. ప్రస్తుత ఆరుగురు సభ్యుల జీఓఎంలో కూడా యూపీ ఆర్థిక మంత్రి సురేశ్ కుమార్ ఖన్నా, రాజస్థాన్ ఆరోగ్య సేవల మంత్రి గజేంద్రసింగ్, కర్నాటక రెవెన్యూ మంత్రి కృష్ణ బైరె గౌడ, కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్ బాలగోపాల్‌లు ఉన్నారు.

నవతెలంగాణ

సమస్యలు మనకంటే బలమైనవి కావు. పోరాటం చేయకుండానే వాటి చేతిలో ఓడిపోవటం మరీ తప్పు - అబ్దుల్ కలాం

శుక్రవారం 27 సెప్టెంబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు?

'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు?' అన్నట్టు ఉంది నేడు దేశంలో గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరు. ఏవరు ఏమనుకుంటే నాకేంటి? ఏలినవారి మనసెరిగి నడుచుకోవడమొక్కటే ఏకైక పరమావధి అన్నట్టు ఉన్నవారి వ్యవహారం రోత పుట్టిస్తోంది. తాజాగా తమిళనాడు గవర్నర్ లౌకిక తత్వంపై చేసిన వ్యాఖ్యలు ఇందుకో పరాకాష్ట! బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికైన బీజేపీయేతర ప్రభుత్వాలను కూలదోయడం, కుదరకుంటే ఇబ్బందులకు గురిచేయడం, ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు పొడవడం ఓ విధానంగా సాగుతోంది. ఇందుకు గవర్నర్‌ల వ్యవస్థను అడ్డు పెట్టుకోవడం ఆనవాయితీగా మారింది.

తరచూ ఇలాంటి వివాదాలతో 'సమాఖ్య భావన' బీటలు వారడానికి రాజ్‌భవనే పుణ్యం కట్టుకుంటున్న వైనాన్ని కళ్లకు కడుతున్నాయి. రాష్ట్రపతి ప్రతినిధిగా రాష్ట్రాల్లో గవర్నర్లు నిర్వహించాల్సిన రాజ్యాంగ విహిత బాధ్యతలు పరిమితమైనవి, నామమాత్రమైనవి. ఏదైనా రాజ్యాంగ సంక్షోభం తలెత్తినప్పుడు తెరపైకి వచ్చి అత్యవసరంగా విధ్యుక్తధర్మం నిర్వర్తించాల్సిన గవర్నర్లు ఆ హద్దును దాటి తామే సంచలనాలకు కేంద్రబిందువుగా మారితే ఎలాగుంటుందో తెలుసుకోవడానికి ఈ పదేండ్ల ఉదంతాలు చాలు.

'కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి పూర్తి భిన్నమైన రాజకీయ పక్షం పాలనలో ఏ రాష్ట్రమైనా ఉంటే అక్కడి గవర్నర్ పోషించే పాత్ర ఎలా ఉంటుంది?' రాజ్యాంగసభ సభ్యులుగా బిశ్వనాథ్ దాస్ సంధించిన ప్రశ్న ఇది. అటువంటి సందర్భాల్లో గవర్నర్లు ఢిల్లీ ప్రభువుల సంకుచిత వ్యూహాల్లో పావులై, రాష్ట్ర ప్రభుత్వాల పాలిట అపర సైంధవులుగా పరిణమిస్తారన్న సందేహన్ని ఆనాడే ఆయన ఎత్తిచూపారు. అది నూరుపాళ్లు వాస్తవమేనని అనేకసార్లు రుజువైంది. తాజాగా 'లౌకికతత్వం మన దేశానికి అవసరం లేదు. సెక్యులరిజం అనే భావన యూరప్ నుంచి వచ్చిందని, మనం దాన్ని అనుసరించవలసిన అగత్యం మనకు లేదు' అని తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగానే కించపరుస్తున్నాయి. ఇలా అసంబద్ధంగా ఏదో ఒకటి మాట్లాడే ఈ 'ప్రథమ పౌరుల' తీరు సమాజాన్ని కలవరపరుస్తోంది. రాజకీయ నిరుద్యోగుల పునరావాస కేంద్రాలుగా రాజ్‌భవన్లు మారడం వలనే ఆ రాజ్యాంగ వ్యవస్థ ఔన్నత్యం ఇంత మసిబారిపోతోంది!



ఆయన సెక్యులరిజం మనకు అనవసరం అని చెప్పి ఊరుకోలేదు. ఇది యూరప్ దేశాల భావన అనీ అక్కడ చర్చికి, రాజ్య వ్యవస్థకు మధ్య చెలరేగిన ఘర్షణ కారణంగా సెక్యులరిజం అన్న భావన రూపుదిద్దుకుందని కూడా ఆయన సెలవిచ్చారు. ఇది అచ్చు గుద్దినట్టు బీజేపీ అభిప్రాయమే. కాకపోతే ఈయన నోటినుంచి బయటకు వచ్చింది. అందులో ఆశ్చర్యం లేదు. తిరువనంతపురంలోని తిరువత్తూరులో హిందూధర్మ విద్యాపీఠం స్నాతకోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాని రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి రాజ్యాంగాన్ని తూలనాడే రీతిలో మాట్లా డడం ఆయన చిత్త వైపరీత్యానికి సంకేతం. అలాంటి వ్యకికి ఆ హోదాలో అర్హతే ఏ మాత్రమూ లేదు.

సెక్యులరిజానికి తప్పుడు భాష్యం చెప్పి దేశాన్ని మోసగించారు అని కూడా రవి వ్యాఖ్యానించారు. సెక్యులరిజం భారతీయ భావన కాదట.సెక్యులరిజం అన్న మాటను చేర్చడాన్ని తప్పుపట్టడం ఆయన లాంటి వారు మాత్రమే చేయగల దుస్సాహసం. ప్రస్తుత గవర్నర్లు కేంద్రం చేతుల్లో కీలుబొమ్మలై ప్రజాతంత్ర విలువలను మంటగలుపుతున్నారు. బూటాసింగ్, భండారీల వారసులు అడుగడుగునా తారసపడుతున్నారు. గవర్నర్ అంటే కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో మెలగవలసిన వ్యక్తి కాదని, ఆ పదవి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని 'ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సర్వోన్నత న్యాయస్థానం కుండబద్దలుకొట్టింది. అవన్నీ అటకెక్కిపోయిన దురవస్థలో గవర్నర్ల ఎంపికలో పార్టీ విధేయతే ఏకైక ప్రమాణమైంది.

ఆమధ్య 'ప్రభుత్వమంటే నేనే' నంటూ ఢిల్లీ మాజీ ఎల్‌జీ నజీబ్ జంగ్ నోరు పారేసుకోవడం నివ్వెరపరిచింది. 'ప్రతీ దేశం ఏదో ఒక మతంపైనే ఆధారపడిందనీ, భారతదేశం అందుకు మినహాయింపేమీ కాదని' ఇదే తమిళనాడు గవర్నర్ గతంలోనూ వివాదస్పద వ్యాఖ్యలే చేశారు.తరచూ ఇలాంటి వివాదాలతో 'సమాఖ్య భావన' బీటలు వారడానికి రాజ్‌భవనే పుణ్యం కట్టుకుంటున్న వైనాన్ని కళ్లకు కడుతున్నాయి. రాష్ట్రపతి ప్రతినిధిగా రాష్ట్రాల్లో గవర్నర్లు నిర్వహించాల్సిన రాజ్యాంగ విహిత బాధ్యతలు పరిమితమైనవి, నామమాత్రమైనవి.

ఏదైనా రాజ్యాంగ సంక్షోభం తలెత్తినప్పుడు తెరపైకి వచ్చి అత్యవసరంగా విధ్యుక్తధర్మం నిర్వర్తించాల్సిన గవర్నర్లు ఆ హద్దును దాటి తామే సంచలనాలకు కేంద్రబిందువుగా మారితే ఎలాగుంటుందో తెలుసుకోవడానికి ఈ పదేండ్ల ఉదం తాలు చాలు. ఈ వివాదాస్పద గవర్నర్‌లందరూ పూర్వా శ్రమంలో కాషాయదళ కీలక నేతలే కావడం, వీరివల్ల ఇక్కట్లకు గురవుతున్నవన్నీ బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలే కావడం యాధృచ్ఛికమేమీ కాదు. కనుక ఇదంతా ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న వారి ప్రాయోజిత రాజకీయ తతంగమేనన్నది సత్యదూరమూ కాదు.

ప్రపంచ యుద్ధాలు-పర్యాటకంపై ప్రభావం!

ప్రపంచ పర్యాటక రంగానికి ఊతమివ్వడానికి 27 సెప్టెంబర్ 1970న తీసుకున్న తీర్మానం ప్రకారం అంతర్జాతీయ టూరిజం సమాజం 'ఐరాస వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్, యుయన్‌డబ్ల్యూటీఓ'ను ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించడంతో ప్రతియేటా 27 సెప్టెంబర్‌న ప్రపంచ దేశాలు 'ప్రపంచ పర్యాటక దినం (వరల్డ్ టూరిజం డే)' పాటించుట 1980 నుంచి ఆనవాయితీగా మారింది.పర్యాటకంతో ప్రపంచ దేశాల, ప్రాంతాల ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక, ఉద్యోగ ఉపాధుల విలువలు ప్రభావితమవుతాయనే అవగాహనను కల్పించేందుకు 'ప్రపంచ పర్యాటక దినం' వేదికలను వినియోగిస్తారు. 1997నుంచి 'వరల్డ్ టూరిజం డే' వేడుకలను ఒక్కోదేశంలో నిర్వహిస్తూ, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి పదిమంది ఉద్యోగుల్లో ఒక్కరు పర్యాటక రంగానికి సంబంధించిన ఉద్యోగాల్లోనే ఉన్నారని అంచనా.

సృజనశీల వినూత్న భావనలు, డిజిటల్ విప్లవఫలాలతో టూరిజం పరిశ్రమ రూపు



రేఖలు ఆసాంతం మారిపోయాయి. వరుస విపత్తులతో అభివృద్ధి చెందిన, చెందు తున్న ప్రపంచ దేశాల సామాజిక, ఆర్థికరం గాలు కుదేలై చితికిపోయాయి. కరోనా విపత్తు వల్ల ప్రపంచ టూరిజం నాలుగు ట్రిలియన్లు నష్టపోయిందని అంచనా వేశారు.పర్యాటక పరిశ్రమలోని మిలియన్ల ఉద్యోగాలను కరోనా మింగేసింది. విపత్తు మబ్బులు పూర్తి తొలగిన వేళ నేడు ప్రపంచ పర్యాటకం కొత్తపుంతలు తొక్కుతున్నది.ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినం-2024 నినాదంగా "పర్యాటకం- ప్రపంచ శాంతి (టూరిజమ్ అండ్ పీస్)" అనే థీమ్ తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. 'ఐరాస సుస్థిరా భివృద్ధి లక్ష్యాలు-2030'లో ప్రముఖమైన పేదరిక నిర్మూలన, ఆకలిని అంతం చేయడం, లింగ సమానత్వం, ఆర్థిక ప్రగతి లాంటివి సాధించడానికి పర్యాటకరంగం కూడా ఎంతగానో దోహదపడుతుందని గమనించాలి.


ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంగా పర్యాటకానికి పేరుంది. గత కొన్నేండ్లుగా ప్రపంచ పర్యాటకం అనేక రెట్లు పెరగడం, ఆధునిక హంగులు తొడగడం చూశాం. 1950లో అంతర్జా తీయ పర్యాటకులు 5 మిలియన్లు (2 బిలియన్ల డాలర్ల రెవెన్యూ) నమోదు కాగా, 2019లో 1.3 బిలియన్ల (1,260 ట్రిలియన్ డాలర్ల రెవెన్యూ) వరకు పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. గ్లోబల్ జీడీపీలో పర్యాటక పరిశ్రమ పదిశాతంగా ఉందని అంటున్నారు. ప్రతియేటా ప్రపంచ పర్యాటకాభివృద్ధి మూడో శాతం పెరగాలని లక్ష్యం చేసుకున్నారు. పర్యా టక పరిశ్రమ ఊపులో ఉన్న భారత్‌లో దేశ జీడీపీలో 9.2 శాతంగా ఉంటూ అతివేగంగా విస్తరిస్తోంది. దేశ పర్యాటక పరిశ్రమలో 43 మిలియన్ల ఉద్యోగులు పని చేస్తూ, ప్రతియేటా పది మిలియన్లకు పైగా విదేశీ పర్యాటకులతో దిన దినాభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా ఉత్తర భారతం నుంచి దక్షిణం వరకు వెలసిన విలక్షణ జన జాతులు, విభిన్న సంస్కృతులు, వారసత్వ సంపదలు, ప్రకృతి పరిచిన అందాల విందులు, తీర్థయాత్రలు, అద్భుత కట్టడాల రమణీయతలు, పర్యాటకంతో ప్రపంచశాంతి, సోదర భావం, సాంస్కృతిక వినిమయం, పర మత సహనం లాంటి ముఖ్య అంశాలు సిద్ధి స్తాయి.

ఇండియాలోని యూపీ (అయోధ్య), కేరళ, ఉత్తరాఖండ్, హిమాచల్ లాంటి రాష్ట్రాలు పర్యాటకం మీదనే అధికంగా ఆధారపడి ఉన్నాయి. అంతర్జాతీయ విమానాయాన రంగంతో మొదలు అతి చిన్న గ్రామీణ బడుగు కుటుంబాల వరకు అందరినీ అక్కున చేర్చుకొని పర్యాటకులకు ఆహ్లాదాన్ని, స్థానికులను ఉపాధులను ప్రసాదిస్తున్న పర్యాటక పరిశ్రమ మళ్లీ తేరుకొని, పుంజుకుని మిలియన్ల కుటుంబాల్లో నవ్వుల పువ్వులు పూయించాలని కోరుకుందాం. ప్రతి ఒక్కరం జీవితంలో తరుచుగా పర్యాటక ప్రణాళికలు వేసుకొని, పర్యాటకుడిగా ఆనం దానుభూతులు పొందుతూ, పలువురికి ఉద్యోగ ఉపాధుల కల్పనలో పరోక్షంగా దోహదపడదాం. విశ్వ రహస్యాలు, దర్శనీయ స్థలాలు, ప్రకృతి అందాలు తెలుసుకునేందుకు ప్రయాణాలకు సిద్ధమవుదాం.

(27 సెప్టెంబర్ 'ప్రపంచ పర్యాటక దినం')

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి,
9949700037

నిజాంకు మోడీకి పోలికలున్నాయా?



డాక్టర్ దేవరాజు మహారాజు

సెప్టెంబర్ నెల రాగానే తెలంగాణలో విమోచన దినమని కొందరు, విలీన దినమని మరి కొందరు చర్చలు ప్రారంభిస్తారు. వాటిని కాదని ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలనా దినమని ప్రకటించింది. అవన్నీ సరేగానీ, ప్రస్తుత భారత ప్రధాని మోడీకి, ఒకప్పుడు తెలం గాణ రాజ్యాన్ని పాలించిన నిజాం రాజుకు ఏవైనా దగ్గరి పోలికలు ఉన్నాయా - అని మాత్రం ఎవరూ ఆలోచించడం లేదు. నిశితంగా గమనిస్తే చాలా ఉన్నాయి. మోడీ ప్రభుత్వపు నేటి తీరుతెన్నులు ఇప్పుడు దేశ ప్రజలందరికీ తెలుసు. కానీ, నాటి హైదరాబాద్ పాలకుడి పరిపాలనా విధానాలు నేటితరం వారికి అంతగా తెలియకపోవచ్చు.అందువల్ల ఆ విషయాలు ఒకసారి సమీక్షించుకుందాం. పరమత ద్వేషం- ప్రజల్ని పీడించడం- ప్రయివేటు సేవలకు అధికారాలివ్వడం- స్వయాన విద్యావిహీనులు కావడం-వంటి అనేక అంశాల్లో నిజాం రాజుకు, ప్రధాని మోడీకి పోలికలున్నాయి. ఆనాడు నిజాం ప్రభుత్వం రజాకార్లకు అధికారమిస్తే, ఈనాడు మోడీ ప్రభుత్వం గో సంరక్షకులకు, జై శ్రీరామ్ సేనకు, సనాతన వాదులకు అధికారమిచ్చింది. ఆనాడు రజాకార్లు మహిళలతో నగ్నంగా బతుకమ్మలాడిస్తే, ఈనాడు మోడీ భక్తులు మణిపూర్ లో మహిళల్ని నగ్నంగా ఊరేగించారు.నిజాం-మోడీ ఇద్దరూ నిరంకుశ పాలకులే! వీరిద్దరిదీ ప్రజావ్యతిరేక విధానాలే! సాయుధ పోరాటంలో తెలంగాణ ప్రజలు నిజాం అధికారాన్ని మట్టి కరిపించారు. ఈ దేశప్రజలు తమ పోరాటాలతో మోడీ ప్రభుత్వ విధానాలను తిప్పి కొడుతున్నారు. దేశ వ్యాప్తంగా వెలసిన షహీన్‌బాగ్‌లు, రైతుల నిరసనలు తక్కువేమీ కాదు. హైద్రాబాద్ నిజాంది గత చరిత్ర అయితే, కేంద్రంలో అధికారంలో ఉన్న ఆరెస్సెస్ ప్రచారక్ మోడీది - నడుస్తున్న చరిత్ర. మోడీ పాలన అమోఘంగా సాగుతోంది.అనే ఒకవర్గం ఉన్నట్టే-అధ్వాన్నంగా ఉందని అసహ్యించుకునే వారే అధికం! నిజాం మంచోడు, సెక్యులర్ అన్నది కొద్దిమందయితే, ఏపాటి సెక్యులర్? అని ప్రశ్నించే ప్రజలే అధికం!

నిజాం రాజు అంత మంచోడే అయితే, గిరిజన నాయకుడు కొమురం భీం ఎందుకు ఆయన మీద తిరగబడ్డాడు? ఎందుకు పోరాడాడు? మనం ఆలోచించాలి. నిజాం గొప్పోడే అయితే నిజాం రజా కార్లపై- షోయబుల్లాఖాన్ ఎందుకు అక్షరాయు ధాలు సంధించాడు? ఎందుకు హత్య చేయబడ్డాడు? రచయితల్ని, హేతువాదుల్ని హత్య చేయించడంలో మోడీ ఏమీ వెనకబడలేదు. నిజాం మంచోడే అయితే మరి చిట్యాల ఐలమ్మ ఎందుకు నవాబు పాలన మీద తిరగబడింది? కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాళ్లూ ఎందుకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు? 'మా నిజాము రాజు తరతరాల బూజు' అని మహా కవి దాశరథి ఎందుకు ఎద్దేవా చేశాడూ? స్వయంగా తుపాకిపట్టి ఎందుకు పోరాడాడు? గోల్కొండ ఖిల్లా కింద గోరి కడతామని యాదగిరి ఎందుకు పాటెత్తుకున్నాడు? ఆ బీడ్ రోడ్డులో నారాయణ్‌రావు పవార్ ఎందుకు నిజాం కారుమీద బాంబు విసిరాడూ? నిజాం మంచోడు, గొప్పోడు- అని అన్నవాడికి మెదడు సరిగా పనిచేసి ఉండదు. ఇన్నేండ్ల తర్వాత వీరనారి ఐలమ్మ పోరాటానికి గుర్తింపు లభించింది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలకు చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు మార్చింది. నిజాం రాజు నిజాయితీ గురించి ఒక విష యం చెప్పుకోవాలి. ఆయన మన ప్రధాని మోడీలాగా ఎం.ఎ. డిగ్రీ సృష్టించుకోలేదు. అయితే తనకూ దేవుడికి (అల్లాకు) సంబంధం ఉందని- మోడీ లాగే ప్రకటించుకున్నాడు.

ఏడో నిజాం నవాబ్ ఉస్మాన్ అలీఖాన్ అధికారంలోకి రాగానే తన తండ్రి కాలం నుండి మంత్రి పదవిలో ఉన్న కిషన్ పర్‌షాద్‌ను తొలగించాడు. ఒక హిందువుకు అత్యున్నత పదవిలో ఉండే అర్హత లేదనే కదా? పరమత సహనం నిజాంకు మోడీకి ఒకేలా ఉన్నట్టుంది కదా? ఇంకా "తూ కిషన్ పర్షాద్ హైతో-మై ఖుదా పర్షాద్ హూ" అని ఈసడించుకున్నాడు. నువ్వు కృష్ణుడి ప్రసాదమైతే, నేను ఖుదా (అల్లా) ప్రసాదాన్ని అని నిజాం చెప్పుకున్నాడు. నాన్ బయాలజికల్ ప్రధాని మాటలు ఇలాగే ఉన్నాయి కదా? పైగా హిందువుల గుర్తులపై, బొట్లపై నిజాం తన మతద్వేషాన్ని వెళ్లగక్కాడు. మోడీ తక్కువ వాడా? 'వారు వేసుకున్న బట్టలతోనే మీరు వారిని గుర్తుపట్టొచ్చు' అని ద్వేషాన్ని దేశవ్యాప్తం చేశారు. నిజాం దౌర్జన్యాలనన్నింటినీ ఆరోజుల్లో 'రహబరే దక్కన్' అనే ఉర్దూ పత్రిక ధైర్యంగా ప్రచురించింది. ఇక్కడి ప్రజలను ఊచకోత కోసేందుకు లాతూర్ నుండి ఒక పరమ కిరాతకుడైన ఖాసిం రజ్వీ అనేవాణ్ణి పిలిపించి, నిజాం అతని అనధికార సైన్యమైనా రజాకార్లకు మితిమీరిన స్వేచ్ఛనిచ్చాడు. అందుకే వారి దౌర్జన్యాలు హీనాతి హీనంగా ఉండేవి. మోడీ హయాంలో జరిగిన, జరుగుతున్న గుజరాత్, మణిపూర్ మారణకాండలు, దళితులపై దాడులు. అన్యమతస్తుల ఇండ్లపై చేస్తున్న బుల్‌డోజర్ దాడులూ, కూల్చివేతలూ నాటి రజాకార్ల ఆగడాల్ని తలపిస్తున్నాయి. అలాగే రైతుల్ని పీడించడంలో నిజాంకు మోడీకి దగ్గరి పోలికలున్నాయి. ఆనాడు నిజాం విధించే పన్ను (శిస్తు) ఎన్ని రెట్లు అధికంగా ఉండేదంటే-రైతుల రాబడిని మించి ఉండేది. ప్రపంచ ధనికుల్లో ఒకడిగా నిజాం గుర్తింపబడ్డాడంటే కారణం ఇదే. అదంతా పేద రైతుల పొట్టకొట్టి సంపాయించిందే. అధికారికంగా ఇంకా బయటపడలేదు గానీ, మోడీ కూడా ప్రపంచ ధనికుల్లో ఒకడు. దేశ విదేశాల కాంట్రాక్టులన్నీ మోడీ అదానీకి ఇప్పించి, వచ్చిన లాభాలన్నీ తన ఖాతాలో వేసుకుంటున్నాడనీ, ఆ రకంగా అదానీ పేరు చెప్పి మోడీ ప్రపంచ ధనికుల్లో ఒకడవుతున్నాడన్న వాదన ఉంది. ఈ విషయం ఢిల్లీ అసెంబ్లీలో నాటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన ప్రసం గంలో వెల్లడించాడు. అది భరించలేకే ఆయన్ను తప్పుడు కేసులో ఇరికించి జైల్లో వేయించాడని విశ్లేషకులు చెప్పిన మాట.

నిజాం కనుసన్నల్లో - ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలో - రజాకార్లు ఆనాటి పేద రైతుల నుండి పన్ను వసూలు చేసేవారు. పన్ను చెల్లించని రైతుల గోర్ల కింది మాంసం కత్తిరించి, గోర్లు ఊడబెరికే వారు. భర్తల సమక్షంలో భార్యల్ని అత్యాచారానికి గురిచేసేవారు. భార్యల కండ్లెదుట భర్తల్ని నరికి చంపేవారు. ఈ బాధలు పడలేక రైతులెవరైనా పారిపోతే వారి ఆచూకీ చెప్పమని కుటుంబ సభ్యుల్ని హింసించేవారు. ఆచూకీ చెప్పలేకపోతే, ఇంట్లో ఉన్న పిల్లలను ఎగరేసి, కత్తిని గుచ్చి చంపేసేవారు. ఆ రోజుల్లో రజా కార్లను చూసిన వాళ్లు ఎవరూ బతికిన దాఖలాలు లేవు. రజాకార్లు గుర్రాల మీద ఊళ్లోంచి పోతూ ఉంటే ప్రజలు ఇండ్లలోకి వెళ్లి తలుపులేసుకునేవారు. తలుపు సందుల్లోంచి భయం భయంగా చూసే వారు. ఎవరైనా పొరపాటున రజాకార్ల దండుకు ఎదురుపడితే వారిని గుర్రాలకు కట్టి పాశవికంగా ఈడ్చుకెళ్లేవారు. చచ్చిన తర్వాతే వదిలేసి వెళ్లేవారు. ఇప్పుడు ఆలోచిస్తే అసలు వీళ్లు మనుషులేనా అని అనిపిస్తుంది. ఇలాంటి వారిని దేశం మీద వదిలేసిన నిజాం రాజు మనిషేనా అని అనుమానపడాల్సి వస్తుంది.రజాకార్ల దుర్మార్గాన్ని హైద్రాబాద్ సంస్థానం 13 సెప్టెంబర్ 1948 వరకు భరించక తప్ప లేదు. అప్పటికి భారత దేశానికి స్వాతంత్రం లభించింది. కానీ, హైద్రాబాద్ సంస్థానం మాత్రం కిరాతక నిజాం అఘాయిత్యాలకు గురవుతూనే వచ్చింది. భారత ప్రభుత్వానికి ఎవరైనా సహకరిస్తే, వారందరి ప్రాణాలు తీస్తామని రజాకార్లు ఇక్కడి ప్రజల్ని బెదిరించారు. ఆ సమయంలో సుమారు ముప్పయి రెండు వేల మంది స్థానికులు సికింద్రాబాద్ మిలట్రీ కంటోన్మెంట్‌లో తలదాచుకున్నారు.



రజాకార్ల అండదండలతో పరిపాలన వెలగబెట్టిన చివరి నిజాం ఉస్మాన్ అలీఖాన్ స్వతంత్ర రా జ్యంగా ఉండిపోవాలని గట్టి ప్రయత్నమే చేశాడు. భారత యూనియన్ ప్రభుత్వం అందుకు ఒప్పు కోలేదు. అప్పుడు చివరి ప్రయత్నంగా పాకిస్థాన్‌లో భాగంగా ఉండడానికి ప్రయత్నించాడు. బంగ్లాదేశ్ ఏర్పడక ముందు అది తూర్పు పాకిస్థాన్-గా పాకిస్థాన్‌లో భాగంగా ఉండేది. దూరమైనా సరే, తన హైదరాబాదు సంస్థానం కూడా పాకిస్థాన్‌లో భాగం కావాలనుకున్నాడు. భారత యూనియన్ ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదు. లొంగిపోవాలని ఒత్తిడి తెచ్చింది.కానీ అది సాధ్యం కాలేదు. 17 సెప్టెంబర్ 1948న భారత ప్రభుత్వం, హైదరాబాదు నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసుకుంది.

నిజాం రాజు అంత మంచోడే అయితే, గిరిజన నాయకుడు కొమురం భీం ఎందుకు ఆయన మీద తిరగబడ్డాడు? ఎందుకు పోరాడాడు? మనం ఆలోచిం చాలి. నిజాం గొప్పోడే అయితే నిజాం రజా కార్లపై- షోయబుల్లాఖాన్ ఎందుకు అక్షరాయుధాలు సంధించాడు? ఎందుకు హత్య చేయబడ్డాడు? రచయితల్ని, హేతువాదుల్ని హత్య చేయించడంలో మోడీ ఏమీ వెనకబడలేదు. నిజాం మంచోడే అయితే మరి చిట్యాల ఐలమ్మ ఎందుకు నవాబు పాలన మీద తిరగబడింది? కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాళ్లూ ఎందుకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు? 'మా నిజాము రాజు తరతరాల బూజు' అని మహా కవి దాశరథి ఎందుకు ఎద్దేవా చేశాడూ? స్వయంగా తుపాకిపట్టి ఎందుకు పోరాడాడు? గోల్కొండ ఖిల్లా కింద గోరి కడతామని యాదగిరి ఎందుకు పాటెత్తుకున్నాడు? ఆ బీడ్ రోడ్డులో నారాయణ్‌రావు పవార్ ఎందుకు నిజాం కారుమీద బాంబు విసిరాడూ? నిజాం మంచోడు, గొప్పోడు- అని అన్నవాడికి మెదడు సరిగా పనిచేసి ఉండదు.

రజాకార్ల అండదండలతో పరిపాలన వెలగబెట్టిన చివరి నిజాం ఉస్మాన్ అలీఖాన్ స్వతంత్ర రా జ్యంగా ఉండిపోవాలని గట్టి ప్రయత్నమే చేశాడు. భారత యూనియన్ ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదు. అప్పుడు చివరి ప్రయత్నంగా పాకిస్థాన్‌లో భాగంగా ఉండడానికి ప్రయత్నించాడు. బంగ్లాదేశ్ ఏర్పడక ముందు అది తూర్పు పాకిస్థాన్-గా పాకిస్థాన్‌లో భాగంగా ఉండేది. దూరమైనా సరే, తన హైదరాబాదు సంస్థానం కూడా పాకిస్థాన్‌లో భాగం కావాలనుకున్నాడు. భారత యూనియన్ ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదు. లొంగిపోవాలని ఒత్తిడి తెచ్చింది.కానీ అది సాధ్యం కాలేదు.17 సెప్టెంబర్ 1948న భారత ప్రభుత్వం, హైదరాబాదు నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసుకుంది.

చివరి నిజాం ఉస్మాన్ (ఉన్మాద్) అలీఖాన్ తన పాలనలో మెజారిటీ ప్రజల భాష అయిన తెలు గును నిషేధించాడు. తెలుగు పత్రికలు దొంగతనంగా చదువుకోవాల్సి వచ్చేది. ప్రజలు తమ పండుగలు, ఊరేగింపులు, సభలు-సమావేశాలు బహిరంగంగా జరుపుకునే వీలుండేది కాదు. నాటి కవులు, రచయి తలు, పాత్రికేయులు ఎన్నోకష్టాలు పడ్డారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం చేస్తున్నది కూడా అదే-కవుల్ని, రచయితల్ని చంపించడం లేదా జైల్లో వేయించడం, పాత్రికేయుల్ని మీడియా సంస్థల్ని కొని, తన గోదీ మీడియాను తయారు చేసుకోవడం చూస్తూనే ఉన్నాం. ఒక దేశం - ఒకే ఎన్నికలు - ఒకే భాష - ఒకే మతం లాంటి వాటికి మోడీ ప్రాముఖ్యమిచ్చి అభాసుపాలవుతున్నాడు కదా? నాటి నిజాం నియంతృత్వ పాలనను మత మార్పిడులను ప్రశ్నించిన భాషోద్యమకారుల్ని, పాత్రికేయుల్ని కమ్యూనిస్టు ఉద్యమ కారుల్ని, కాంగ్రెస్ కార్యకర్తల్ని నిజాం ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా హత్య చేయించేది. వట్టికోట అళ్వారు స్వామిని, దాశరథి కృష్ణమాచార్యను జైల్లో పెట్టింది ఆనాటి నిజాం ప్రభుత్వమే కదా? ప్రత్యక్షంగా తుపాకి పట్టుకుని నిజాంకు వ్యతిరేకంగా పోరుసల్పిన కవి యోధుడు దాశరథికున్న ఘన చరిత్ర ప్రపంచంలో మరో కవికి లేదు కదా? రక్తంతో తడిసిన నాటి హైదరాబాదు సంస్థానపు చరిత్ర పుటలు ఎన్నటికీ తడి తడిగానే ఉంటాయి. అలాగే ఇప్పటి మణిపూర్, గుజరాత్ మారణ కాండలు కూడా!

- సుప్రసిద్ధ సాహితీవేత్త,
జీవశాస్త్ర వేత్త (మెల్బోర్న్ నుంచి)

రెపరెపలాడే విప్లవపతాక భగత్‌సింగ్



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

'మనుషులను చంపగలరేమో కానీ వారిలో ఉండే ఆశయాలను కాదు' అని చాటిచెప్పిన ధీరుడు సర్దార్ భగత్‌సింగ్. ఆ మహావీరుని 117వ జయంతి నేడు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో స్వేచ్ఛాకాంక్షని రగిల్చి, స్వరాజ్య సాధన పోరాటంలో చిరు ప్రాయంలోనే ప్రాణాలొదిలిన త్యాగధనుడు. భగత్‌సింగ్ పేరు వింటేచాలు రక్తం గర్వంతో ఉప్పొంగుతుంది. ఆయన ఆశయాలు, ఆలోచనలు, ఆవేశం ఎంతోమంది యువతలో స్ఫూర్తి నింపింది. గొప్ప విప్లవకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా చరిత్రలో నిలిచి పోయిన వీరుడాయన. రెపరెపలాడే విప్లవపతాక. కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు 1907, సెప్టెంబరు 27న భగత్‌సింగ్ జన్మించారు.13 ఏళ్ల వయసులో సహాయ నిరాకరణోద్యమం భగత్ సింగ్ పై విపరీత ప్రభావం చూపింది. ప్రత్యక్షంగా ఆ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన మొదటిసారి పాల్గొన్నారు. ప్రభుత్వ పుస్తకాలను,దుస్తులను తగులబెట్టారు. 1919లో జరిగిన జలియన్‌వాలా బాగ్ దురంతం భగత్‌సింగ్ స్వాతంత్యకాంక్షను మరింత రగిలించింది.అయితే గాంధీ అహింసా మార్గంకంటే హింసకు హింసే సమాధానమని నమ్మారు. గాంధీ నాయకత్వంలో జరుగుతున్న స్వతంత్ర పోరాటం రాజీ ధోరణిలో సాగుతోందని, అది మంచిది కాదని చెప్పిన తొలివ్యక్తి భగత్‌సింగ్. గాంధేయవాదంపై భగత్‌సింగ్‌కు నమ్మకం లేదు. గాంధేయవాద రాజకీయాల వల్ల స్వార్థ పరులు పుట్టుకొస్తూనే ఉంటారని ఆయన అభిప్రాయం. అదే సమయంలో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశంలో సైమన్ గోబ్యాక్ ఉద్యమం జరుగుతున్న సమయంలో లాహోర్‌లో లాలా లజపతి రాయ్ బ్రిటిష్ సాయుధ బలగాలను ఎదురొడ్డి నిలిచారు.అప్పుడు బ్రిటీష్‌వారి దాడిలో పంజాబ్ కేసరి నేలకొరిగారు.దీంతో భగత్‌సింగ్, సుఖ్ దేవ్, రాజ్‌గురులలో ఆగ్రహాన్ని నింపింది. చెమర్చిన కళ్లతోనే సాండర్స్ అంతు చూశారు. కసితీరా కాల్చి చంపారు.ఆ హత్యకు కారణమైన వారిని ఉరితీయాలని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది. అనంతరం 1929లో అసెంబ్లీపై బాంబులు విసి రారు. ఆ సంఘటనలో ఎవరూ గాయ పడక పోయినా ఆ ముగ్గురు లొంగి పోయారు. దేశం నుంచి బహిష్కరణకు గురయ్యారు. అనంతరం వారిపై బ్రిటిష్ ప్రభుత్వం సాండర్స్ హత్యా నేరం మోపింది. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు నేరాన్ని ఒప్పుకున్నారు. కోర్టులో బ్రిటిష్ వ్యతిరేక నినాదాలు చేశారు. కోర్టు వారికి ఉరిశిక్ష విధించింది. భగత్‌సింగ్ జైలులో ఉన్న సమయంలోనే అనేక రచనలు రాశారు. 23 ఏళ్ల వయస్సులో జీవితం విలువ ఏం తెలుస్తుంది. ప్రాణాలంటే అంత లెక్కలేని తనం? అంతా కుర్ర ఆవేశం? అతను ఒక తీవ్రవాది కూడా! ఇలా రకరకాలుగా భగత్‌సింగ్ గురించిన అపోహలు నాడు ప్రచారంలో ఉన్నాయి. భగత్‌సింగ్ వ్యక్తిత్వాన్ని ఆయన భావాలు, దృక్పథం సమాజాన్ని ఆయన అర్థం చేసుకున్న విధానం జీవితం పట్ల, ప్రాణాల పట్ల ఆయనకున్న అభిప్రాయాలు ఏమిటో వారి మిత్రుడు శివవర్మ రాసిన సంస్మృతు లులో వ్యక్తీకృతమవుతాయి. బ్రిటీష్ పాలకుల్ని వెళ్లగొట్టడం మాత్రమే కాదు, ఆ తర్వాత దేశంలో చోటుచేసుకునే దోపిడీలను నిర్మూలిం చాలని చాటిన వ్యక్తి భగత్‌సింగ్.ఆయన అసాధారణ రాజకీయ సైద్ధాంతిక అవగాహన ఉన్న వ్యక్తిగా వారి రచనలు స్పష్టం చేస్తాయి.శాస్త్రీయ దృక్పథాన్నే పంథాగా మార్చుకున్న మానవతావాది. సమాజాన్ని అమితంగా ప్రేమించిన సౌహార్ద హృదయుడు.

జైలుశిక్ష అనుభవిస్తున్న సమయంలో యావజ్జీవ శిక్ష విధిస్తారని భావించిన సుఖ్‌దేవ్ నాలుగు గోడల మధ్య బతకడం కన్నా ఆత్మహత్య చేసుకుని చావడం నయమంటూ రాసిన లేఖకు, ఆత్మహత్య ఆలోచన ప్రగతి నిరోధక చర్య. పిరికి చర్య కూడా! మనం నవ్వుతూ ఉరితాడును కౌగిలించుకుంటున్నాం అంటే ప్రాణాలపై ఆశలేదని కాదు మన దేశాన్ని బానిసత్వం నుంచి విముక్తి చేయడం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయం అని అర్థం. ఒకవేళ మన జీవితమంతా జైలు గోడల మధ్య సాగాల్సి వచ్చినా, ఇక్కడి నుంచే మన పోరాట మార్గాన్ని కొనసాగిస్తామని భగత్‌సింగ్ సమాధానమి చ్చారు. జైల్లోని రాజకీయ ఖైదీల హక్కుల కోసం 114 రోజులు నిరాహార దీక్ష చేసి, నిర్బంధంలోనూ పోరాటస్ఫూర్తిని రగిలించాడు. ప్రేమ అంటే జంతు ప్రవృత్తితో కూడిన వ్యామోహం కాదు. నైతిక విలువలు, సంస్కృతిపై ఆధారపడ్డ గొప్ప అనుభూతి.అది ఎన్నడూ మనిషిని దిగజార్చదు. ప్రతి మనిషి తప్పనిసరిగా లోతైన ప్రేమ భావనలు కలిగుండాలి అంటూ ఓ లేఖలో రాశారు భగత్ సింగ్.రెండు పదుల వయసులోనే ప్రేమను నిర్వచించిన భగత్‌సింగ్ మానసిక పరిణితి ఎంతగొప్పదో ఆ మాటల్లోనే అవగతమవుతోంది. తల్లిదండ్రులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని క్షమాభిక్ష కోరుతుంటే భగత్‌సింగ్ దానిక్కూడా ఒప్పుకోలేదు.

భగత్‌సింగ్‌ను ఉరితీయడానికి రెండు గంటల ముందు కూడా లెనిన్ రివల్యూషనరీ పుస్తకాన్ని చదువుతూనే ఉన్నాడు.ఆ సమయంలో భగత్‌సింగ్‌తో దేశానికి ఏమైనా చెప్పాలని అనుకుంటున్నావా? అని అడిగితే సామ్రాజ్యవాదం తగ్గి విప్లవం కొనసాగాలని పిలుపునిచ్చాడు. 12 గంటల ముందే ఉరితీస్తున్నారని తెలియగానే లెనిన్ రివల్యూషనరీ పుస్తకంలో ఒక్క అధ్యాయం కూడా పూర్తి చేయడానికి నన్ను అనుమతించరా? అని అడిగాడు. ఆయనకు ఆ పుస్తకం పట్ల ఎంత ప్రేమ ఉందో ఈ మాటతో అర్థం చేసుకోవచ్చు. కానీ ఆయన కోరిక వారు తీర్చలేదు. ఉరితీయడానికి వేదికపై నిలబడుకుని ఉన్నప్పుడు దేవుడిని తలచుకోమంటే 'ప్రజలకు కష్టాలు ఇస్తున్నందుకు నేను దేవుడిని చాలా సార్లు తిట్టుకున్నాను. అలాంటిది ఇప్పుడెలా దేవుడిని స్మరిస్తాను' అని అన్నాడు. భగత్‌సింగ్ భారతీయ సమాజంలో పెరుగుతున్న మతతత్వ స్వభావాన్ని విమర్శించడమే కాకుండా, స్వాతంత్ర్య పోరాట సంవత్సరాల్లో అస్పృశ్యత, కులం తీవ్రమైన సమస్యపై కూడా రాశాడు. పదహారేండ్ల వయస్సులో జూన్ 1928లో అతను అంటరానితనం సమస్య అనే శీర్షికతో ఒక వ్యాసం రాశాడు. అంటరానివారిని హిందూ, ముస్లిం మిష నరీ సంస్థల మధ్య విభజించాలని 1923నాటి కాంగ్రెస్ సమావేశంలో మహమ్మద్ అలీ జిన్నా చేసిన ప్రతిపాదన నేపథ్యంలో ఈ వ్యాసం వచ్చింది.ఈ వ్యాసంలో, భగత్‌సింగ్ మొత్తం 30కోట్ల జనాభాలో ఆరుకోట్ల మందిని అంటరానివారిగా ఎలా పరిగణిస్తున్నారో, వారి స్పర్శ ఇతర మానవులను, ఆలయాలను, బావులలోని నీటిని ఎలా కలుషితం చేస్తుందో ఆయన ఎత్తి చూపారు. ఇరవయ్యో శతాబ్దంలోనూ ఇలాంటి వైఖరులు కొనసాగడం నిజంగా సిగ్గుచేటు.



అణగారిన సమాజానికి చెందిన తమతోటి పౌరులను సమానంగా చూడని వ్యక్తులకు రాజకీయ హక్కులను డిమాండ్ చేసే హక్కులేదని కూడా భగత్‌సింగ్ ఉద్ఘాటించారు. కుక్కలు వంటింట్లో తిరగడం ఇబ్బంది కాదని, దళితుడు గుడిలోకి లేదా బ్రాహ్మణుడి ఇంట్లోకి ప్రవేశించడం అంతా అపరిశుభ్రంగా మార్చే కులహిందూ సమాజాన్ని ఆయన విమర్శించారు. ఈ ఆచారం అమానుషం, ఈ సామాజిక వ్యవస్థలో దళితులను జంతువులకంటే తక్కువ స్థాయికి పరిగణిస్తారు. ముస్లింలు, సిక్కులు, క్రిస్టి యన్ మత సమూహాలు దళితులను తరచుగా సమానులుగా, వారి కమ్యూనిటీలలో కుల హిందువులను కించపరచడం ప్రారంభించాయి. దళితులను ఇతరుల రాజకీయాలకు వాడుకోవద్దని, సంఘటితం కావాలని సూచించారు.

ఒకవైపు భారతీయ ప్రజానీకం ఆధ్యాత్మికతలో చిక్కుకుపోతుంటే, మరోవైపు ఐరోపాలోని భౌతికవాద సమాజాలు శతాబ్దాలుగా విప్ల వాత్మకంగా మారుతున్నాయి. ఫ్రెంచ్, అమెరికన్ విప్లవాల సమయంలో సమానత్వం ఇప్పటికే ప్రకటించబడింది. రష్యా కూడా ఇటీవల అన్ని రకాల అసమానతలను రూపుమాపడానికి విప్లవాన్ని చూసింది. అణగారిన సమాజానికి చెందిన తమతోటి పౌరులను సమానంగా చూడని వ్యక్తులకు రాజకీయ హక్కులను డిమాండ్ చేసే హక్కులేదని కూడా భగత్‌సింగ్ ఉద్ఘాటించారు.

కుక్కలు వంటింట్లో తిరగడం ఇబ్బంది కాదని, దళితుడు గుడిలోకి లేదా బ్రాహ్మణుడి ఇంట్లోకి ప్రవేశించడం అంతా అపరిశుభ్రంగా మార్చే కులహిందూ సమాజాన్ని ఆయన విమర్శించారు. ఈ ఆచారం అమానుషం, ఈ సామాజిక వ్యవస్థలో దళితులను జంతువులకంటే తక్కువ స్థాయికి పరిగణిస్తారు. ముస్లింలు, సిక్కులు, క్రిస్టి యన్ మత సమూహాలు దళితులను తరచుగా సమానులుగా, వారి కమ్యూనిటీలలో కుల హిందు వులను కించపరచడం ప్రారంభించాయి. దళితులను ఇతరుల రాజకీయాలకు వాడుకోవద్దని, సంఘటితం కావాలని సూచించారు. 23 మార్చి 1931రాత్రి 7.30గంటలకి తన స్నేహి తులయిన విప్లవ యోధులు సుఖ్‌దేవ్, రాజ్‌గురులను నిరంకుశ బ్రిటిష్ ప్రభుత్వం వారి ముగ్గురినీ వరుసగా నిల్చో బెట్టి ఉరితీసింది.ఉరికొయ్య ముందు నిల్చుని కూడా ఆ ముగ్గురూ ఏ మాత్రం భయపడలేదు. ఉరికొయ్యని ముద్దాడే ముందు చివరిసారి ఇచ్చిన నినాదం ఇంక్విలాబ్ జిందాబాద్.ఆ ధైర్యమే ప్రవాహంలా మారి నేటితరాలకు చేరింది.

గాజాలో దాడులు ఆపాలి

- పాలస్తీనా సంఘీభావ దినంగా అక్టోబరు 7
- ఐదు వామపక్షాల పిలుపు



న్యూఢిల్లీ : అక్టోబరు 7కి గాజాలో ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆరంభించి ఏడాది పూర్తి కావస్తోంది. ఈ సందర్భంగా గాజాలో దాడులు ఆపాలని పిలుపిస్తూ, ఆ రోజును పాలస్తీనా సంఘీభావ దినంగా పాటించాలని ఐదు వామపక్షాలు సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, ఆర్ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్ పిలుపిచ్చాయి. ఈ మేరకు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి. హమాస్ దాడికి ప్రతీకారమనే పేరుతో గతేడాది అక్టోబరు 7 నుంచి ఇజ్రాయిల్ సాయుధ బలగాలు దారుణమైన రీతిలో విచక్షణారహితంగా పాలస్తీనియన్లపై దాడులకు తెగబడుతున్నాయి. ఫలితంగా దాదాపు 42వేల మందికి పైగా మరణించారు. వీరిలో ప్రధానంగా మహిళలు, చిన్నారులు వున్నారు. ఇంకా వేలాదిమంది శిధిలాల కింద సజీవ సమాధి అయ్యారు. నివాస భవంతులను, పాఠశాలలు, ఆస్పతులు వేటినీ కూడా ఇజ్రాయిల్ వదిలిపెట్టడం లేదు. వైమానిక, భూతల దాడులతో అరాచకాన్ని సృష్టిస్తోంది. ఇజ్రాయిల్ కిరాతక, దురాక్రమణ చర్యల వల్ల మరణించిన వారి సంఖ్య ఆగస్టు 6 నాటికి 85 వేలకు పైనే వుండొచ్చునని ప్రముఖ మెడికల్ జర్నల్ లాన్సెట్ అంచనా వేసింది. వీటిలో ప్రత్యక్ష, పరోక్ష దాడులు రెండూ వున్నాయి.ఇజ్రాయిల్ యుద్ధోన్మాదపు చర్యలు మానవ హననానికి దారి తీస్తున్నాయని ఈ ఏడాది జనవరిలో అంతర్జాతీయ న్యాయస్థానం వ్యాఖ్యానించింది. గాజాలో తక్షణమే మిలటరీ చర్యలను నిలిపివేయాలని కోరింది. కాల్పుల విరమణ కోసం జరుగుతున్న అర్థవంతమైన అన్ని చర్చలను ఇజ్రాయిల్ ఇప్పటివరకు తొక్కేస్తూ వచ్చింది. అంతేకాదు, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై కూడా ఏడాదిపొడవునా ఇజ్రాయిల్ దాడులకు దిగింది. లెబనాన్‌కు ఈ దాడులను, ఘర్షణలను విస్తరిస్తూ పేజర్లు ఇతర కమ్యూనికేషన్ సాధనాలను పెద్ద ఎత్తున బాంబులతో పేల్చివేసింది. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయిల్ దురాక్రమణ చర్యలను, యుద్ధోన్మాదాన్ని లక్షలాదిమంది ప్రజలు నిరసించారు. తక్షణమే యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ ఆటవికమైన దాడులు మొదలుపెట్టి ఏడాది అవుతున్న సందర్భంగా శాంతి కాముకులైన భారతీయులు తక్షణమే ఈ యుద్ధాన్ని ఆపాలని కోరుతున్నారు. తక్షణమే కాల్పుల విరమణ అమలు జరిపి, ఈ ఘర్షణలకు స్వస్తి పలకాలని కోరుతూ అక్టోబరు 7ను వామపక్షాలు సంఘీభావ దినంగా పాటిస్తాయని ఐదు వామపక్షాల నేతలు ప్రకాశ్ కరత్ (సీపీఐ(ఎం), డి.రాజా (సీపీఐ), దీపాంకర్ భట్టాచార్య (సీపీఐ-ఎంఎల్ లిబరేషన్), మనోజ్ భట్టాచార్య (ఆర్ఎస్పీ), జి.దేవరాజన్ (అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్)లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇజ్రాయిల్ కాల్పుల విరమణను అమలు చేయాలని కోరుతూ ఆ రోజున ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించనున్నారు. ఇజ్రాయిల్‌కు అన్ని రకాల ఆయుధాలను ఎగుమతి చేయడాన్ని ఆపాలని, స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడేలా రెండు దేశాల ఏర్పాటు పరిష్కారానికి కృషి చేయాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నారు.

గండిపేట్‌లో మూసీ ప్రక్షాళనకు సర్వే

- రివర్‌లో 32 నిర్మాణాల గుర్తింపు
- నాలుగు బృందాలు ఏర్పాటు
- గృహాలకు మార్క్ వేసిన అధికారులు



నవతెలంగాణ-గండిపేట్

మూసీ ప్రక్షాళనలో భాగంగా మూసీ రివర్‌లో ఉన్న ఇండ్లను రెవెన్యూ అధికారులు గుర్తించారు. గురువారం రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలంలో మొత్తం 32 నిర్మాణాలను గుర్తించారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీసు అధికారుల సమన్వయంతో నాలుగు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టారు. గుర్తించిన వాటికి ఆర్బీఎక్స్ అని ముద్రవేశారు. వీటిని త్వరలో కూల్చేందుకు ఏర్పాట్లు చేస్తామని అధికారులు తెలిపారు. బండ్లగూడ కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్, గంధంగూడ మంచిరేవుల, నార్సింగి, బైరాగిగూడ గ్రామాల మీదుగా మూసీ పరివాహక ప్రాంతంలో ఇండ్లను రీ సర్వే చేశారు. హైదర్‌షాకోట్‌లో సాయి హర్షనగర్, విశాల్‌నగర్, గంధంగూడాలోని విగ్నేశ్వర్‌నగర్ కాలనీలో రివర్‌పైన ఉన్న ఇండ్లను గుర్తించారు. వారి నుంచి పూర్తి వివరాలు సేకరించారు. అధికారుల సర్వేతో మూసీ పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడ తాము దశాబ్దాలుగా ఉంటున్నామని స్థానికులు తెలిపారు. ఇంటి ట్యాక్స్‌లు కూడా కడుతున్నామని చెప్పారు. ఇప్పుడు అధికారులు వచ్చి ఇండ్లకు మార్కులు వేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐలు, మున్సిపల్, ఇరిగేషన్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోరిచెన్ శిఖరంపై గిరిజన యువకుడు

- 20 ఏండ్ల వయసులో భూక్య యశ్వంత్‌నాయక్ రికార్డు



నవతెలంగాణ -మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన యువ పర్వతారోహకుడు భుక్య యశ్వంత్‌నాయక్ 20ఏండ్ల వయస్సులో రికార్డు సృష్టించాడు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రతిష్టాత్మకమైన ప్రమాదకరమైన శిఖరం, మౌంట్ గోరిచెన్‌ను విజయవంతంగా అధిరోహించాడు. రాష్ట్రంలోని గిరిజన ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యశ్వంత్ నాయక్ తన ప్రయాణాన్ని అతి స్వల్ప వనరులతో ప్రారంభించాడు. అతనిలో ఉన్న అపారమైన పట్టుదల, కృషి, పర్వతారోహణ పట్ల ఉన్న ఆసక్తి ప్రపంచంలోని కఠినమైన శిఖరాలను అధిరోహించే స్థాయికి తీసుకొచ్చింది. 18 రోజుల పర్వతారోహణ యాత్ర సెప్టెంబర్ 4, 2024న ప్రారంభమైంది. సెప్టెంబర్ 19న మౌంట్ గోరిచెన్ శిఖరాన్ని అధిరోహించాడు. ప్రఖ్యాత ట్రాన్సెండ్ అడ్వెంచర్ కంపెనీకి చెందిన యశ్వంత్, ఈ అత్యంత క్లిష్టమైన శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన తొలి సివిలియన్ బృందంలో ఒకరిగా ఉన్నాడు. ఈ విజయం తనది మాత్రమే కాదని, తనను విశ్వసించిన, మద్దతిచ్చిన ప్రతి ఒక్కరిదని యశ్వంత్ నాయక్ అన్నారు. మౌంట్ గోరిచెన్‌ను అధిరోహించడం తన జీవితకాల స్వప్నం అన్నారు. నేడు దానిని సాధించినందుకు గర్వంగా ఉందని తెలిపారు.

కల్తీ నెయ్యి తయారీ పరిశ్రమపై ఎస్ఓటీ పోలీసుల దాడి

- మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-రాజేంద్రనగర్



అపరిశుభ్ర వాతావరణంలో గుట్టుచప్పుడు కాకుండా కల్తీ నెయ్యి తయారు చేస్తున్న పరిశ్రమపై ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో తెలంగాణ ఫుడ్స్ అనే కంపెనీ పేరుతో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. అపరిశుభ్ర వాతావరణంలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్టు గుర్తించారు. అదేవిధంగా ఎలాంటి అనుమతులూ లేవని గుర్తించారు. అక్కడ ఉన్న నెయ్యిని ఫుడ్ సేఫ్టీ అధికారులు సేకరించారు. ఈ కంపెనీ నుంచి 7,280 లీటర్ల నెయ్యిని, 80 కేజీల మైదాపిండిని స్వాధీనం చేసుకున్నారు. నెయ్యిని పరీక్షించిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏచూరిది ఎల్లలు లేని సోదరభావం

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఏచూరి పాత్ర

- సీతారం మరణం లౌకిక ఉద్యమాలకు తీరని లోటు
- ఏచూరి సంతాప సభలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిది ఎల్లలు లేని సోదరభావమని, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాలకు నాయకత్వం వహించిన వారిలో ఆయన ఒకరని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తిరువనంతపురంలో సీతారాం ఏచూరి సంతాప సభ జరిగింది. సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎస్.రామచంద్రన్ పిళ్లై అధ్యక్షతన జరిగిన ఈ సభలో పినరయి విజయన్ మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ దేశాల కమ్యూనిస్టు నేతలతో ఏచూరికి అత్యంత సన్నిహిత సంబంధాలుండేవని అన్నారు. ప్రధాన కార్యదర్శి కాకముందు కూడా ఇతర దేశాల్లోని సోదర పార్టీలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించారని గుర్తు చేశారు. అనేక దేశాల సమస్యలపై కూడా ఆయన స్పందించారని అన్నారు. విద్యార్థి రోజుల నుంచే ఏచూరి నాయకత్వ పటిమకు గుర్తింపు వచ్చిందని, వరుసగా మూడుసార్లు జేఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా రికార్డు సృష్టించారని తెలిపారు. భారతదేశంలోని మేధావులలో ఆయన ప్రముఖుడైనప్పటికీ, ఆయన అలాంటి వైఖరిని ప్రదర్శించలేదని పేర్కొన్నారు. తనకు భిన్నాభిప్రాయాలు ఉన్న అంశాలపై చర్చించేటప్పుడు చిరాకు పడకుండా ప్రజెంట్ చేయగల నేత సీతారాం ఏచూరి అని అన్నారు. కేరళలో ఏచూరికి నేరుగా తెలిసిన పార్టీ కార్యకర్తలు చాలా మంది ఉన్నారని, కేరళలో సీపీఐ(ఎం) ఎదుగుదలలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఏచూరి మరణం సీపీఐ(ఎం)కే కాక ప్రస్తుత భారతదేశ పరిస్థితిలో అన్ని లౌకిక ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. సీతారాం ఏచూరి మృతి సీపీఐ(ఎం), వామపక్ష ఉద్యమాలకే కాకుండా లౌకిక ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ(ఎం) సీనియర్ నేత ఎస్ రామచంద్రన్ పిళ్లై అన్నారు. ఏచూరితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏచూరి చాలా సమర్థుడైన రాజకీయ నాయకుడని, వామపక్ష రాజకీయ పార్టీలతో పాటు, లౌకిక, ప్రజాస్వామ్య రాజకీయ పార్టీలతో స్నేహపూర్వకంగా ఉండటానికి, కలిసి ఆందోళనలలో పాల్గొనడానికి ఆయన సమర్థవంతంగా కృషి చేశారని అన్నారు.

ప్రతిభావంతులైన రాజకీయ నాయకుల్లో ఒకరు ఏచూరి : ఎంవి గోవిందన్

విద్యార్థి ఉద్యమంతో వామపక్ష రాజకీయాల్లోకి వచ్చిన ప్రతిభావంతులైన రాజకీయ నాయకుల్లో సీతారాం ఏచూరి ఒకరని సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ మాస్టర్ అన్నారు. ఏచూరి ఒక తెలివైన కమ్యూనిస్ట్, తాత్విక, సంస్థాగత, ఆచరణాత్మక విషయాలపై దృష్టి పెట్టారని పేర్కొన్నారు. ఏచూరి జాతీయ రాజకీయాల్లో సరైన దిశానిర్దేశంతో పని చేశారని, దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించారని అన్నారు. సీపీఐ నేత పన్నయ్య రవీంద్రన్ మాట్లాడుతూ రాజకీయాలు, విద్యారంగంలోనే కాకుండా దేశ చరిత్రలో కూడా అపార జ్ఞానం ఉన్న నాయకుడు ఏచూరి అని అన్నారు. వామపక్ష, లౌకిక ఉద్యమాలతో ఏకీభవించే అన్ని పార్టీలతో నేరుగా చర్చలు జరపగలి గారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, ఎ. విజయ రాఘవన్, రాష్ట్ర మంత్రి రామచంద్రన్ కదనపల్లి, ఆర్ఎస్‌పి కేంద్ర కమిటీ సభ్యులు కెఎస్.సనల్‌కుమార్, ఏఐసీసీ కార్యదర్శి పిసి విష్ణునాథ్, కేరళ కాంగ్రెస్ నాయకుడు ఎస్.జయరాజ్, కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే పిసి విష్ణునాథ్, ఐయుఎంఎల్ ప్రధాన కార్యదర్శి పిఎంఎ సలమ్, ఎన్‌సిపి నేత పిసి చాకో, జేడీఎస్ నేత మాథ్యూ టీ థామస్, కేరళ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మోన్స్ జోసెఫ్, ఐఎన్ఎల్ ప్రధాన కార్యదర్శి కాసిం ఇర్క్యార్, కేరళ కాంగ్రెస్ (స్కారియా థామస్) చైర్మెన్ బెనోయ్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీలో తెలంగాణను ముందుకు తీసుకెళ్తాం

- స్కిల్ నాలెడ్జ్ యూనివర్సిటీతో మరిన్ని అవకాశాలు : ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్పో, ఫార్మా ప్రో ప్యాక్ ఎక్స్పోను ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ- మియాపూర్

ఐటీలో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. స్కిల్ నాలెడ్జ్ యూనివర్సిటీ ఏర్పాటుతో మరిన్ని ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్పో, ఫార్మా ప్రో ప్యాక్ ఎక్స్పో-2024 కార్యక్రమాన్ని గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ కేంద్రంలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా ఉత్పత్తుల రంగంలో, పరిశోధన, రూపకల్పనలో భారత్ ప్రాధాన్యత గురించి వివరించారు. దాదాపు 500కుపైగా ఎగ్జిబిటర్లు, 7000కు పైగా ఉత్పత్తులు, 120కిపైగా కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ తో ఈ ఏడాది కార్యక్రమం శాస్త్రీయ, ప్రయోగశాల ఫార్మా రంగాల్లో భారతదేశ వృద్ధిని మరింత పెంపొందించడంలో కీలకంగా మారిందన్నారు. ప్రపంచ ఔషధ ఉత్పత్తిలో భారత్ సహకారం ప్రస్తుతం 35 శాతం ఉండగా.. రానున్న రోజుల్లో అది 50 శాతానికి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ రంగాలకు మంచి వనరులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా జీనోమ్ వ్యాలీ నాలుగో దశ వంటి ప్రత్యేక జోన్ల వృద్ధి ద్వారా లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఈ రంగం ప్రపంచ విస్తరణలో తెలంగాణ బలమైన భాగస్వామిగా ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రపంచ లైఫ్ సైన్సెస్ వాల్యూ చైన్‌లో తెలంగాణ ఒక ముఖ్యమైన ప్రదేశంగా ఉండేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

ఈ సందర్భంగా మెస్సె మూంచెన్ ఇండియా సీఈఓ భూపిందర్‌సింగ్ మాట్లాడుతూ.. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఇది చాలా పెద్ద ట్రేడ్ ఫేర్ కార్యక్రమం అన్నారు. 70కి పైగా దేశాల నుంచి 25000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నా రని తెలిపారు. ఇందులో అగ్రశ్రేణి నిర్ణయాలు తీసుకునే వారు, ఆవిష్కర్తలూ ఉన్నారని అన్నారు. ఫార్మాస్యూటికల్స్, బయోటెక్, ల్యాబ్ టెక్నాలజీల్లో భారత్‌ను గ్లోబల్ లీడర్‌గా నిలపాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ రంగాల్లో తెలంగాణ నాయకత్వం ఎంతో గొప్పదని, రానున్న కార్యక్రమాల కోసం తెలంగాణను పర్మినెంట్ హోస్ట్ రాష్ట్రంగా నిర్వహిస్తే బాగుంటుందని ఆకాంక్షించారు.

బీఆర్ఎస్ పాలనలో విధ్వంసం

- రాష్ట్ర పునర్నిర్మాణంలో ఇంజినీర్లదే కీలక పాత్ర : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ- మియాపూర్

బీఆర్ఎస్ పాలనలో విధ్వంసమైన తెలంగాణను మళ్లీ పునర్నిర్మిస్తామని, రాష్ట్ర పునర్నిర్మాణంలో ఇంజినీర్లదే కీలక పాత్ర అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మాదాపూర్ డివిజన్ పరిధిలోని నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. టీజీపీఎస్సీ నిర్వహించిన 1540 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల నోటిఫికేషన్‌లో ఉద్యోగాలు సాధించి.. ఆర్అండ్‌బీ శాఖకు కేటాయించిన 156 మంది ఏఈఈలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లంతా కష్టపడి పని చేయాలని సూచించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ వంటి ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకోవాలి.. కానీ, కాళేశ్వరం కట్టిన ఇంజినీర్లను కాదన్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు కట్టిన వెంటనే కూలిపోయి ఇంజినీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన ఘటనలను చూశామని అన్నారు. విధి నిర్వహణలో ఇంజినీర్ల పాత్ర ఎంతో గొప్పదని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకూ తలొగ్గకుండా తమ కర్తవ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పనిపట్ల ఎంతో సునిశితంగా, ఏకాగ్రతతో పనిచేయాలని చెప్పారు.

నా మీద కక్షతో నేతన్నల పొట్టకొట్టొద్దు

- ఉపాధి కల్పించి ఆదుకోవాలి
- బీఆర్ఎస్ హయాంలో చేతినిండా పని కల్పించాం
- ప్రభుత్వం దివాళాకోరు రాజకీయం చేస్తోంది : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ / బోయినిపల్లి

"తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సిరిసిల్ల నేతన్నలను అన్ని విధాలుగా ఆదుకుని, చేతినిండా పని కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వం.. సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని సంకల్పించాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్ ఆపేసి దివాళాకోరు రాజకీయం చేస్తోంది.. నాపై కోపంతో నేతకార్మికుల పొట్టకొట్టొద్దు.. ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004నుంచి 2014వరకు కాంగ్రెస్ హయాంలో సిరిసిల్లలో ఆత్మహత్యలు జరిగాయన్నారు. ఒకే వారంలో తొమ్మిది మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. నాడు ఎంపీగా ఉన్న కేసీఆర్ చలించిపోయి పద్మశాలీ ట్రస్టుకు రూ.50 లక్షలు అందజేశారని చెప్పారు. రాష్ట్రం ఏర్పడ్డాక సిరిసిల్ల వ్యాపారవేత్తలతో నాటి సీఎం కేసీఆర్ సమావేశమై నేతన్నలను ఆదుకునేందుకు చర్చలు జరిపారన్నారు. వారికి ఉపాధి కల్పించడంతో కోటి మంది ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని కేసీఆర్ నిర్ణయించారన్నారు. అందుకు సిరిసిల్లలో బతుకమ్మ చీరలు ఉత్పత్తిచేసి ఏడాదికి 8నెలలు ఉపాధి కల్పించి నేతన్నలను ఆదుకున్నట్టు వివరించారు. స్కూల్ యూనిఫామ్స్, కేసీఆర్ కిట్‌లో ఇచ్చే చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్‌కు కానుక చీరలను సిరిసిల్లలో తయారు చేయించామన్నారు. ఎనిమిదేండ్ల పాటు రూ.3,312కోట్ల ఆర్డర్లు సిరిసిల్లకు ఇవ్వడంతో నేతన్నలకు ఉపాధి లభించి ఆత్మహత్యలు ఆగిపోయాయన్నారు. ఈ క్రమంలోనే ఆధునీకరణ వైపు ఆలోచనలను చేస్తూ సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశించిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ చీరలను నిలిపివేసి కార్మికుల ఉపాధిపై దెబ్బ కొట్టిందన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను బంద్ చేయడంతో నేతన్నల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కోటి మందికి పైగా ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు బంద్ అయ్యాయన్నారు. రాజకీయంగా తన మీద కోపంతో రాజన్న సిరిసిల్ల ప్రజలు, నేతన్నల మీద కక్ష తీసుకోవద్దని కోరారు.

సిరిసిల్లలో రేషన్ షాప్ కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. హైడ్రా మీద ప్రభుత్వం హైడ్రామా చేస్తున్నదని, ఎవరికైనా అన్యాయం జరిగితే, తమను సంప్రదిస్తే వారి తరపున న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, సెస్ చైర్మెన్ చిక్కాల రామరావు, బొల్లి రాంమోహన్ ఉన్నారు.

కొదురుపాకలో ప్రాథమిక పాఠశాల భవనం ప్రారంభం

సిరిసిల్ల బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తన అమ్మమ్మ ఊరు కొదురుపాకలో.. అమ్మమ్మ- తాతయ్య పేరు మీద ఈ స్కూలు నిర్మాణానికి తనవంతు సహాయం చేశానన్నారు. ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా బీఆర్ఎస్ విద్యార్థుల భవిష్యత్ కోసం పనిచేస్తుందన్నారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుంటానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కూస రవీందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కొండయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎల్లేస్, వైస్ చైర్మెన్ నిమ్మ వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉసురు తీస్తున్న మానసిక ఒత్తిడి



(మొదటిపేజీ తరువాయి)

నాలుగు పేజీల లేఖ రాశారు. 2021లో హైదరాబాద్‌లోని టీసీఎస్‌లో పని చేస్తున్న అనిల్ కుమార్ పని ఒత్తిడి కారణంగా ఉరి వేసుకొని చనిపోయారు. 2019లో 24 సంవత్సరాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పొగాకు హరిణి హైదరాబాద్ రాయదుర్గంలోని ఓ హోటల్ గదిలో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇక నీకు పని లేదని యాజమాన్యం చెప్పడంలో కలత చెంది ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. అదే సంవత్సరం 23 ఏండ్ల ఐటీ ఉద్యోగి గుండ్ల చైతన్య హైదరాబాద్‌లోని ఓ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఉద్యోగంతో అసంతృప్తి చెందానంటూ ఆయన ఓ నోట్ రాశారు. ఇలాంటి విషాదాంతాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

పని ఒత్తిడికి కారణాలు అనేకం

ఐటీ పరిశ్రమలో, బహుళజాతి కంపెనీలలో పనిచేస్తున్న ఉద్యోగులు పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్న ఉదంతాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే పని ఒత్తిడికి కారణాలు అనేకం. దీర్ఘకాల పని గంటలు, క్లిష్టతరమైన డెడ్‌లైన్‌లు, అధిక పనిభారం, ఉద్యోగంలో అభద్రత, సహచరులు, యజమానులతో ఘర్షణలు...ఇవన్నీ ఒత్తిడికి దారితీస్తున్నాయి. బహుళజాతి కంపెనీలు ఆకర్షణీయమైన వేతనాలు, ప్రోత్సాహకాలు అందజేస్తున్నప్పటికీ ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతున్నాయి. కంపెనీలలో పని సంస్కృతి దారుణంగా ఉంటోందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీర్ఘకాల పనిగంటలతో పాటు వారాంతపు సెలవు దినాలలో కూడా పని చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఊపిరి తీసుకోవడానికి కూడా సమయం చిక్కడం లేదన్నది వారి ఆందోళన. సెలవు పెట్టినా, ఆఫ్ రోజైనా వెంట ల్యాప్‌టాప్ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఎప్పుడు ఏ అవసరం వస్తుందో ఎవరికి తెలుసు?

ఆటవిక చర్యలపై కఠినంగా వ్యవహరించాలి

- దప్పు కొట్టనందుకు సాంఘిక బహిష్కరణ దుర్మార్గం
- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు నోరు విప్పాలి
- సామాజిక చైతన్యంతో గ్రామస్తులు ఐక్యతను చాటాలి : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్‌బాబు
- గౌతోజీగూడెంలో బాధితులకు పరామర్శ



నవతెలంగాణ-మనోహరాబాద్

నేటి ఆధునిక యుగంలో ఆటవిక చర్యలకు ఉసిగొల్పుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని.. పల్లె ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు అన్నారు. దప్పు కొట్టనందుకు గ్రామం నుంచి సాంఘిక బహిష్కరణ చేయటం దుర్మార్గమైన చర్యని, పౌర సమాజం, ప్రభుత్వం ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించాలని అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజీగూడెం గ్రామంలో దప్పు కొట్టనందుకు సాంఘిక బహిష్కరణకు గురైన దళితులు పంచమి చంద్రం, అర్జున్ కుటుంబాన్ని గురువారం కేవీపీఎస్, సీఐటీయూ నేతలు పరామర్శించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. 'మీరు ఉన్నత చదువులు చదువుకున్నా దప్పు కొట్టాల్సిందే.. లేకపోతే ఊరు నుంచి బహిష్కరిస్తాం.. సర్కార్ ఇచ్చిన భూమిని లాక్కుంటాం.. కిరాణం షాపుల్లో సరుకులు ఇవ్వనీయం.. మీతో ఎవరు మాట్లాడినా రూ.5000 జరిమానా, 25 చెప్పు దెబ్బలు" అంటూ దళిత కుటుంబంపై మధ్యయుగాల కాలపు నాటి శిక్షలు విధించడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రజల ఓట్లతో ఎన్నికైన సర్పంచి, గ్రామ పెద్దలు ఇందులో భాగం అవ్వడం దారుణమన్నారు. గ్రామంలో పెద్దలందరూ సెప్టెంబర్ 10న తీర్మానం చేసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వారిలో చైతన్యం తీసుకొచ్చి సాంఘిక బహిష్కరణను ఎత్తేయించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఈ ఘటనను ఎందుకు ఖండించలేదో చెప్పాలన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి ప్రభుత్వ ఉన్నతాధికా రులు నెల రోజుల పాటు ప్రత్యేక చైతన్య సభలు నిర్వహించాలన్నారు. ఊర్లోని విద్యావంతులు ఈ దుశ్చర్యను ఖండిస్తున్నారని, ఇది అభినందనీయమన్నారు. గ్రామంలో 31 మంది మొత్తం గ్రామ ప్రజల ఐక్యతను దెబ్బ తీశారన్నారు. బహిష్కరణకు గురైన కుటుంబానికి ప్రభుత్వం పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని కోరారు. అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్యం మాట్లాడుతూ.. డప్పు కొట్టకుంటే సాంఘిక బహిష్కరణ చేస్తారా? అని ప్రశ్నించారు. ఒక వ్యక్తి బ్రాహ్మణుడిగా పుట్టి.. అధికారిగా మారిన తర్వాత కూడా ఆఫీసర్ ఉద్యోగం చేస్తాడా, అర్చక ఉద్యోగం చేస్తాడా, ఒకవేళ అర్చక ఉద్యోగం చేయకుంటే అతన్ని ఎక్కడైనా సాంఘిక బహిష్కరణ చేశారా? అని ప్రశ్నించారు. దళితులు కావడం వల్లే సాంఘిక బహిష్కరణ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ప్రజలు ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు.

ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు బక్కెల్లి బాలకిషన్ మరాఠీ కృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు కడారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలి

- లీటర్‌పై రూ.5 ప్రోత్సాహకం అందించాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాడి రైతుల బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. గురువారం హైదరా బాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ పాడి ఉత్పత్తి దారుల సంఘం, టీజీ విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన పాడి రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించి ఆందోళన చేశారు. ప్లకార్డులు, జెండాలు పట్టుకుని తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా ప్రతి లీటర్ పాలపై రూ.5 ప్రోత్సా హకం అందించాలనీ, పాడి సంరక్షణకు మందులు, విత్తనాలు, ఎరువులు, పాల టెస్టర్లు, చాప్ కట్టర్లు, మిల్క్ అనలైజర్లు ఇతర పనిముట్లు 50 శాతం సబ్సిడీపై అందిం చాలని కోరారు. పశుపోషణ పథకాన్ని అమలు చేస్తూ, ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లించాలనీ, పాడి రైతుల పిల్లలకు ఉపకార వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. పశుసంవర్ధక శాఖలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ హరిబండి ప్రసాద్ మాట్లాడుతూ పాడి రైతులకు నెలనెలా చెల్లించాల్సిన బకాయిలు, ఇతర ప్రోత్సాహకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రైతులతో చర్చించి శాశ్వత పరిష్కారం కనుగొ నాలని సూచించారు. రాష్ట్రం వ్యాప్తంగా గ్రామా లను యూనిట్‌గా తీసుకుని పశు గ్రాసం పెంపకం కోసం ఉమ్మడిగా భూమి కేటాయించాలని కోరారు. రైతు సంఘ నాయకులు శోభన్, ఉప్పలయ్య, జిల్లాల రైతులు ఈ సందర్భంగా రైతులెదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. పాడి రైతుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవాలని సమావేశం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో వీరమల్లు రాజయ్య, జి వెంకటేష్, ఉత్తమ్, రమేష్, రాజయ్య కష్ణ, రాఘవ తదితరులు పాల్గొన్నారు

జేఎల్ తుది ఫలితాలు విడుదల చేయండి

- టీజీపీఎస్సీ చైర్మెన్‌తో మాట్లాడండి : పొంగులేటి, వేం నరేందర్‌రెడ్డికి అభ్యర్థుల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టుల భర్తీకి సంబంధించిన తుది ఫలితాలు త్వరగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సహాదారులు వేం నరేందర్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో అభ్యర్థులు కలిసి వినతిపత్రాలను అందజేశారు. 1,392 జేఎల్ పోస్టుల భర్తీకి సంబంధించిన తుది ఫలితాల విడుదల ఆలస్యం అవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. టీజీపీఎస్సీ చైర్మెన్ మహేందర్‌రెడ్డితో మాట్లాడి తొందరగా విడుదల అయ్యేటట్టుగా చొరవ తీసుకోవాలని కోరారు. చాలా ఏండ్లుగా జేఎల్ పోస్టుల నియామకాల్లేక ఉన్నత విద్యారంగం నిర్వీర్యం అయిపోయే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియామకాల ప్రక్రియను వేగవంతం చేయడం అభినందించదగ్గ విషయమని చెప్పారు. ప్రభుత్వ ఉన్నత విద్యారంగం బలోపేతం కావాలంటే 1,392 జేఎల్ పోస్టుల నియామకాలను త్వరగా పూర్తి చేయాలని వివరించారు. టీజీపీఎస్సీ చైర్మెన్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఫలితాలు తొందరలో విడుదలయ్యేలాగా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారని తెలిపారు. ఇంటర్ విద్యాశాఖ ద్వారా నియామక పత్రాలను ఇప్పిస్తా మన్నారని వివరించారు. 2022 డిసెంబర్‌లో 1,392 జేఎల్ పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దసరాలోపు తుది జాబితాను విడుదల చేసి నియామక పత్రాలను ఇవ్వాలని అభ్యర్థులు కోరారు. ఈ కార్యక్రమంలో జేఎల్ అభ్యర్థులు లింగనాయక్, వేణురావు, కాంతయ్య, సుమన్, మక్సూద్, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

30న ఫార్మాసిస్టు పోస్టులకు జాబ్ మేళా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఫార్మసీలో డిప్లొమా, డిగ్రీ, మాస్టర్స్ చేసిన వారికి ఈనెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ టీ.రాము తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అపోలో ఫార్మసీ కంపెనీ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను ఫార్మాసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్ ఉద్యోగాలకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 30న ఉదయం 11 గంటలకు అభ్యర్థులు నేరుగా బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లా యి మెంట్ బ్యూరో వద్ద హాజరు కావాలని ఆయన కోరారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర వల్లే జైనూర్‌లో మతకలహాలు

- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : ప్రొఫెసర్ పద్మజాషా, సంధ్య, పర్వీన్ డిమాండ్
- నిజనిర్ధారణ కమిటీ నివేదిక విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర వల్లే ఈనెల నాలుగున మతకలహాలు చోటుచేసుకున్నాయని ప్రొఫెసర్ పద్మజాషా, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రతినిధులు ఎస్క్యూ మసూద్, ఖలీదా పర్వీన్, సారా మాథ్యూ, కనీజ్ ఫాతిమా, సొందె అన్వార్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జైనూర్‌లో జరిగిన సంఘటనకు సంబంధించి నిజ నిర్ధారణ కమిటీ నివేదికను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ జైనూర్‌లో జరిగిన ఘటన పూర్తిగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజకీయ కోణంలో కుట్ర చేశాయని విమర్శించారు. ఆదివాసీలు, ముస్లింల మధ్య చిచ్చుపెట్టి మతకలహాలను రెచ్చగొట్టేలా వ్యవహరించాయని అన్నారు. ముస్లింలే లక్ష్యంగా బీజేపీ, దాని అనుబంధ సంఘాలు దాడులకు పాల్పడ్డాయని వివరించారు. ఈ ఘటనపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇంటెలిజెన్స్, పోలీసుల ఘోరంగా వైఫల్యం చెందారని విమర్శించారు. మతకలహాలు జరుగుతాయని పసిగట్టి వాటిని నిరోధించేందుకు చర్యలు చేపట్టలేదన్నారు. ఈ ఘటనలో విఫలమైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలనీ, డీఎస్పీ, స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలనీ, మత కలహాలు జరగకుండా చూడాలని కోరారు. ఆదివాసీల భుజంపై తుపాకీ పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సున్నితమైన ఈ సమస్య వ్యాప్తి చెందేలాగా రాజకీయ పార్టీలు వ్యవహరించొద్దని సూచించారు. నేరం ఎవరు చేసినా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ ఘటనలో ఓ మహిళపై ముస్లిం వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపర్చారనీ, అయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ వ్యక్తి కొట్టినందుకు ముస్లింల ఇండ్లు, దుకాణాలను కాల్చడం, లూటీ చేయడం సరైంది కాదన్నారు. ఈ ఘటనలో బాధితులకు రక్షణ కల్పించాలనీ, నేరస్తులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మతపరమైన కోణంలో ఈ ఘటనను చూడొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హిందూత్వ ఎజెండా పేరుతో సాగిస్తున్న అరాచకాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఆ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కను త్వరలో కలిసి నిజ నిర్ధారణ కమిటీ నివేదికను సమర్పిస్తామని చెప్పారు.

సీఎంఆర్ 'ధాన్యం'లో దగా..!

రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లులపై దాడులు

- కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయిలు బట్టబయలు
- ఖమ్మం జిల్లాలో రూ.82 కోట్ల ధాన్యం బకాయి
- ఎస్ఏఆర్ రైస్‌మిల్లు యజమాని రమాజ్యోతిపై క్రిమినల్ కేసు
- స్థానిక అధికారులతో కుమ్మక్కై అడ్డగోలు వ్యవహారం
- రూ.కోట్లలో ముడుపులపై స్థానిక అధికారిని ప్రశ్నించిన మిల్లర్?



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)లో పెద్దఎత్తున బకాయి పేరుకుపోవడమే కాకుండా దగా జరుగుతున్నట్టు ఎప్పటి నుంచో పెద్దఎత్తున ఆరోపణలొస్తున్నాయి. ఈ క్రమంలో నెంబర్ 1 మహిళా పారిశ్రామికవేత్త, ఎస్ఏఆర్ రైస్‌మిల్ యజమాని రమాజ్యోతి అడ్డగోలు వ్యవహారం బట్టబయలైంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిల విషయంలో రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయ్స్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలో పెద్దమొత్తం లో బకాయి పడిన కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలోని ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులోనూ రెండ్రోజులపాటు సోదాలు చేశారు. సీఎంఆర్‌లో 25వేల టన్నుల ధాన్యం వ్యత్యాసం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దీని విలువ రూ.82 కోట్లకుపైగా ఉంటుందని భావిస్తున్నారు. రైస్‌మిల్ యజమాని రమాజ్యోతిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఖమ్మం జిల్లా పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ కీలక అధికారికి రూ.కోట్లలో ముడుపులు ఇచ్చి రమాజ్యోతి ఈ వ్యవహారం నడిపినట్టు తెలుస్తోంది. రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి ఆ అధికారి సైతం [illegible] పాల్గొనడంతో మిల్లు యాజమాన్యం అక్కడే నిలదీసినట్టు సమాచారం. తమ నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని ఇప్పుడిలా దాడులు చేయడమేంటని సదరు అధికారిని మిల్లు యాజమాన్యం ప్రశ్నించినట్టు చర్చ నడుస్తోంది.

సకాలంలో సీఎంఆర్ అప్పగించని మిల్లర్లపై చర్యలు

ధాన్యం ఇచ్చేటప్పుడే మిల్లర్ల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ తీసుకోవడంతో పాటు బ్యాంకు గ్యారెంటీ లేకుండా వేల కోట్ల విలువ చేసే ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించే విధానానికి స్వస్తి పలకాలని ప్రభుత్వం నిర్ణయించింది.

2.51 లక్షల క్వింటాళ్ల తేడా

2022-23 రబీ సీజన్, 2023-24 ఖరీఫ్ సీజన్‌కుగాను ఎస్ఏఆర్ రైస్ మిల్లుకు 3,50,622.65 క్వింటాళ్ల ధాన్యాన్ని అప్పటి ప్రభుత్వం అప్పగించింది. 99,122.68 క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే ఈ రైస్‌మిల్లులో మర ఆడించారు. మిగిలిన 2,51,499.97 క్వింటాళ్ల తేడా ఉందని అధికారులు గుర్తించారు. ఆ ధాన్యాన్ని బయటకు తరలించడంతో మిల్లర్ రమాజ్యోతిపై కేసు నమోదు చేశారు. అధికారులు తేల్చిన వ్యత్యాసాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తామని యజమాని చెబుతున్నారు. స్థానిక అధికారులు మిల్లర్‌తో కుమ్మక్కైన కారణంగానే ఇంత పెద్ద మొత్తంలో తేడా వస్తున్నా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

స్థానిక అధికారులు రూ.కోట్లలో ముడుపులు తీసుకొని.. మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ అప్పగిం చకపోయినా ఉదాసీనతతో వ్యవహరి స్తుండటంపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో భాగంగానే 2022-23 రబీ, 2023-24 ఖరీఫ్ సీజన్‌లో సీఎంఆర్ అప్పగించని సంస్థలపై ప్రభుత్వం కొరడా ఝులిపిస్తోంది. దీనిలో భాగంగా కొద్దిరోజుల కిందట సూర్యాపేట జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇమ్మడి సోమనర్సయ్య, ఆయన సోదరుడు సోమయ్యను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఖమ్మం జిల్లాకు చెందిన రమాజ్యోతిపై క్రిమినల్ కేసు పెట్టారు. మిల్లుకు కేటాయించిన ధాన్యానికి తగినట్టుగా బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగిం చకపోగా.. మర ఆడించిన ధాన్యం నిల్వల్లో పెద్ద మొత్తంలో తేడా వస్తుండటంపై రమాజ్యోతితో పాటు మహబూబాబాద్ జిల్లాలోని మరో రెండు మిల్లులపైనా కేసులు నమోదు చేశారు.

అధికారితో కుమ్మక్కు..

స్థానిక అధికారులతో కుమ్మక్కైన రమాజ్యోతి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటారనే టాక్ కొణిజర్ల మండలంలో వినిపిస్తోంది. స్థానిక రైతుల ధాన్యం కాకుండా వలస వచ్చిన ఆంధ్రా ప్రాంత రైతుల వద్దను కొనుగోలు చేస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఆమె ఓ లారీ బియ్యాన్ని బయట నుంచి తెప్పించారు. ఆ రైస్ తడిసిందని లారీని తన దగ్గరే ఉంచుకున్నట్టు సమాచారం. ఆంధ్రా నుంచి రేషన్ బియ్యం లోడ్‌లకు లోడ్‌లు తీసుకొచ్చి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యానికి బదులు వాటిని మర ఆడించి సర్కారుకు సరఫరా చేస్తుంటారనే ఆరోపణలు రమాజ్యోతిపై ఉన్నాయి. స్థానిక రైతుల వడ్లు కొనుగోలు చేయకపోవడం, క్వింటాల్‌కు రెండు కేజీల తరుగు తీయాల్సి ఉండగా ఎస్ఏఆర్ మిల్లులో పది కిలోలు కోత పెడతారని రైతులు వాపోతున్నారు. వీటన్నింటికీ స్థానిక అధికారి ఒకరు ఆమెకు సహకరిస్తుంటా రనే టాక్ వినిపి స్తోంది. ప్రస్తుతం మిల్లు యజమాని పరారీలో ఉన్నారు. దీనిపై జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్‌ను వివరణ కోరగా.. మిల్లర్ రమాజ్యోతిపై క్రిమినల్ కేసు నమోదు చేశామని చెప్పారు. ధాన్యం వ్యత్యాసాన్ని భర్తీ చేస్తామని యజమాని అంటున్నా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ వ్యవ హారంలో తమ డిపార్ట్‌మెంట్ అధికారిపై వస్తున్న ఆరోపణలపై స్పందించేందుకు విముఖత వ్యక్తం చేశారు.

చాకలి ఐలమ్మ విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- రవీంద్రభారతిలో ఐలమ్మ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ పోరాటానికి, త్యాగానికి గుర్తుగా వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. త్యాగానికి గుర్తుగా ఐలమ్మ పేరును మహిళా విశ్వవి ద్యాల యానికి రాష్ట్ర ప్రభుత్వం పెట్టిందని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఐలమ్మ త్యాగాన్ని గుర్తిం చని వారు, ఇప్పుడు నిరసనలు తెలుపు తున్నారని విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీసీలను విస్మరిం చిందన్నారు. కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో బలహీన వర్గాల ఫెడ రేషన్‌లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది త్యాగాలు చేశారని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఐలమ్మకు నిజమైన నివాళి అంటే ఆమె పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగ డమేనని అన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. ఐలమ్మ చరిత్రను పుస్తక రూపంలోకి తీసుకురావాలని అన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమాన్ని నిర్వహిం చామని గుర్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిపోయిందని విమర్శించారు. ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య మాట్లాడుతూ.. తొలి భూ పోరాటానికి, సామాజిక ఆధునిక పరిణా మానికి నాంది పలికిన ధైర్యశాలి ఐలమ్మ అని కొని యా డారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక ఐలమ్మ అని అన్నారు. ఈ కార్య క్రమంలో రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, రాపోలు జయప్రకాష్, వెనుకబడిన తరగ తుల సంక్షేమ శాఖ కమిషనర్ బి.బాలమాయ దేవి, మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు, తెలంగాణ అత్యంత వెను కబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ముఖ్య కార్య నిర్వహణ అధికారి కె.అలోక్ కుమార్, తెలం గాణ వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మల్లయ్య బట్టు, తెలంగాణ రజక సహకార సంఘాల సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కో చైర్మెన్లు మావురపు నరసింహ, చిట్యాల శ్వేతా ఐలమ్మ, కన్వీనర్లు పాల్గొన్నారు.

హేతుబద్ధీకరణ ఉత్తర్వులకు వ్యతిరేకంగా రేపు జిల్లా కేంద్రాల్లో నిరసనలు

- అశాస్త్రీయమైన సర్దుబాటు జీవో 25ను సవరించాలి : విద్యాశాఖ సంచాలకులకు యూఎస్‌పీసీ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసమంజసమైన హేతుబ ద్ధీకరణ ఉత్తర్వులకు వ్యతిరేకంగా శనివారం జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) పిలుపునిచ్చింది. అశాస్త్రీయమైన సర్దుబాటు జీవో 25ను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని కోరింది. గురువారం హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, పి నాగిరెడ్డి కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికొక టీచరు ఉండాలనీ, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులుండాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20 గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మీడియం వారీగా లెక్కించాలని సూచించారు. అదనపు ఉపాధ్యాయులను 1:30 నిష్పత్తిలో లెక్కించాలని తెలిపారు. 2021 ఆగస్టులో ఏకపక్షంగా ఇచ్చిన హేతుబద్ధీకరణ జిఒ 25 పట్ల సర్వత్రా వ్యతిరేకత రావటంతోనే అమలు చేయకుండా నిలిపేశారని పేర్కొన్నారు. ఇప్పుడు అదే జీవోలోని నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయటం వల్ల పాఠశాలలకు నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పలు పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి మూసివేతకు దారితీస్తాయని వివరించారు. జీవో 25లోని నిబంధనలను సవరించాలని డిమాండ్ చేశారు.

దేశవ్యాప్తంగా ఓపీఎస్ అమలు చేయాలి

- సోమనాథం కమిటీ నివేదికను బహిర్గతపర్చాలి : ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం కేంద్ర క్యాబినెట్ ఇటీవల తీసుకున్న ఏకీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) అమలును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పెన్షన్ ఆక్రోష్ మార్చ్ పేరుతో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీల ద్వారా నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌పీఎస్, యూపీఎస్‌ను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని బీమా భవన్‌లో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఉద్యోగి తన ఉద్యోగ జీవితంలో నెలసరి జీతం నుంచి 10 శాతాన్ని, అదేవిధంగా ప్రభుత్వం వాటా 18.5 శాతం మొత్తం 28.5 శాతం ఎన్‌పీఎస్ ట్రస్ట్‌కు జమ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఉద్యోగి రిటైర్ అయినప్పుడు తన ప్రాన్ అకౌంట్‌లో జమ అయిన మొత్తాన్ని ఎన్‌పీఎస్ ట్రస్ట్‌కు సరెండర్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత తనకు 48 శాతం నుంచి 50 శాతం బేసిక్‌తో కూడిన పెన్షన్ లభిస్తుందని అన్నారు. ఇది ఉద్యోగి తన సామాజిక భద్రతను కొనుక్కోవాల్సిన పరిస్థితి యూపీఎస్ వల్ల ఏర్పడుతుందని చెప్పారు. ఉద్యోగి కుటుంబానికి పెన్షన్‌తో సామాజిక భద్రత ఇవ్వాల్సిన ప్రభుత్వం, పెన్షన్ కొనుక్కునే విధంగా తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీఎస్ విధానానికి మూలమైన సోమనాథన్ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల ఆర్టీఐ ద్వారా కమిటీ నివేదికను అడిగితే బహిరం గపరచ లేమంటూ ఆర్థిక శాఖ సమాధానం ఇచ్చిందన్నారు. ఇది ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో విస్మయం కలిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సందీప్, రెడ్డప్ప, మదన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాట వినడం లేదని కుల బహిష్కరణ

- బాధితుడి తల్లి దశదిన కర్మకు వెళ్లని పెద్దలు
- గూడూరులో ఆలస్యంగా వెలుగులోకి
- పోలీస్ స్టేషన్లో బాధితుడి ఫిర్యాదు

నవతెలంగాణ-పాలకుర్తి

కంప్యూటర్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న పరిస్థితుల్లోనూ కుల బహిష్కరణ, సాంఘిక బహిష్కరణ ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామ పెద్దల మాట వినడం లేదని ఓ వ్యక్తి తల్లి దశ దిన కర్మకు ఎవరూ వెళ్లొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి..

గూడూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ పోస్టుమాస్టర్, రజక సామాజిక తరగతికి చెందిన సోమయ్యకు తన సోదరులతోపాటు పాలివారితో కొన్నేండ్లుగా భూ తగాదాలు నడుస్తున్నాయి. సమస్యను పరిష్కరించాలని సోమయ్య కుల పెద్దలను ఆశ్రయించాడు. ఒక గ్రూపు వారు తనకు అన్యాయం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ప్రశ్నించాడు. దాంతో తమ మాట వినడం లేదని, సోమయ్య కుటుంబం వైపు ఎవరూ కన్నెత్తి చూడొద్దని, మాట్లాడొద్దని కుల పెద్దలు హుకుం జారీ చేశారు. ఈ క్రమంలో ఇటీవల సోమయ్య తల్లి మృతిచెందింది. దశ దిన కర్మకు రజక సామాజిక తరగతి వారు కొద్ది మాత్రమే వెళ్లగా.. కుల పెద్దలు హాజరు కాలేదు. దీంతో మనోవేదనకు గురైన సోమయ్య తనను కుల బహిష్కరణ చేశారని ఈనెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై పాలకుర్తి ఎస్ఐ సాయి ప్రసన్నకుమార్‌ను 'నవతెలంగాణ' వివరణ కోరగా.. కుల బహిష్కరణకు గురైనట్టు సోమయ్య ఫిర్యాదు చేశాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

శృతి మించుతున్న డీజే శబ్దాలు

- హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్
- ప్రజల ప్రాణాల మీదకొస్తుందని ఆవేదన
- డీజే, టపాసుల వినియోగంపై రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి ఏడాదీ శృతిమించుతూ ప్రజల ప్రాణాలమీదకొస్తున్న డీజేల శబ్దాలను కట్టడి చేయాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. మతపరమైన ర్యాలీల్లో డీజే, టపాసుల వినియోగంపై హైదరాబాద్ పోలీసులు బంజారాహిల్స్‌లోని సీసీసీలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. డీజే శబ్దాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఈ సౌండ్స్‌తో వృద్ధులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొందరు గుండె అదురుతుందని ఆందోళన చెందుతున్నారని, డీజే సౌండ్స్ శృతి మించుతున్నాయని చెప్పారు. కేవలం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగానే కాకుండా మిలాద్ ఉన్ నబి వేడుకల్లోనూ డీజే నృత్యాలు విపరీతమయ్యాయని చెప్పారు. ఈ సారి నగరంలో శబ్ద కాలుష్యం 500 శాతం పెరిగిందన్నారు. పండుగలు, ఉత్సవాలు లేదా ఏదైనా ర్యాలీల్లో డీజేలు ఎక్కువగా వాడుతున్నారని తెలిపారు. పబ్‌లో డ్యాన్సులు చేసినట్టే ర్యాలీల్లో చేస్తున్నారని కమిషనర్ చెప్పారు. డీజే శబ్దాలను కట్టడి చేయాలని వివిధ సంఘాల నుంచి వినతులు వచ్చాయని తెలిపారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ మత సంఘాల ప్రతినిధులను పిలిచి వారి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. అందరి అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామని, ఆ తర్వాత ప్రభుత్వం డీజేలపై ఓ నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. డీజే శబ్దాలపై నియంత్రణ లేకపోతే ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎంఐఎం ఎమ్మెల్యేలు, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీస్ అధికారులు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, మత సంఘాల ప్రతినిధులు, జీహెచ్ఎంసీ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు డీజే సౌండ్స్‌పై పలు సూచనలు, సలహాలు అందించారు.

పర్యాటక రంగం అభివృద్ధిలో దక్షిణ మధ్య రైల్వే కీలక పాత్ర

- జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశీయ పర్యాటక రంగం అభివృద్ధిలో రైల్వే కీలక పాత్ర పోషిస్తున్నదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా పర్యటించాలనుకునే ఔత్సాహికులకు సాధ్యమైనంత ఉత్తమ సేవలను అందించడంలో దక్షిణ మధ్య రైల్వే అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు, ముఖ్యమైన యాత్రా కేంద్రాలకు రైళ్లను నడుపుతున్నదని తెలిపారు. దేశంలోని దక్షిణ, ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో ముఖ్యమైన ఆధ్యాత్మిక గమ్యస్థానాలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ 25 భారత్ గౌరవ్ రైళ్ల సేవలను దక్షిణ మధ్య రైల్వే నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ రైళ్లు భారీ విజయాన్ని సాధించాయని తెలిపారు. తిరుపతికి 130 రెగ్యులర్ రైలు సర్వీసులు, 20 ప్రత్యేక రైళ్లు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన ప్రతిష్టాత్మక వందే భారత్ రైలు సికింద్రాబాద్ నుంచి తిరుపతికి నడుస్తున్నదని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు కల్పించడంలో భాగంగా తిరుపతి రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సుమారు రూ. 300 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ ఆదినారాయణ ఆకస్మిక మరణం

- సీఎం రేవంత్ సంతాపం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీనియర్ జర్నలిస్ట్, ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్ టి.ఆదినారాయణ గురువారం ఆకస్మికంగా మరణించారు. హైదరాబాద్‌లో తాను ఉంటున్న అపార్టుమెంటులో వాకింగ్ చేస్తుండగా ఆయన ప్రమాదవశాత్తూ కిందపడ్డారు. కుటుంబ సభ్యులు ఆదినారాయణను దగ్గర్లో ఉన్న ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూ శారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆదినారాయణ మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆదినారాయణ మరణం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బొడిగె బసవపున్నయ్య తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

25 ఏండ్లపాటు పాత్రికేయ వృత్తికి నిబద్ధతతో సేవలందించిన ఆదినారాయణ మరణం పత్రికా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సాను భూతిని తెలిపారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు అంత్యక్రియలను నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు ప్రకటించారు.

రోడ్డుకు మరమ్మతులు.. రాకపోకలకు ఇబ్బంది..



ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. సాగర్ రింగ్ రోడ్ ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని చంపాపేట్ చౌరస్తాలోని ప్రధాన రోడ్లకు మరమ్మత్తులు నిర్వహించడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మత్తులు త్వరగా నిర్వహించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

నవతెలంగాణ - చంపాపేట్

పగలు కూడా వెలుగుతున్న వీధి దీపాలు

నవతెలంగాణ - హయత్ నగర్



మన్సూరాబాద్‌లోని నాంచారమ్మ బస్తి, వంబే కాలనీ, వెంకటరమణ కాలనీలలో పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీనికి కారణం ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం జీతాలు ఇవ్వకపోవడమేనని పలువురు ఆరోపిస్తున్నారు. వీధి దీపాలు వెలగక పోయిన, వాటికి టైమర్‌లు పెట్టాలన్నా వాటికి మరమ్మతులు చేపట్టే ఔట్ సోర్సింగ్ కార్మికులు సర్కిల్‌కి ఇద్దరు చొప్పున మొత్తం ఆరుగురు టెక్నీషన్స్ ఉన్నారు. వారికి సుమారు 4నెలల నుండి జీతాలు రాకపోవడంతో వారు గత నెల 15 నుండి విధుల్లోకి రావడం లేదు. దీంతో వీధి దీపాల టైమర్లు ఆన్, ఆఫ్ కాకపోవడంతో 24 గంటలు వీధి దీపాలు చాలా చోట్ల వెలుగుతూనే ఉన్నాయి. వాటిని ఆఫ్ చేసే క్రమంలో కాలనీవాసులు కొన్ని చోట్ల షార్ట్ సర్క్యూట్ గురైనట్టు స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇండోర్‌లో ఆసియాలోనే
అతిపెద్ద బయో-సీఎన్‌జీ ప్లాంట్



- రోజుకు 550 మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్ సామర్థ్యం
- బయో సీఎన్‌జీ ద్వారా దాదాపు 400 బస్సులు నడిచేందుకు వీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆసియాలోనే అతి పెద్ద బయో-సీఎన్‌జీ ప్లాంట్ ఇండోర్‌లో ఉంది. 15 ఎకరాల మైదానం గతంలో చెత్తకుప్పల మండలంగా ఉండేది. బయో-సీఎన్‌జీ ప్లాంట్‌ను 150 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేశారు. రోజుకు 550 మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్ సామర్థ్యం కలిగి ఉంది. ఇది ప్రతిరోజూ 17,500 కిలోల బయోగ్యాస్ మరియు 100-టన్నుల అధిక-నాణ్యత కంపోస్ట్‌ను ఉత్పత్తి చేయగలదు. 96 శాతం స్వచ్ఛమైన మీథేన్ వాయువుతో 'సీఎన్‌జీ' ఉత్పత్తి చేసిన దాంట్లో 50 శాతం ప్రజా రవాణా వాహనాలను నడపడానికి అందించాలని ప్రతిపాదించారు. అంచనాల ప్రకారం, దాదాపు 400 బస్సులు ఈ బయో సీఎన్‌జీ గ్యాస్ ద్వారా నడపబడతాయి. ఈ ప్లాన్ %ట్రా% మోడల్ ఆధారంగా రూపొందించబడింది మరియు ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ 20 సంవత్సరాలకు సంవత్సరానికి రూ. 2.5 కోట్లు పొందుతుంది. ప్లాంట్ అభివృద్ధి చేయడానికి రహదారి ఏర్పాటు చేయడంతోపాటు అంతర్గత రహదారులు మొక్కలను మునిసిపల్ కార్పొరేషన్ చేసింది. మురుగునీటి వ్యవస్థ అభివృద్ధేకాకుండా డోర్ స్టెప్ వద్ద వేరు చేయబడిన వ్యర్థాలతో పాటు మొత్తం భూమిని కూడా మునిసిపల్ కార్పొరేషన్ ప్లాంట్ కోసం అందించింది.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి



- ఫ్లోర్ లీడర్ ఐలయ్య

నవతెలంగాణ-తుర్కయంజాల్

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కోసిక ఐలయ్య కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి 22వ వార్డు కమ్మగూడ ఇందిరమ్మకాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ రోడ్డు పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. రోడ్డు ఏర్పాటుతో మూడు కాలనీలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి సహకారంతో పనులు పూర్తి చేశామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంత్ గౌడ్, సాయిరెడ్డి, గౌని రాము గౌడ్, రాజు నాయక్, వెంకటేష్, రాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.

తట్టి అన్నారంలో
స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం విజయవంతం





నవతెలంగాణ- నాగోల్

నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో గల భారతీయ వైజ్ఞానిక శిక్షణ సంస్థ వారి ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని తట్టి అన్నారం ఆర్కేనగర్‌లలో నిర్వహించిన స్వచ్ఛతే సేవా కార్యక్రమం గురువారం విజయవంతం అయింది. ఈ సందర్భంగా జిఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్, జనరల్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా తట్టి అన్నారం ఆర్కే నగరాలతో పాటు 15, 17వ వార్డులలో ఉన్న రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్ రెడ్డి, ఇంచార్జ్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, జిఎస్ఐ అధికారులు, ఉద్యోగస్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవతా హృదయంతో అనాథలను ఆదుకోవాలి

- మాతృ దేవోభవ అనాథ ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు గిరి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

నేటి సమాజంలో మానవతా హృదయంతో మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలోని అనాథలను దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని మాతృ దేవోభవ అనాథ ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు గిరి కోరారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లో ఉన్న నాదర్‌గుల్ గ్రామం లోని మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలోని అనాథలకు ఆంధ్రప్రదేశ్, అన్నమయ్య జిల్లా, ఓబులవారిపల్లి మండలం, చిన్నంపల్లి గ్రామనివాసులు కీర్తిశేషులు పలుకూరి సుబ్బలక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం ఆమెను స్మరించుకుంటూ అమ్మ హెల్పింగ్ హండ్స్ కువైట్ వారి ఆధ్వర్యంలో కూతురు, అల్లుడు శిరీష, వేణుగోపాల్, మనుమరాలు మమత, మనుమడు శివకుమార్ విశేషలు మానవతా హృదయంతో అన్నదానం చేశారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి మాట్లాడుతూ తమ తల్లి మీద ప్రేమతో పదిమందికి సహాయం చేయాలనే సంకల్పంతో అభాగ్యుల ఆకలిని తీర్చిన వారి కూతురికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



చిట్యాల ఐలమ్మ నేటి తరానికి ఎంతో స్ఫూర్తి





నవతెలంగాణ-ఎల్బీనగర్

కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ 129వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఎల్బీనగర్ చింతలకుంట చౌరస్తాలో ఐలమ్మ విగ్రహానికి సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎంతో మంది వీరులు నేలకొరిగారని అలాంటి మహనీయుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని కోరారు. ఐలమ్మ విగ్రహం ట్యాంక్ బండ్‌పై పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సరూర్ నగర్ మండల సహాయ కార్యదర్శిలు కందుల సుధాకర్, బోయపల్లి రాములగౌడ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎం మదిలేటి, సీపీఐ శాఖ కార్యదర్శి పూజారి అనిత, శోభ, పార్వతమ్మ, దేవ స్వామి, అంజి రాధా తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట్



పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్- 3 పోరాట కేంద్రం గుడిసెలలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరవనిత కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వట్టి నవనీత, తైలి మధు, మండల నాయకులు నారాయణ రెడ్డి, సైదులు ముదిరాజ్, దూపం నిరంజన్, ఆవుల యాదగిరి, సుజాత, వీరేష్, గణేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- నాగోల్



నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో యోధురాలు చిట్యాల ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికి ఎంతో స్ఫూర్తి అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. గురువారం చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా నాగోల్ చౌరస్తా వద్ద ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం కన్వీనర్ బొడ్డుపల్లి కృష్ణ, రజక అభివృద్ధి సంస్థ సహాయ కార్యదర్శి చుక్కయ్య, రవీంద్ర చారి, రమేశ్, శ్రీకాంత్, వినయ్, కార్తిక్, చైతన్య, సంజీవ, మల్లేష్, ఐవీఎఫ్ సహాయ కార్యదర్శి కటకం శ్రీనివాస్, ఐవీఎఫ్ ముషీరాబాద్ అధ్యక్షుడు వీరేందర్, ఐవీఎఫ్ ముషీరాబాద్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రఘు, కార్పొరేటర్లు సుర్ణగంటి అర్జున్, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, ఏనుగు రాంరెడ్డి, సుక్క శివ కుమార్, డీఈఈ జ్యోతి రెడ్డి, నాయకులు రాళ్లగూడెం సంతోష శ్రీనివాస్ రెడ్డి, నిమ్మల శ్రీకాంత్ గౌడ్, ముత్యాల కృష్ణ, మేనేజర్ నాగేశ్వరరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్



తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ ఇందిరమ్మ కాలనీలో చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం రజక సంఘం ప్రధాన కార్యదర్శి కానుగుల యాదగిరి, బొమ్మరాజు అంజయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 22వ వార్డు కౌన్సిలర్ కోషిక ఐలయ్య ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రమ్మ కాలనీ అధ్యక్షులు హనుమంతు గౌడ్, వేముల శంకర్, నర్రపాండు, పల్లె రాజు, ఇల్లూరి భాస్కర్, హనుమంత్ రెడ్డి, నక్క శేఖర్, ఎండి షఫీ, భయమత్తుల శీను, దూదిమెట్ల వెంకటేష్ యాదవ్, వెంకట్, ప్రవీణ్ కుమార్, కృష్ణ, శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్



తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ జీవితం అందరికీ ఆదర్శమని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ గ్రామంలో రజక సంఘం రాష్ట్ర నాయకులు, బాలాపూర్ రజక పొదుపు సంఘం అధ్యక్షులు అంజా బాల్ రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఎర్ర జైహింద్, సామ రాజు, సామ యాదయ్య అనురాధ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- చైతన్యపురి





చైతన్యపురిలోని శివాజీ స్టాచ్ వద్ద తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పలు రజక సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్కెనపల్లి గణేష్, ప్రధాన కార్యదర్శి ఏపూరి రవి, కొత్తపెల్లి రవి, సహాయ కార్యదర్శి రావుల వెంకట రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ బుదిగామ వీరన్న, ఓబీసీ చైర్మెన్ అక్కేపల్లి రమేష్, ఏపూరి ఈరన్న, శ్రీధర్, వీరేష్, పగిళ్ల రాజు ,మడిపెద్ద గిరి, రావుల మల్లయ్య, వీరమల్ల మురళి, వీరమల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-హయత్‌నగర్



కుక్కల దాడిలో ఇద్దరు గాయాలపాలయ్యారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని విజయ నగర్ కాలనీలో ఒక్క రోజే రామచంద్రయ్య, గాయత్రిలను కుక్కలు కరిచివేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయంపై హయత్ నగర్ సర్కిల్ వెటర్నరీ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని బాధితులు బాధితులు వాపోతున్నారు.

శాంతినికేథన్ విద్యా సంస్థల దాతృత్వం

నవతెలంగాణ-హయత్ నగర్



ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో విపరీతంగా కురిసిన భారీ వర్షాలకు, వరదలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అందులో కొందరు పూర్తిగా సర్వస్వం కోల్పోయారు. వారికి అండగా ఉంటామని హయత్‌నగర్‌లో ఉన్న శాంతినికేథన్ విద్యా సంస్థల చైర్మెన్ రాధాకృష్ణ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి 9లక్షల ఒక వేయి నూట పదహారు రూపాయల చెక్కును అందజేశారు. ఆయన వెంట డైరెక్టర్ శేషా రావు, జోనస్, సుధీర్, రంగ శ్రీనివాసరావు, వృకోదర్ చౌదరి, దనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని చంపాపేట్ చౌరస్తా వద్ద కేబుల్ వైర్ల మరమ్మత్తులు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మరమ్మత్తు పనులు తర్వగా పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

నవతెలంగాణ - చంపాపేట్



చైతన్యపురి హనుమాన్ దేవాలయంలో ఐవీఎఫ్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓం శ్రీ మాత్రే నమః మహిళ సంఘం సకల శుభములకు సాంప్రదాయకమైన శ్రీ అన ఘస్తమి (దత్త వ్రతం)లో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని పూజలను నిర్వహించారు.

నవతెలంగాణ- నాగోల్

అవుట్ లెట్ లేక పొంగిపోర్లుతున్న డ్రయినేజీలు

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజక వర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్‌లోని స్వేచ్ఛ నివాస్ కాలనీలో అవుట్ లెట్ సౌకర్యం లేకపోవటంతో డ్రయినేజీలు పొంగిపోర్లుతు న్నాయి. దీంతో



దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌కు ఎన్ని సార్లు విన్నవించిన పట్టించుకోవటం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు కాలనీలు చెరువులా తలపిస్తున్నాయి. గురువారం 5వ డివిజన్ కార్పొరేటర్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ రఘు, ఏఈ సాయిలు కాలనీలో పర్యటించి అక్కడి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. డ్రయినేజీలను నేరుగా పరిశీలించి సమస్య పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. వారి వెంట కాలనీ అధ్యక్షులు గణేష్, కాలనీవాసులు, మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తా...




అవుట్ లెట్ సౌకర్యం లేకపోవడంతో డ్రయినేజీ మురుగు కాలనీలలో ప్రవహిస్తున్నాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వర్షా కాలం కావడంతో సీజనల్ వ్యాదులు సోకే అవకాశాలు ఉన్నాయి. త్వరలో అవుట్ లెట్ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తా.

కమిషనర్ రఘు

హైడ్రాతో ఆగం ఆగం

నవతెలంగాణ- కొత్తపేట

ఇటీవల జరుగుతున్న హైడ్రాతో ప్రజలు ఆగం ఆగం అయిపోతున్నారు. పేద ప్రజలపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. ఈరోజు చైతన్యపురి ఫణిగిరి కాలనీలోని సాయిబాబా టెంపుల్ ప్రాంతంలో మూసీ పరివాహక ప్రాంతంలో అధికారులు పోలీసులు హైడ్రా మార్కింగ్ వేయడానికి వచ్చారు. అక్కడ కొంతకాలంగా నివాసముంటున్న ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. అప్రతమైన పోలీసులు బందోబస్తు నడుమ అధికారులు మార్కింగ్‌ను నిర్వహించారు.



సీఎం సహాయనిధి పేదలకు వరం : బొంతు శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని చర్లపల్లి డివిజన్‌కు చెందిన నవీన్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి అనారోగ్యానికి గురికావడంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని ఉప్పల్ నియోజకవర్గం నాయకుడు నాగిళ్ల బాల్ రెడ్డి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద రూ. 3,25,000 మంజూరు చేయించి ఎల్‌వోసీ పత్రాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడి కుటుంబ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు, బొంతు శ్రీదేవి యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'స్వచ్ఛత హీ సేవ'లో అందరూ భాగస్వామ్యం కావాలి

- పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్



నవతెలంగాణ-బోడుప్పల్

పరిసరాల పరిశుభ్రతతోనే నగరాలు అందంగా ఉంటాయని, అందుకే నగరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ అన్నారు. గురువారం పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో "వావ్ వెల్ బీయింగ్ అవుట్ ఆఫ్ వెస్ట్ ఐటీసీ ఇంటింటివ్" సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మేయర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నగరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థులు తమ ఇండ్లలో తడి,పొడి చెత్తను వేరు చేసి కార్పొరేషన్ సిబ్బందికి ఇచ్చేలా ఇంట్లో వారిని చైతన్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్ రావు, 24వ డివిజన్ కార్పొరేటర్ ఎంపల్ల అనంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎనుగు జెలేందర్ రెడ్డి, కార్పొరేషన్ అధికారులు ఐటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నాన్ పర్మినెంట్ కాంటాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి : సీఐటీయూ



నవతెలంగాణ-కాప్రా

నాన్ పర్మినెంట్ కాంట్రాక్టు వలస కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలని కోరుతూ చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు చర్లపల్లి ఇండస్ట్రీ ఎంప్లాయిస్ అధ్యక్షులు బీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు భూపాల్, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో నాన్ పర్మినెంట్ కాంటాక్ట్ కార్మికుల సమస్యలపైన సర్వే నిర్వహించామని తెలిపారు. ఈ సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. కాంట్రాక్టు కార్మికులను కంపెనీలో షెడ్లు నిర్మించి ఒక్కొక్క షెడ్డుల్లో 8 నుంచి 12 మందిని ఉంచుతున్నారని తెలిపారు. వారితో 10 గంటలు 12 గంటలు డ్యూటీ చేయిస్తున్నారని తెలిపారు. ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, ఎర్న్ లీవ్స్, ఉద్యోగ భద్రత లాంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. బీహార్, ఒరిస్సా, అస్సాం, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వస్తున్న కార్మికులకు1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. కంపెనీ యజమాని, కాంట్రాక్టర్ వలస కార్మికులకు రవాణా సౌకర్యాలు, భోజన వసతులు, ప్రయాణ కాలానికి వేతనం, నివాసం, మంచి వైద్యం, ఆరోగ్యకరమైన వాతావరణం కలిపించాలని అంతర్ రాష్ట్ర వలస చట్టంలో ఉందని పేర్కొన్నారు. ఈ విధమైన సౌకర్యాలు చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఏ ఒక్క వలస కార్మికుడికి లభించడం లేదన్నారు. ఈ చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే అన్నారు. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. పై సమస్యల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీన చలో లేబర్ డిపార్ట్మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జే చంద్రశేఖర్ నాయకులు జె. వెంకటేష్, టి. నరసింహ, బి. ఆదామ్,సంతోష్, బాబురావు,మొయిన్ పాషా, పి శ్రీనివాస్, ఆర్. శ్రీనివాస్, నరసమ్మ,యాదగిరి చారి, మునుస్వామి, మరియమ్మ లావణ్య ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెూమియోపతి ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లిలో గురువారం ఉచిత హెూమియోపతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 15వ డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హాలులో హబ్సిగూడ హెూమియోపతి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దాదాపు 200 మంది స్థానికులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి హెూమియోపతి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోచారం మున్సిపల్ చైర్మెన్ కొండల్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ రెడ్యా నాయక్, కౌన్సిలర్లు సరితా స్వామీ, హరి ప్రసాద్ రావు, డాక్టర్లు హిమ బిందు, దీప్తి గిల్లా, సాయి కిరణ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



నవతెలంగాణ - ఘట్కేసర్ రూరల్

సమాజంలోని పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పనుల కొండలరెడ్డి అన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లోని 200 మంది విద్యార్థులకు బస్సు పాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులను ఆర్థికంగా అండగా నిలిచి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు దాతలు ముందుకు రావాలన్నారు. విద్యార్థులకు బస్సుపాసులు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మెన్ భిక్షపతి గౌడ్, మాజీ ఎంపీటీసీ మగ్గం రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని విద్యుత్ అధికారికి సీపీఐ(ఎం) బృందం వినతి



నవతెలంగాణ-ఘట్కేసర్

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప 31వ బ్లాక్ వద్ద ఇండ్లకు ఆటంకంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని సీపీఐ(ఎం) ఘట్కేసర్ మండల కమిటీ ప్రతినిధి బృందం ఉప్పల్ ఏడీఈ స్వప్నకు గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్. సబిత, సీనియర్ నాయకులు చింతల యాదయ్యలు మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్ప 31వ బ్లాక్ వెడల్పు కార్యక్రమంలో భాగంగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ అడ్డుగా ఉందని తెలిపారు. తక్షణమే దానిని రోడ్డుకు అవతలి వైపునకు మార్చాలని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ అడ్డుగా ఉండడం వల్ల 32 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. దీనికి విద్యుత్ అధికారులు, కాలనీ వాసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే. అలివేల జి. నాగమణి సునీత, దేవి, అనసూర్య, రేణుక, సరళ, జ్యోత్స్న, భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

28న నల్సార్ యూనివర్సిటీకి రాష్ట్రపతి రాక

- ఏర్పాట్లను పరిశీలించిన ఇంటలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ రామకృష్ణ



నవతెలంగాణ-శామీర్‌పేట

నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా గౌరవ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేస్తున్న ఈ సందర్భంగా ఇంటలిజెన్స్ సెక్యూరిటి వింగ్ ఎస్పీ రామకృష్ణ, డీసీపీ కోటిరెడ్డితో కలిసి నల్సార్ యూనివర్సిటీలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల కేంద్రంలోని నల్సార్ లా యూనివర్సిటీలో నిర్వహించే 21వ స్నాతకోత్సవానికి ఈ నెల 28న రాష్ట్రపతి వస్తున్నారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన మేరకు పలు సూచనలు చేశారు. రోడ్లు మరమ్మత్తులు, రెడ్ కార్పెట్లు, నిరంతరాయ విద్యుత్తు, పుష్పలంకారణ, వైద్య శిబిరాలు, అంబులెన్సు, సీటింగ్, మొబైల్ టాయిలెట్స్, పాసులు వంటి ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేస్తుకుంటూ సకాలంలో పనులు పూర్తి చేయాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, శామీర్ పేట్ తహసీల్దారు యాదగిరిరెడ్డి, ఆర్ అండ్ బి, పోలీసు, వైద్య, విద్యుత్తు, పర్యాటక శాఖల, పౌర సంబంధాలు, అధికారులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

- సీపీఐ(ఎం) ఉప్పల్ కార్యదర్శి జె. వెంకన్న
- ఉప్పల్ బీ శాఖ కార్యదర్శిగా ఊర్మిళ ఏకగ్రీవ ఎన్నిక



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ(ఎం) పార్టీ శ్రేణులు

నవతెలంగాణ-ఉప్పల్

దేశంలో, రాష్ట్రంలో, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ(ఎం) ఉప్పల్ కార్యదర్శి జె. వెంకన్న అన్నారు. గురువారం ఉప్పల్ సీపీఐ (ఎం) పార్టీ కార్యాలయంలో బీ శాఖ మహాసభ నిర్వహించి, శాఖ నూతన అధ్యక్షురాలిగా ఊర్మిళను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జె. వెంకన్న, కె.ఊర్మిళలు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉప్పల్ నుండి నారాపల్లి వరకు నిర్మించే ఫ్లైఓవర్ కారిడార్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్నారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ మహాసభలో నాయకులు ఆంజనేయులు, మేరీ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు రంగాల్లో రిజర్వేషన్ అమలు చేయాలి

- అభివృద్ధి పేరుతో దళితుల భూములను లాక్కుంటున్నారు
- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్



నవతెలంగాణ-కాప్రా

ప్రయివేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. గురువారం దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం జి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ..సామాజిక న్యాయాన్ని సమాధి చేసే దిశగా బీజేపీ పాలన సాగుతోందన్నారు. దేశంలోని ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్నదని మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాల గడిచినా దళితుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. నేటికీ 58శాతం దళితులకు భూమి లేదన్నారు. మోడీ పాలనలో అభివృద్ధి పేరుతో దళితుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని వాపోయారు. 50 శాతం దళితుల భూములకు సాగునీటి సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. అసంఘటిత రంగ కార్మికులు 84శాతంగా ఉన్నారని తెలిపారు. ఈ గణాంకాలు మోడీ దళిత వ్యతిరేక స్వభావాన్ని తెలియజేస్తుందన్నారు. రిజర్వేషన్లు కోల్పోతే సామాజిక న్యాయం ఉండదని చెప్పారు. బీజేపీ సర్కార్ నూతన విద్యా విధానం పేరుతో ఉన్నత విద్యకు పేదలను దూరం చేసే కుట్రకు ఒడిగట్టిందన్నారు. నూతన విద్యా విధానంలో రిజర్వేషన్లు ఉండబోవని చెప్పారు. బీజేపీ దళితులకు ఉన్నత విద్య దక్కకుండా చేస్తున్నదని తెలిపారు. ఈ పదేండ్లలో దళితులపైన 300 రెట్లు దాడులు పెరిగాయని వెల్లడించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళిత మహిళలకు రక్షణ లేదన్నారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2023-24 సంక్షేమ పథకాలలో 10.6శాతం మాత్రమే దళితులకు కేటాయించిందని వివరించారు. ఇందులో 3.3శాతం మాత్రమే ఖర్చు చేసిందన్నారు. అక్షరాస్యతలో సగటు దేశంలో 73శాతం ఉండగా దళితుల్లో 66శాతం ఉందని పేర్కొన్నారు. నూటికి 60 శాతం మంది దళితులకు గుంట భూమి లేదని వాపోయారు. ఈ సమావేశంలో రాములు, సహదేవ్, డి దొరివిబాబు, జన్ను రాములు, రాధిక కృపకర్, లావణ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ పత్రాలు అందజేత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సీఎంసహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. నేరెడ్‌మెట్ డివిజన్‌కు చెందిన ఎన్.కనకయ్య రూ.2 లక్షలు, గౌతమ్ నగర్ డివిజన్‌కు చెందిన ఎస్.సురేందర్‌కు రూ.2లక్షలు వెంకటాపురం డివిజన్‌కు చెందిన డి. హేమేందర్‌కు రూ.1లక్ష 50 వేలు మంజూరు కాగా వారికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం ఎల్‌వోసీ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అమరేందర్‌రెడ్డికి ఎంపీ ఈటల నివాళి



నవతెలంగాణ-కీసర

బీజేపీ కీసర మండల మాజీ అధ్యక్షులు, తిమ్మాయిపల్లి మాజీ ఉపసర్పంచ్ కందడి అమరేందర్ రెడ్డి ని చెత్త లారీ ఢీ కొట్టడంతో బుధవారం మృతి చెందారు.విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ గురువారం అమరేందర్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట జిల్లా బీజేపీ రూరల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, బీజేపీ నాయకులు వెంకట్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, బొడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రామికుల గొంతుక.. శ్రామిక మార్గం మాస పత్రిక

- అభ్యుదయ కవి ఎస్.కె. మీరా
- మూడో సంచికను ఆవిష్కరణ



నవతెలంగాణ - జవహర్‌నగర్

పెత్తందారి వర్గాలకువత్తాసు పలికే పత్రికలకు ప్రత్యామ్నాయమే శ్రామిక గొంతుక.. శ్రామిక మార్గం మాస పత్రిక అని అభ్యుదయ కవి, కళాకారుడు షేక్ మీరా స్పష్టం చేశారు. గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇఫ్టూ నేత షేక్ షావలి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రామికుల ఉద్యమాలకు సంఘీభావంగా, వారి హక్కుల పరిరక్షణకు పీడిత ప్రజల మాస పత్రికగా తెస్తున్న సంపాదకులు మోహన్ బైరాగిని ప్రజాసంఘాలకు నేతలు అభినందించారు. ఇటీవల ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయికరణ వేగంగా అమలవుతున్న తరుణంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు శ్రామిక వర్గం తమ జీవన మనుగడ కొరకు ఉద్యమిస్తున్నారని అన్నారు. పత్రిక సంపాదకులు మాట్లాడుతూ.. రెక్కలు, ముక్కలు చేసుకొని, దేశానికి సంపదలు సృష్టిస్తున్న కార్మికుల కోసం తెస్తున్న భావజాల మాస పత్రికను ఆదరించాలని మోహన్ బైరాగి పేర్కొన్నారు. మొదటి సంచికను జగద్గిరి గుట్టలో సామాన్య భవన నిర్మాణ కార్మికుడే ఆవిష్కరించారని, రెండో సంచికను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో, నేడు జవహర్ నగర్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మూడో సంచిక ఆవిష్కరణ చేశామన్నారు. ఈసందర్భంగా శ్రామిక మార్గం మాస పత్రికకు తమవంతు పాత్ర, సహకారం ఉంటుందని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నేత శివబాబు, డి.యాదన్న, ప్రవీణ్, నర్సింహా, చంద్రమౌళి, పికెఎం డి.జాన్, సిఎంఎస్ అల్లూరి సావిత్రి, ఐపిఓడబ్ల్యూ పి.సునీత, భహుజన సత్త బండకింది సింగరాయ గౌడ్, ఎమ్మార్పీఎస్ కె. వెంకటేష్, బీఎస్పీ బిర్రు యాకస్వామి, టిడిపి చెన్నాపురం యాదన్న, మారోజు సోమయ్య, మహ్మద్ రషీద్, మబ్బుబాలు, వెంకటాచారి పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో దళితులకు న్యాయం జరిగేలా చూడాలి : ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అట్రాసిటీ కేసుల్లో దళితులకు న్యాయం జరిగేలా చూడాలని మల్కాజగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఆర్‌డీవో చైర్మెన్‌గా ఏర్పాటు చేసిన సమావేశానికి మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. అధికారులు, పోలీసులు ఒత్తిళ్లకు లోనుకాకుండా అట్రాసిటీ కేసుల్లో దళితులకు న్యాయం చేయాలన్నారు. షెడ్యూల్డ్ కులాల వారికి కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయడంలో తహశీల్దార్ పారదర్శకత పాటించాల న్నారు. అరవ మాలలకు కులధృవీకరణ సర్టిఫికెట్ ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని, దీనికి ఆర్‌డీవో పరిష్కారం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, షెడ్యూల్డ్ కులాల నాయకులు, పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగకు ఏర్పాట్లను చేయాలి

నవతెలంగాణ-శామీర్‌పేట

గురువారం మూడు చింతల పల్లి మండలం జగ్గంగూడ గ్రామంలో బతుకమ్మ పండుగకు క్రీడా మైదానము చదును, సంపన్ బోల్ వాగు వద్ద లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి ఏడు లాగే వచ్చే నెలలో జరిగే బతుకమ్మ వేడుకలకు క్రీడామైదానంలో లైట్లను ఏర్పాటు చేసి మైదానాన్ని చదను చేయాలని కోరామని తెలిపారు. క్రీడా మైదానంలో బతుకమ్మలు ఆడుకోవడానికి లైటింగ్, సౌండ్ సిస్టం, సంపన్ బోల్ వాగు వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి లైట్లతోపాటు సౌండ్ సిస్టం కూడా ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బుద్ధి శ్రీనివాస్, గ్రామస్తులు బబ్బురి బిక్షపతి, కుంట నర్సింలు, ఆంజనేయులు, ధర్మారెడ్డి, శశికాంత్, రాంలింగం,శాంతమ్మ, సుజాత, దేవమ్మ జ్యోతి, మైసమ్మ పాల్గొన్నారు.

అస్సాం సీఎంను కలిసిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

జీహెచ్ఎంసీ అధ్యయన పర్యటనలో భాగంగా అస్సాంలో సీఎం హిమంత బిశ్వ శర్మ ని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత తోటి కార్పొరేటర్లుతో నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు అక్కడ జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించిఅడిగి తెలుసుకున్నారు.

స్వచ్ఛత హి సేవపై సమీక్ష



నవతెలంగాణ-శామీర్‌పేట

స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవంలో భాగంగా శామీర్ పేట మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జెడ్పీ సీఈవో దిలీప్ కుమార్ డీఆర్‌డీవో పీడీ సాంబశివరావు, డీపీవో వెంకటయ్యలతో కలిసి స్వచ్ఛతా హి సేవా పై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మమతభాయి, ఎంపీవో వినూత్న, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో యంత్రాలను వాడాలి



- పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్

నవతెలంగాణ-బోడుప్పల్

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కార్పొరేషన్‌లోని వ్యర్థాలను తొలగించడానికి యంత్రాలను వాడాలని పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ అన్నారు. గురువారం పీర్జాదిగూడ కార్పొరేషన్ కార్యాలయంలో కామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, కామ్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ స్మిత్‌సింగ్, మిథున్ కుమార్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 కింద ఈ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. దీని వలన మ్యాన్ హెూల్స్, వ్యర్థాల పరిశుభ్రత సమయంలో మనుషుల అవసరం లేకుండా ఉంటుందన్నారు. పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య బీమా, వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ, వాహనాల కొనుగోలు వంటి అంశాలపై చర్చించినట్టు తెలిపారు.

అక్రమ నిర్మాణాలకు ఇంటి నెంబర్లు ఎలా ఇస్తారు

- కీసర మాజీ ఉప సర్పంచ్ తటాకం లక్ష్మణ్ శర్మ



నవతెలంగాణ-కీసర

కీసర మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా యని కొన్ని రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శి గంగన్నకు ఫిర్యాదు చేస్తే ప్రస్తుతం ఆ అక్రమ నిర్మాణాలకు ఇంటి నంబర్లు ఎట్లా కేటాయిస్తారని కీసర మాజీ ఉప సర్పంచ్ తటాకం లక్ష్మణ్ శర్మ అధికారులపై మండి పడ్డారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కీసర గ్రామంలోని సర్వేనంబర్ 196 ,198, 03లల్లో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని కొన్ని రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామన్నారు. ఆ అక్రమ నిర్మాణాలపై డీఎల్‌పీవోతో మాట్లాడితే దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడాలని చెప్పారని తెలిపారు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్తే మాకు పూర్తి బాధ్యత ఇవ్వలేదని తెలిపారని చెప్పారు. ఇకనైనా అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అస్సాం సీఎంను కలిసిన బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల అధ్యయన యాత్రలో భాగంగా గురువారం అస్సాం సీఎం హేమంత్‌బిస్వా శర్మను గౌహతిలోని వారి క్యాంపు కార్యాలయంలో చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, ఇతర కార్పొరేటర్లు అర్చన, సునీత, మీనా మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీలోని నగర పరిశీలన, అభివృద్ధి పనులు, వారి ప్రణాళిక అంశాలపై అధ్యయనం చేశారు.

సర్కారు భూమిలో పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ 134 డివిజన్ ఫాదర్ బాలయ్య నగర్ ప్రాంతంలోని సర్వే నంబర్ 537లో ఉన్న మూడు ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూమిలో పార్కును ఏర్పాటు చేసి అభివృద్ధి చేయడానికి మండల రెవెన్యూ అధికారి రాములు, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డిలు భూమిని పరిశీలించారు. పార్క్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి చర్చించారు. పార్క్‌లో పిల్లలకు ఆట స్థలం, వ్యాయామ పరికరాలు, చెట్లు నాటడం, వాకింగ్ ట్రాక్ వంటి సౌకర్యాలు ఏర్పాటు, ప్రజలకు విశ్రాంతి, వినోదం కోసం పార్కును అందుబాటులోకి తెస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శుక్రవారం | సెప్టెంబర్ 27, 2024 | www.navatelangana.com



ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సి.హెచ్. విద్యాసాగర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా యం.సిద్ధిరాం రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్.యం.గోపి, కోశాధికారిగా కె.చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా ఎ.మురళి, లేడీ సెక్రటరీ జి.శృతి, స్టేట్స్ కౌన్సిలర్లుగా ఎ.ఉపేందర్, పివి. రమణారెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా డి.నాగేందర్, ప్రెన్సిపాల్ కుత్బుల్లాపూర్, ఉమాదేవి, ప్రెన్సిపాల్ మల్కాజిగిరి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని అధ్యాపకులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాన-సిటీబ్యూరో

ఎంపీని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కార్మికుల సమస్యల పట్ల ఢిల్లీలో చేపట్ట బోయే కార్యక్రమాలకు సహకరించాలని ఎంపీని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. గురువారం రోజున యువజన కాంగ్రెస్ నాయకులు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌ని, ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, ఎరగాని నాగన్న గౌడ్, వి భాస్కర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు, డాక్టర్ జి.సంజీవరెడ్డి నేతృత్వంలో.. పోస్టల్ గ్రామీణ డాక్ సేవక్, బిఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్ రంగ కార్మికుల యొక్క సమస్యల పట్ల, ఢిల్లీ స్థాయిలో చేపట్టబోయే కార్యక్రమాలకు, సహకరించాలన్నారు. వెంటనే ఎంపీ సానుకూలంగా స్పందించారని అన్నారు.

చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలు





బాలానగర్ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..



కూకట్‌పల్లి మండల పరిధిలోని శ్రీశ్రీ నగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో..

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ వీర వనిత చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా.. కూకట్‌పల్లి, ఫతే నగర్, మూసాపేట్ ధోబీ ఘాట్ లో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మూసాపేట్ మాజీ కార్పొరేటర్లు, పగడాల బాబు రావు, అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, భిక్షపతి, సంతోష్‌లతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ అని, రజాకార్లను తరిమికొట్టి తెలంగాణ సాయుధ పోరాటానికి బీజం వేసిందని, ఆమె పోరాట స్ఫూర్తిని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అన్నారు.

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో.. శ్రీశ్రీ నగర్ పార్టీ కార్యాలయంలో వీరవనిత చిట్యాల ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు ఘనంగా నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) బాలానగర్ మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ భూమి కోసం, భూక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దున్నే వాడికి భూమి హక్కు కావాలని భూ పోరాటంలో మొట్ట మొదటిసారిగా పోరాటం చేసిన వీర వనిత చిట్యాల ఐలమ్మ అన్నారు. ఇసునూర్ రామచంద్రా రెడ్డి అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీరవనిత చిట్యాల ఐలమ్మ ఈమెకు నివాళులర్పించడం అంటే భూస్వాములకు వ్యతి రేకంగా భూపాలన చేసి, రూ.10 లక్షల భూమిని స్వాధీనం చేసు కుని పేద ప్రజలకు పంచిన గొప్ప పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని, దేశంలో, రాష్ట్రంలో గాని బడా కార్పొరేట్ పెట్టుబడిదారుల అరాచ కాలకు వ్యతిరేకంగా పోవడం చేయడమే చిట్యాల ఐలమ్మకు నిజ మైన నివాళి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఉమెన్స్ కాలేజీకి వీరవనిత చిట్యాల ఎల్లమ్మ పేరు పెట్టడం హర్షణీయమని కొనియా డారు. ఈ కార్యక్రమంలో ఐద్వా బాలానగర్ మండల అధ్యక్షురాలు జి.సుగుణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి కార్తీక్, లక్ష్మీ, వెంటమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

బాలానగర్ : కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని చిట్యాల ఐలమ్మ 130 వ జయంతి సందర్భంగా.. కూకట్‌పల్లి మండల పరిధిలోని శ్రీశ్రీ నగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సీపీఐ శాఖ కార్యదర్శి కె. మనోచారి ఆధ్వర్యంలో.. ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి సీపీఐ కూకట్ పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాటంలో అలు పెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆమె రైతు కుటుంబం లో పుట్టి కమ్యూనిస్టు పార్టీ చేరి వెట్టి చాకిరీపై అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ మేరకు ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒకరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దావీద్, రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి మూసాపేట్‌లోని రజక సంఘం ఆధ్వర్యంలో..

కూకట్‌పల్లి : పోరాడితే పోయేదేమీ లేదంటూ.. తెగువ చూపిన చిట్యాల ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని, నేటి యువత, మహిళలు ముందుకు సాగాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా.. కూకట్‌పల్లి మూసాపేట్‌లోని రజక సంఘం అధ్యక్షులు నోముల సుందర్ ఆధ్వర్యంలో.. నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీర నారి ఐలమ్మ అంటూ కొనియాడారు, రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ పోరాటస్ఫూర్తి భావితరాలకు ఆదర్శమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి, కోటిలోని మహిళా కళాశాలకు ఆమె పేరు పెట్టడం మహిళల పట్ల ఉన్న గౌరవభావాన్ని తెలియజేస్తుందన్నారు. అనంతరం అక్కడి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగిరెడ్డి, తూము వేణు, వెంకటేశ్వరరావు, ప్రతాప్ రెడ్డి, కర్కే పెంటయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ భవన్‌లో చిట్యాల ఐలమ్మలకు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళుర్పించిన కాంగ్రెస్ నాయకులు...

బాలానగర్ : తెలంగాణ వీర వనిత సాయుధ పోరాటం చేసి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పి మహిళా లోకానికి స్ఫూర్తి నిచ్చిన ధీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా.. టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టి.కుమార్ రావు, జనరల్ సెక్రటరీ ప్రేమ్‌లాల్, టీపీసీసీ అధికార ప్రతినిధులు డా. సత్యం శ్రీరంగం, శ్రీకాంత్ యాదవ్, లింగం యాదవ్, వెంకట రమణ గాంధీ భవన్‌లో వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటాన్ని రగిలించిన నిప్పురవ్వ చిట్యాల ఐలమ్మ అని పేర్కొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక మన తెలంగాణ వీర వనిత అని కొనియాడారు. దొరల పెత్తనాన్ని ఎదురించి రజాకార్లను తరిమికొట్టిన వీర వనిత, దొరల గడీలను గడగడలాడించిన విప్లవమూర్తి ఐలమ్మ అన్నారు. మహిళలకు ఐలమ్మ ఆదర్శమని, వివక్షతను నిరసిస్తూ సాగిన పోరాటం ఎన్నటికీ అనుసరణీయమని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర మరువలేనిదని ఆయన కొనియాడారు.

పేదలకు వరం 'సీఎం సహాయనిధి'





● ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

పేదలకు వరం సీఎం సహాయనిధి అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకనంద్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద గురువారం 129- సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన ఆర్.లక్ష్మి భర్త ఆర్.గణేష్ (రూ.2.00 లక్షలు), 132 - జీడిమెట్ల డివిజన్ వెంకన్న హిల్స్‌కు చెందిన పద్మావతి భర్త ఎం.వెంకటేశ్వర్లు (రూ.2.00 లక్షలు), 130- సుభాష్ నగర్ డివిజన్‌కు చెందిన పి.నరసింహ రాజు తండ్రి పి.సత్యనారాయణ రాజు (రూ.3.00 లక్షలు) అనే ముగ్గురు లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి దాదాపు రూ.7 లక్షలు ఎల్‌ఓసి మంజూరు చేయించి, పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య చికిత్స కోసం ఎదురుచూసే నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఆరోగ్య భద్రతనిచ్చేది ఆపద్బాంధువు అని అన్నారు.

డాడీస్ రోడ్ సేఫ్టీ క్యూఆర్ డెకాల్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో "డాడీస్ రోడ్ సేఫ్టీ" క్యూఆర్ డెకాల్‌ను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో మన వారిని అలర్ట్ చేస్తూ సమీపంలోని పోలీస్ స్టేషన్, స్థానిక హాస్పిటల్స్‌కు ప్రమాద సమాచారం అందించడంతో పాటు వాహన చోరీలను నివారించడానికి ఇలాంటి యాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

గణేష్ నగర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,131- కుత్బుల్లా పూర్ డివిజన్ గణేష్ నగర్‌లో రూ.1.80 కోట్లతో నిర్మిస్తున్న నాలా బ్రిడ్జి పనులను గురువారం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియో జకవర్గంలోని అన్ని నాలాలను ఒక క్రమ పద్ధతిలో ప్రణా ళిక బద్దంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నాలాల అభివృద్ధి ద్వారా కాలనీలలో నీరు నిల్వ ఉండకుండా ముంపు తీవ్రతను తగ్గించవచ్చు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మీ గణేష్, డిఈ పాపమ్మ, ఏఈ మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ కెం.గౌరీష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తి రెడ్డి, సీనియర్ నాయకులు కిశోర్ చారి, యేసు, ఆంజనేయులు, రమణారెడ్డి, పాల్గొన్నారు.



అధికారులతో,ఎమ్మెల్యే సమీక్ష



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నియోజకవర్గంలో ప్రజలకు ఎక్కడా కూడ ఇబ్బందులు కలగకుండా.. మంచినీళ్లు, డ్రయినేజీ, రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఇంజనీరింగ్ అధికారులు, వాటర్ వర్క్స్ అధికారులతో కలసి ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో మొన్న వచ్చిన భారీ వర్షాల కారణంగా.. రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ దెబ్బతిన్నాయి. మంచినీటి పైప్ లైన్ సరిగా లేకపోవడం వల్ల నీళ్లు రావడం లేదని, పిర్యాదులు అందాయని ఎమ్మెల్యే అన్నారు. అధికారులు అందరు రాబోయే పండుగలు దృష్టిలో పెట్టుకొని రోడ్లు, డ్రయినేజీ, మంచినీటి వ్యవస్థ పనులు ముమ్మరం చేయాలన్నారు. అదే విధంగా నూతన రోడ్లు, డ్రయినేజీ మంచినీటి వ్యవస్థ వేయడానికి కావలసిన నిధుల కోసం అంచనాలను తయారు చేయాలని అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. బతుకమ్మ పండుగకు రంగదాముని చెరువు వద్ద కావలసిన ఏర్పాట్లను అధికారులు సమన్వయం చేసుకొని ఆడపడుచులకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, ఇంజనీరింగ్ ఈఈ.గోవర్ధన్, శ్రీనివాస్, డిఈలు శ్రీదేవి, శంకర్, ఏఈలు, వాటర్ వర్క్స్ జీఎం ప్రభాకర్, డీజీఎంలు అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ చెక్కు అందజేత..



● మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ డివిజన్, భాగ్యలక్ష్మి కాలనీకు చెందిన సారె సుమలత అనే మహిళ అనారోగ్యంతో భాదపడుతుండంతో, శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఆమె భర్త ఆనంద్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని ఆశ్రయించగా.. మాజీ ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.1,50,000 (ఒక లక్ష యాభై వేలు) సీఎం రిలీఫ్ ఫండ్ - ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. సదరు భాదిత మహిళకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ - ఎల్‌ఓసీ పత్రాలను గురువారం తన నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులు ఆపద సమయంలో స్పందించి, సహాయం చేసిన మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ గారికి ధన్యవాదాలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే తన నివాసం వద్ద పలు కాలనీలకు చెందిన ప్రజలు నాయకులు కలిశారు. పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ గౌడ్, బుచ్చిరెడ్డి, ఐలయ్య, జనార్దన్, జగన్, కృష్ణారెడ్డి, జహీర్ భాయి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుండిగల్‌లో పోషణమాసం కార్యక్రమం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండలం, బాచుపల్లి మండలం అంగన్వాడీ టీచర్‌లు, దుండిగల్ గ్రామంలో సంయుక్తంగా పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు సీడీపీ అధికారి శారద, దుండిగల్ మండలం అంగన్వాడీ సూపర్‌వైజర్ శోభారాణి, బాచుపల్లి సూపర్‌వైజర్ రేణుక,హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనూ స్వామిలు హాజరైనారు. ఈ సందర్భంగా పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమంలు నిర్వహించారు. ముఖ్యంగా ప్రీ స్కూల్ సెలబస్, చిన్నారులకు రైమ్స్, గర్భిణీ స్త్రీలకు శ్రీమంతంలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం వంటి కార్యక్రమం నిర్వహించారు. పోషకాలపై, వాటివల్ల పోషకాల విలువలు బాలంతలు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని అంగన్వాడీ టీచర్‌లు, సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



● కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఇబ్బందులు పడకుండా నాలా, కమిటీ హాల్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం డివిజన్, లెనిన్ నగర్, శ్రీనివాస్ నగర్‌లో జరుగుతున్న పనులను ఉప కమిషనర్ మల్లారెడ్డి స్థానికులతో కలిసి పరిశీలించారు. తమ ప్రాంతాల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని జెడ్.సి.దృష్టికి వారు తీసుకొచ్చారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, ఆయా ప్రాంత వాసులు పాల్గొన్నారు.

లింక్ రోడ్ల అభివృద్ధితో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది



● ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లి - భౌరం పేట్ రహదారిలో రూ. 60 లక్షల ఎమ్మెల్యే సీడీపీ నిధులతో నూతనంగా నిర్మించిన లింక్ రోడ్డును గురువారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు.

ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ లింక్ రోడ్ల అభివృద్ధితో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందన్నారు. అంతేకాక రోడ్ల అభివృద్ధి ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధి జరుగుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మెన్ తుడుం పద్మా రావు, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, భరత్, సత్యనారాయణ, దుండిగల్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాజీవ్ గృహకల్ప మహాసభలు

● పార్టీ రాజీవ్ గృహకల్ప కార్యదర్శిగా నాగనిగళ్ళ బాలపీర్ నియామకం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప రెండో మహాసభ సుందరయ్య భవనం ప్రగతి నగర్‌లో సీపీఐ(ఎం) బాచుపల్లి కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మొదట అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి నూతన రాజీవ్ గృహకల్ప కార్యదర్శిగా నాగనిగళ్ళల బాల పీరు ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు అనంతరం మహాసభ ప్రారంభించారు. మహాసభ నివేదిక బాలపీరు గత మూడు సంవత్సరాల కార్యక్రమాలు రిపోర్టు ప్రవేశపెటారు. అనంతరం సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బి.వెంకటరామయ్య మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో మనం పని చేయాలి పై కమిటీల నుండి వచ్చే పిలుపులను అమలు చేయాలి. పేపర్ చదవాలి.. పుస్తకాలు చదవాలి.. సభ్యులు చైతన్యం పెంచుకోవాలి. చుట్టూ ప్రజా సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి పార్టీ విస్తరించడానికి పలు అంశాలపై కృషి చేయవలసింది ఉంది భవిష్యత్తులో రాజీవ్ గృహకల్ప రోడ్లు మంచినీటి సమస్య, డ్రయినేజీ, కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర కాంపౌండ్ వాల్ నిర్మించాలని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులైన పేదలకు ఇవ్వాలని రాజీవ్ గృహకల్పలో అలాట్మెంట్ కానీ 45 ఇండ్లను అక్రమదాల నుండి కాపాడి అర్హులైన పేదలకు ఇవ్వాలని బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మూడు డివిజన్‌లో పార్టీని విస్తరింప చేయాలని ఈ విషయం అందరం భాగ్య స్వాములు కావాలని ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని అందులో భాగంగానే శ్రీలంకలో కమ్యూనిటీ పార్టీ విజయం సాధించిందని వారికి జేజేలు పలికారు. బీజేపీ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రతి కార్యకర్త భాగస్వాములు కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని సూర్తిగా తీసుకొని ముందుకు పోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) బాచుపల్లి మండల నాయకులు భాస్కర్ జయమ్మ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్ షాప్



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం గురువారం డేటా పాయింట్ ఆధ్వర్యంలో.. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్‌ల రూపకల్పనల పై కళాశాలలో వర్కషాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్క్ షాప్‌ని ఉద్దేశించి.. కళాశాల ఈసీఈ విభాగాధిపతి ప్రొ.డా పురుషోత్తమ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ పరికరాలకు పీసీబీలు వెన్నెముక వంటిదని, స్మార్ట్ ఫోన్ నుండి పారిశ్రామిక రంగాలలోని సంక్లిష్టమైన యంత్రాల వరకు, పీసీబీలు ఎలక్ట్రానిక్ భాగాలను కనెక్ట్ చేయడానికి అవసరమైన ఫ్రేమ్ వర్క్ను అందిస్తాయన్నారు. అవి పరస్పర అనుసంధానానికి ఒక సాధనం మాత్రమే కాకుండాబీ ఎలక్ట్రానిక్ సిస్టమ్ల పనితీరు, విశ్వసనీయత కాంపాక్ట్నసి పనితీరులోఅవి కీలక పాత్ర పోషిస్తాయనీ తెలిపారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో ఎవరికైనా పీసీబీలను అర్థం చేసుకోవడం చాలా కీలకమని పేర్కొన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్నప్పుడు, మరింత సమర్థవంతమైన శక్తివంతమైన పరికరాలకు గిరాకి పెరుగుతుందని తెలియజేశారు. ఇక్కడే పీసీబీ రూపకల్పనల వాటి తయారీలు పురోగమిస్తాయని డేటా పాయింట్ ప్రతినిధి పీసీబీల ప్రాముఖ్యతను వివరించారు. ఈ వర్కషాప్‌లో విద్యార్థులు పీసీబీల రూపకల్పన, వాటి తయారీ విధానం అందుకు వినియోగించే లోహాల ఎంపిక, వాటి నాణ్యతను పరీక్షించడం వంటి ఎన్నో అంశాల ను స్వయంగా నేర్చుకోగలిగరన్నారు. ఇలాంటి వర్కషాప్స్ మరిన్ని జరగాలని తద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత వృద్ధి చేసుకోగలరని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్ లోకనాథం అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మెన్ జె.నర్సింహారెడ్డి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగ. సమన్వయకర్త ప్రొ.పవిత్ర ఓట్ ఆఫ్ థాంక్స్‌తో ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా. ఏ మోహన్ బాబు, ప్రిన్సిపాల్ డా.ఆర్. లోకనాథం, ఈసీఈ విభాగాధిపతి ప్రొ.డా.పురుషోత్తం ప్రసాద్, కార్యక్రమ సమన్వయకర్త ప్రొ.పవిత్ర విద్యార్థులు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక ఐలమ్మ

- జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేష్

నవతెలంగాణ - బంజారాహిల్స్



భూమి కోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను పోరాట స్ఫూర్తి ప్రపంచానికి చాటిన నిప్పుకణిక తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ భవన్‌లో బీ ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఐలమ్మ చిత్ర పటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు.



దారుల్‌షీఫా అంధుల పాఠశాలలోని విద్యార్థులకు ఐ ఫౌండేషన్, షెపర్డ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బోధనా సామాగ్రి, క్యాడ్బరి బిస్కట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్, లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

యువత భవితకు పత్యేక చర్యలు

- ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ కాలేజీలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

తెలంగాణ యువత భవిత కోసం తమ ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. నిరుద్యోగులకు నైపుణ్య విద్య అందించడానికి ఈ ప్రభుత్వం స్కిల్ యునివర్సిటిని ఏర్పాటు చేసిందని, ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రతి జిల్లా కేంద్రంలో కూడా స్కిల్ డెవలప్మెంట్ కాలేజీలను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు.

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ MSME (ni-msme) నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ PMKVY 4.0 (స్వల్పకాలిక శిక్షణ) పథకం కింద "స్వచ్ఛత హి సేవా" ఈవెంట్‌ను నిర్వహిస్తోంది. గురువారం యూసుఫ్ గూడలో జరిగిన "ప్రభుత్వ స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించే అగ్రగామి గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్ది, స్థానికంగాను, విశ్వవ్యాప్తం గాను, సులభంగా ఉద్యోగాలు పొందడానికి కావలసిన ప్రపంచ స్థాయి నైపుణ్యాలను, తెలంగాణా యువకుల్లో పెంపొందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇప్పటికే ఈ దిశగా పలు చర్యలు చేపట్టమన్నారు. ఈ ధ్యేయంతో తెలంగాణా ప్రభుత్వం హైదరాబాద్‌లో పబ్లిక్ -ప్రయివేటు భాగస్వామ్యంతో "తెలంగాణా నైపుణ్యాలవిశ్వవిద్యాలయాన్ని" స్థాపించిందని తెలిపారు. ఈ విశ్వవిద్యాలయంలో వివిధ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పే 17 రకాల సర్టిఫికెట్, డిప్లమో, డిగ్రీ కోర్సులను ఏర్పాటు చేసిందని, ఉద్యోగార్జనే ఏకైక లక్ష్యంగా ఈ కోర్సుల బోధనాంశాలకు రూపకల్పన చేస్తామన్నారు.

ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్టుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ, ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మారుస్తున్నామని, ఇందుకు అనుగుణంగా తెలంగాణలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకురాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో పదేండ్లకుగానూ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చు కుంద న్నారు. ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణం గా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారని.. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారని తెలిపారు. శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణలను టీటీఎల్ నియమిస్తుందని.. ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ,ఆరు రకాల దీర్ఘ కాల (లాంగ్ టర్మ్) కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్ప కాలిక (షార్ట్ టర్మ్) కోర్సుల్లో శిక్షణ అందిస్తారన్నారు.

గత పదేండ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందగా, ఈ ఏటీసీలతో రానున్న పదేండ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందేవిధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని అన్నారు. రూ. 2,324 కోట్ల వ్యయంతో ఐటీఐలను ఏటీసీలుగా మార్చబోతున్నామని ప్రకటించారు. ఏటీసీ లు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివద్ధి కేంద్రాలుగా పని చేస్తాయన్నారు. అలాగే ఈ ఏటీసీలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయన్నారు. సర్టిఫికెట్స్ పంపిణీ చేసిన అనంతరం స్వచ్ఛతా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్స్ కావు.... మరణ ద్వారాలు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- కానరాని సూచిక బోర్డులు, గ్రిల్స్
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది





నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎక్కడైనా మ్యాన్ హెూల్స్ మూతలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని జీహెచ్ఎంసీ అధికారుల హెచ్చరికలు నీటిబుడగలుగా మారుతు న్నాయి. ప్రజల ప్రాణాలతో మురుగునీటి నిర్వహణ అధికారులు, సిబ్బంది ఆడుకుంటున్నారు. దాంతో రహదారులపై ఉన్న మ్యాన్ హెూల్స్ మరణ ద్వారాలుగా తయారవుతున్నాయి. గురవారం సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో సోమాజీగూడలోని ఎర్రమంజిల్ ప్రాంతంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలోని డీప్ మ్యాన్‌హెూల్ మూత తెరిచిపెట్టిన సిబ్బంది ఓ కర్రను అడ్డుపెట్టారు. అదే దారిలోని మెర్క్యూర్ హెూటెల్ వద్ద గల ఫుట్‌పాత్‌పై ఉన్న రెండుమూడు మ్యాన్‌హెూల్స్‌ను సైతం తెరిచిపెట్టారు. అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు కానీ, గ్రీల్స్ కానీ ఏర్పాటు చేయలేదు. వాహనదారులను, చిన్నారులు, పాదాచారులను అప్రమత్తం చేసేందుకు కనీసం సిబ్బందికూడా అందుబాటులో లేకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. అక్కడి నుంచి వెళ్లేవారు సెల్‌ఫోన్ చూస్తూ వెళ్లడమో లేదా ఆదమర్చివెళ్తే అంతే సంగతులు. మురుగునీటి నిర్వహణ సిబ్బంది నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలికావాల్సిందే. అసలే వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్, అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా మ్యాన్‌హెూల్స్ మూతలు తెరువొద్దని, ఎక్కడైనా మ్యాన్ హెూల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనిస్తే వెంటనే సమచారం ఇవ్వాలంటూ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తేరుకుని తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కంటోన్మెంట్‌లో పర్యటించిన కమిషనర్

నవతెలంగాణ-కంటోన్మెంట్

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి గురువారం డిఫెన్స్ డైరెక్టర్ జనరల్ రాజేష్ మిట్టల్‌తో కలిసి కంటోన్మెంట్ బోర్డ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత ఆమె బోర్డు కార్యాలయంలో బిజీ రాజేష్ వికల్, సీఈవో మధుకర్ నాయక్, ఇతర అధికారులతో కలిసి సమావేశమయ్యారు. అనంతరం బోర్డు పరిధిలో పలు ప్రాంతాలను పార్కులను సందర్శించారు. కాగా ఎందుకు పర్యటిస్తున్నారు, సమావేశ వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. ముఖ్యంగా కంటోన్మెంట్ విలీనంపై అవగాహన కోసం వారు పర్యటించారా అన్న సందేహంలో కూడా ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

రేపటి నుంచి ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ సమావేశాలు

- తెలంగాణ నుంచి 60 మంది ప్రతినిధులు
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవ పున్నయ్య

నవతెలంగాణ -కంటోన్మెంట్



ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 28 నుంచి మూడ్రోజుల పాటు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మథుర (బృందావన్)లో జరగనున్నాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యులు మామిడి సోమయ్య, బసవ పున్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ అధ్యక్షులు కె.విక్రమ్‌రావు అధ్యక్షతన జరగనున్న ఈ కౌన్సిల్ సమావేశాలకు తెలంగాణ నుంచి దాదాపు 60 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా సుమారు వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఐఎఫ్‌డబ్ల్యూజే ఆఫీస్ బేరర్లు, జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా రాష్ట్రాల అనుబంధ జర్నలిస్టు యూనియన్‌ల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమావేశాల సందర్భంగా నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ న్యూస్ పేపర్స్, న్యూస్ ఏజెన్సీస్ ఎంప్లాయీస్ యూని యన్‌ల సమావేశం కూడా జరుగుతుందని, దీనికి కాన్ఫడరేషన్ అధ్యక్షులు డాక్టర్ ఇంద్రకాంత్ దీక్షిత్ నేతృత్వం వహిస్తారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తారన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను మీడియ కౌన్సిల్‌గా మార్చాలని, డిజిటల్, సోషల్ మీడియా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, జాతీయ పెన్షన్ విధానం, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తదితర డిమాండ్లపై సమావేశాల్లో చర్చించి కార్యాచరణ రూపొందిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశాలకు తెలంగాణ నుంచి పలువురు జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు, వివిధ జిల్లాల ఫెడరేషన్ ప్రతినిధులు శుక్రవారం బయలుదేరి వెళుతున్నారని తెలిపారు.



చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం సీపీఐ(ఎం) న్యూ నాగోల్ డివిజన్ ఆధ్వర్యంలో ఎల్ శంకర్ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు.
నవతెలంగాణ -నాగోల్

భవిష్యత్తు భారత ప్రమాణాలదే

- నాణ్యత అంటే ఖర్చు కాదు.. అవసరం
- నాసిరకం వస్తువుల తయారీ చేయొద్దని తయారీదారులకు సూచన
- బీఐఎస్ సదస్సులో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

భవిష్యత్తులో ప్రపంచ దేశాలన్నీ భారతీయ ప్రమాణాలపై ఆధారపడే రోజు వస్తుందని.. నాణ్యతకు చిరునామాగా మన దేశం మారుతుందని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. ఆ దిశగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం సోమాజిగూడ కత్రియా హెూటల్‌లో జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

నాణ్యతా ప్రమాణాలు అనగానే జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలు మన ఆలోచనల్లోకి వస్తాయని.. రాబోయే రోజుల్లో ఇది మారి భారత్ నాణ్యతా ప్రమాణాలకు కేంద్రబిందువుగా మారుతుందని.. విశ్వవేదికపై నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మన నిత్యజీవితంలో చూసే, వాడే ప్రతి వస్తువుకూ ఐఎస్ఐ మార్కు ఉంటుందని.. అది నాణ్యతకు భరోసానిస్తుందన్నారు. నాణ్యత అనగానే ఖర్చు గుర్తుకు రాకూడదని.. అది ప్రతి ఒక్కరి అవసరమని స్పష్టం చేశారు.

సదస్సులో పాల్గొన్న వివిధ ఎలక్ట్రానిక్, విద్యుత్, తదితర వస్తువుల తయారీదారులనుద్దేశించి మాట్లాడుతూ.. ఏ ఒక్కరూ నాణ్యతకు తిలోదకాలు వదలొద్దని సూచించారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం నాసిరకం సరకు తయారు చేస్తే అది మొత్తం మానవాళి భవిష్యత్తు మనుగడపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ప్రపంచస్థాయి మెట్రో, ఇతర అభివృద్ధి పనులు ఇప్పుడు ప్రపంచం దృష్టికి ఆకర్షిస్తున్నాయన్నారు. వ్యక్తిగత బాధ్యతగా ప్రతీ ఒక్కరూ భారతీయ ప్రమాణాలను పాటించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే పిల్లల్లో భారతీయ ప్రమాణాలు, నాణ్యతపై అవగాహన కల్పించేందుకు భారతీయ ప్రమాణాల బ్యూరో దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో స్టాండర్డ్స్ క్లబ్స్ ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు.

అనంతరం బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. అక్టోబర్ 14 వరకు జరిగే ప్రపంచ ప్రమాణాల దినోత్సవ వేడుకల్లో భాగంగా.. వ్యక్తిగత బాధ్యతగా ప్రమాణాలను పాటిస్తామని, నాసిరకం వస్తువుల కట్టడికి భాగమవుతుమాని ప్రతీ ఒక్కరూ ప్రతినబూనాలని కోరారు. బీఐఎస్ కేర్ యాప్ ద్వారా అరచేతిలోనే వస్తువుల నాణ్యతతో పాటు బంగారు ఆభరణాల శుద్ధతను నిర్ధారించుకోవచ్చని తెలిపారు. ప్రమాణాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు వివిధ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. అందరూ ఇందులో భాగమవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీఐఎస్ అధికారులు సుజాత, తన్వీరు రాకేశ్, అభిసాయి ఇట్ట, వనజామూర్తి, పారిశ్రామికవేత్తలు, వినియోగదారుల సంఘం సభ్యులు, వినియోగదారులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కల్పించడంలో కేంద్రం నిర్లక్ష్యం

- ఐద్వా నగర కార్యదర్శి నాగలక్ష్మి
- ఐద్వా కంటోన్మెంట్ జోన్ మహాసభ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళలపై రోజు రోజుకూ లైంగికదాడులు, హత్యలు పెరిగిపోతూ ఉన్నాయని, దేశంలో మహిళలపై రోజుకు 80 అత్యాచారాలు జరుగుతున్నాయని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నా వీటిని నివారించి మహిళలకు భద్రత కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఐద్వా నగర కార్యదర్శి నాగలక్ష్మి అన్నారు. కంటోన్మెంట్ జోన్ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ దేశంలో గతంలో ఎన్నడూ చూడని రీతిలో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని,అయోధ్య లోని రామాలయం ట్రస్ట్ కాంప్లెక్స్ లోనే ఒక యువతిపై సామూహిక లైంగికదాడి జరిగిందనీ,ఒరిస్సాలో ఒక బ్రిగేడియర్ కూతురిపై పోలీసు స్టేషన్ లో పోలీసు అధికారులే దారుణ లైంగిక హింసకు పాల్పడ్డారని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో జరుగుతున్న అఘాయిత్యాలపై బీజేపీ ఎమ్మెల్యేలు ఎంపీలు నోరు మెదపడంలేదని అనేక కేసులలో బాధితురాలికి న్యాయం చేసే ప్రయత్నాలు చేయడంలేదని చెప్పారు.

ఇక ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన ఈ సభలో నూతన జోన్ కమిటీని ఎన్నుకున్నారు.జోన్ కార్యదర్శిగా పూలమ్మ, అధ్యక్షురాలిగా ఉమాదేవి ఎన్నికయ్యారు. మొత్తం 9 మందితో జోన్ కమిటీ ఎన్నికయ్యింది

జింఖానాలో ఖోఖో, కబడ్డీ టోర్నమెంట్ షురూ..



- టాస్ వేసి ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో 14-17 ఏండ్ల వారికి నిర్వహిస్తున్న ఖోఖో, కబడ్డీ టోర్నమెంట్‌ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్యఅతిథిగా హాజరై టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థిని విద్యార్థులకు చాలా అవసరం అని, క్రీడా పోటీలు పిల్లలలో ఉన్న నైపుణ్యాని బయటికి తీసుకువస్తాయని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి స్పోర్ట్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నదని, దానికి ఉదాహరణ గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో రూ. 361 కోట్లు క్రీడల కోసం కేటాయించిందని గుర్తు చేశారు. తల్లిదండ్రులు పిల్లలను కేవలం చదువులకే అంకితం చేస్తున్నారన్నారు. పిలల్లను ఆటలలో కూడా రాణింపజేస్తే ఉద్యోగం, ఉపాధి వస్తాయని తెలిపారు. వాళ్ల కుటుంబానికి కూడా గౌరవం వస్తుంది అన్నారు. ఇండియన్ క్రికెటర్ సిరాజ్‌కు గ్రూప్ 1 ఉద్యోగం, అలాగే నిఖత్ జరీన్‌కు 600 గజాల ఇల్లు, గ్రూప్ 1 ఉద్యోగం ఇటీవలే ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. సిరాజ్ చదివింది ఇంటర్ మీడియేట్ అయినా క్రీడలో రాణించాడు కాబట్టే ఆయనకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 ఉద్యోగం ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక స్టేడియం పెట్టాలని ఆలోచిస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి స్పోర్ట్స్ అంటే అమితమైన ఆసక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డి.ఈ.ఓ చిరంజీవి ,సికింద్రాబాద్ డి.ఈ.ఓ శ్రీధర్ , రమేష్ గౌడ్, శ్రీదేవి , చంద్రకాంత్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుజన బతుకమ్మ పోస్టర్స్ విడుదల

నవతెలంగాణ-ఓయూ

ఆంధ్ర మహిళ సభ కాలేజీలో బహుజన బతుకమ్మ పోస్టర్‌ను గురువారం ఏఎంఎస్ ప్రిన్సిపాల్ ప్రొ. ఝాన్సీ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అల్లూరి విజయ్ ఆవిష్కరించారు. మహిళలపై పెరుగుతున్న లైంగికదాడులను నిరసిస్తూ, స్త్రీలు గౌరవంగా జీవించే హక్కును చాటి చెబుతూ అక్టోబర్ 2 నుంచి 10 వరకు జరిగే బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, స్త్రీ-పురుష సమానత్వాన్ని, మహిళలపై హత్యాకాండను, ఆడబిడ్డలను ఎదగనిద్దాం.. బతకనిద్దాం అంటూ అన్ని హక్కులను కాపాడుకునేందుకు బహుజన బతుకమ్మ అందుకోసం పోరాడుతుందని తెలిపారు. శుక్రవారం 27న(నేడు) ఓయూ విద్యార్థులచే ఆర్ట్స్ కాలేజీ దగ్గర జరిగే బహుజన బతుకమ్మ ఆట పాట కార్యక్రమంలో విద్యార్థులు, భాగస్వామం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా సభ కళాశాల ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, రమ్యశ్రీ, పీడీఎస్‌యూ(విజంభణ) మహిళా నాయకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రామగుండం థర్మల్ ప్లాంట్ జెన్‌కోతో నిర్మించాలి



- సింగరేణి భాగస్వామ్యం ఒప్పుకోం
- తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్‌ను టీజీ జెన్‌కో ద్వారానే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యం ఒప్పుకోమని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈ జాక్) తెలిపింది. ఈ మేరకు టీజీపీఈ జాక్ ఆధ్వర్యంలో గురువారం 1104 యూనియస్ ఆఫీసులో ఆర్టీఎస్(రామగుండం థర్మల్ స్టేషన్) రామగుండంలోని జెన్‌కో, సింగరేణి ఆధ్వర్యంలో తలపెట్టనున్న 1x800 నూతన పవర్ ప్లాంట్ వ్యతిరేకిస్తూ.. నల్లబ్యాడ్జీలతో జాక్ నేతలు నిరసన తెలియజేశారు. రామగుండంలో జెన్‌కోకు చెందిన భూమిలో ఆ సంస్థ ద్వారానే నిర్మించాలని వారు కోరారు. జాయింట్ వెంచర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ టీజీపీఈ జాక్ ఆధ్వర్యంలో దశలవారీగా పలు ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈనెల 30 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు గేట్ మీటింగ్, 4,5వ తేదీల్లో లంచ్ అవర్ డెమోనిస్ట్రేషన్స్ అన్ని కేంద్రాల్లో, కార్పొరేట్ ఆఫీసుల్లో, విద్యుత్ సౌధలో చేయాలని నిర్ణయించారు. అప్పటికీ నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే తదుపరి కార్యాచరణ 5వ తేదీన వెల్లడిస్తామని జాక్ నాయకులు ప్రకటించారు. వెంటనే రాష్ట్ర మంత్రి చొరవతో తీసుకొని జెన్‌కో ద్వారానే ఆర్టీఎస్ నిర్మించాలని, ప్రభుత్వ రంగ సంస్థను కాపాడాలని జాక్ నేతలు కోరారు. వెంకట్ నారాయణ రెడ్డి, బాలకృష్ణ, సదానందం, రాజేష్, నగేష్, శ్రీనివాస్, పి.వి. రావు, సురేష్, ప్రశాంత్, పవన్, విద్యాసాగర్ , రాజేశ్వరరావు, కిరణ్, రవి, ధనలక్ష్మి, సుధా, స్వప్న, స్వాతి, మౌనిక, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే శ్రీ గణేష్
- పలు ప్రాంతాల్లో చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఉద్యమ స్ఫూర్తిగా నిలిచినా ధీరవనిత ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు గురువారం మూడో వార్డులోని మార్ట్ పోర్ట్ వద్ద రజక సంఘం వారు ఏర్పాటు చేసిన ఐలమ్మ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐలమ్మ పేరును చిరస్థాయిగా ఉండేందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోఠిలోని మహిళా విద్యాలయానికి ఐలమ్మగా నామకరణ చేశారని ప్రస్తావించారు. తన లాంటి రాజకీయ నాయకుల పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తి అని అన్నారు. రజాకార్లు, దొరలు అనేక విధాల ఆమెను ఇబ్బందులు పెట్టినా ధైర్య సాహసాలతో అప్పటి ఆంధ్ర మహాసభ నాయకులతో కలిసి దొరల భూములను పేదలకు పంచిపెట్టిన వీరవనిత ఐలమ్మ అని పేర్కొన్నారు ఐలమ్మ. ఆమె ఆశయాలు ఆచరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులూ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ : చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జూబ్లీహిల్స్ జోన్ అధ్యక్ష కార్యదర్శులు కే యాదగిరి ,జి బిక్షపతి డిమాండ్ చేశారు. కృష్ణకాంత్ పార్క్ వద్ద తెలంగాణ రజక వత్తిదారుల సంఘం, జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. జూబ్లీహిల్స్ జోన్ అధ్యక్ష కార్యదర్శులు కే యాదగిరి ,జి బిక్షపతి మాట్లాడుతూ, వీరనారి అగ్ని కణం చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రజక వృత్తిదారుల సమస్యల పైన పోరాడాలని పిలుపునిచ్చారు. జనగామ జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టాలని, రజక వృత్తిదారులకు రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులకు ఫ్రీ కరెంట్ 200 యూనిట్ల వరకు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే రద్దు చేయాలని కోరారు. వృత్తిదారుల సంఘం నాయకులు అశోక్ ,ఉపేందర్ రవి పాల్గొన్నారు.



ఓయూ : ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో రజక విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా రాగల్ల గంగాధర్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులతో కలిసి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు .విద్యార్థి సంఘ నాయకులు డా. రాగల్ల గంగాధర్ , ఆర్ ఎల్. మూర్తి, డా ఇంద్రకంటి వెంకటేష్, డా విఠల్, డా లింగమయ్య, రమణ, శ్రీకాంత్, విద్యార్థి నాయకులు మాటాడుతూ ఐలమ్మ ఆశయాలు కనుగుణంగా పనిచేయాలని కోరారు. వెంకట్,రాము, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.



ఇండోర్ లోని చెత్త నుండి సి. ఎన్. జి తయారు చేసే సి. ఎన్. జి ప్లాంట్ ను జిహెచ్ఎంసి స్టడీ టూర్ లో భాగంగా ఇండోర్ లోని చెత్త నుండి సి ఎన్ జి తయారు చేసే సి ఎన్ జి ప్లాంట్ ను గురువారం మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇక్కడ పొడి, తడి చెత్తలను వేరు వేరుగా ప్రాసెస్ చేసి ప్రతీ రోజు దాదాపు రూ.20 లక్షల ఆదాయాన్ని సంపాదించడమే కాకుండా పొలాలకు కంపోస్ట్ మెటీరియల్ (ఎరువు) అమ్ముతున్నారని, ప్రజా ప్రతినిధులు అధికారుల ద్వారా తెలుసుకోవడం జరిగింది అని తెలిపారు. ఇలాంటి వ్యవస్థను మన జిహెచ్ఎంసి లో కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. -నవతెలంగాణ-నేరేడ్ మెట్



చెత్త సేకరణ విధానాన్ని తెలుసుకున్న కార్పొరేటర్

నవతెలంగాణ-నేరేడ్ మెట్

జిహెచ్ఎంసి స్టడీ టూర్ లో భాగంగా ఇండోర్ లో మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతోందో తెలుసుకోవడానికి పలు ప్రదేశాలలో తిరిగారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అంబేద్కర్ నగర్ లోని నాలా పక్కన ప్రజలు పండుగ రోజులలో భోజనం చెయ్యడం అద్భుతం గా ఉందని, ప్రజలు ప్రతీ రోజు చెత్త ఆటో లలో తడి పొడి చెత్త వేరు వేరుగా వేసుకోవడం అత్యద్భుతమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండోర్ లోని మున్సిపల్ అధికారులు ముఖుల్, రాజు, కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.



ఐలమ్మ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలి





● రాచకొండ సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

తెలంగాణ వీరవనిత చిట్యాల ఐలమ్మ 129 వ జయంతి సందర్భంగా నేరేడ్‌మెట్ లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ఐలమ్మ చిత్రపటానికి రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, రైతాంగ సాయుధ పోరాటం చేసి, మహిళల్లో పోరాట స్ఫూర్తి నింపిన తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట పటిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

రజక సంఘం ఆధ్వర్యంలో

వీరనారి చిట్యాల ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్‌లోని జ్యోతినగర్ లోని దోబీ ఘాట్‌లో గురువారం రజక సంఘం కార్యదర్శి కాసర్ల నాగరాజు అధ్యక్షతన వీరనారి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న పాల్గొని మాట్లాడుతూ వీరనారి ఐలమ్మ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం దున్నే వాడికె భూమి కోసం, చేసిన పోరాటం చరిత్రలో నిలిచిందని, ఐలమ్మ స్ఫూర్తితో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, తెలంగాణ రైతంగా సాయుధ పోరాటంలో 4వేల 5వందల మంది పోరాట యోధులు అమరులయ్యారని తెలిపారు. ఆ పోరాట స్ఫూర్తితో గతంలో ఉన్న దోబీ ఘాట్ ను రజకులకు వచ్చే విధంగా రజకులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి మద్దతు పలుకుతు బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున కూడా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు జి పాండు, బీసీ కులం ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, రాష్ట్ర నాయకులు బత్తిని నరసింహ గౌడ్, పిట్టల భాస్కర్, పేపర్ శ్రీనివాస్, చుక్క సుధాకర్, జోగు శ్రీనివాస్, రజక సంఘం నాయకులు సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్, కే శ్రీకాంత్, వి సతీష్, తిరుపతి, ఆర్.యాదగిరి, ఆర్ శంకర్, ఆల్ పార్టీ నాయకులు రామచంద్రం, టీ యాదయ్య గౌడ్, సిద్ధిరాములు, కె శంకర్ ఏం బాబు, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేటలో..

వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారిణి, వీరవనిత చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని సింగాయిపల్లి లో రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, బానిస సంకెళ్లనుంచి విముక్తి కోసం సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన వీరత్వం తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అన్నారు. చాకలి ఐలమ్మ జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కోమటిపల్లి సురేష్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి, సింగాయిపల్లి హకీంపేట్ రజక సంఘం అధ్యక్షుడు డి శంకర్, నాయకులు గణపుర్ కృష్ణ, వలందాస్ మురళి గౌడ్, పిన్నింటి ధర్మారెడ్డి, మహమ్మద్ జాఫర్, పారనంది బాల్ రాజు, వజ్జల శశాంత్, నక్క మల్లేష్ గౌడ్, జూపల్లి రాజు, జె నాగేశ్వర్ రావు, జె సురేష్, కే శ్రీనివాస్,ఎ రాఘవేందర్, బుల్లెట్ సాయి, కే శివన్న, యమ్ శశి తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో 11 కుటుంబాల తరలింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో


మూసీ రివర్ బెడ్ లో నివాసం ఉంటున్న పది కుటుంబాలను మేడ్చల్ అధికారులు గురువారం డబుల్ బెడ్ రూం ఇండ్లకు తరలించారు. కొత్తపేటలోని భవాని నగర్, రోడ్ నెం. 10 లో నివాసం ఉంటున్న పది కుటుంబాలతో బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడి, వారిని డబుల్ బెడ్ రూం ఇండ్లకు తరలించడానికి ఒప్పించారు. దీంతో గురువారం వారిని వనస్థలిపురంలోని ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లకు తరలించారు. ప్రభుత్వ ఖర్చులతో వారి సామానులను డీసీఎంలలో తరలించారు.

శుక్రవారం కూడా సాధ్యమైనంత వరకు రివర్ బెడ్‌లో నివాసం ఉంటున్న కుటుంబాలను ఒప్పించడానికి ప్రయత్ని స్తామని అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లో కార్యకలాపాలను ప్రారంభించిన మెక్సరోసా

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

సమకాలీన ట్విస్ట్‌తో ప్రామాణికమైన మెక్సికన్ రుచులను, వంటకాల ఆకర్షణీయమైన, ప్రామాణికమైన సొగసైన, శక్తివంతమైన భోజన అనుభవంతో మిళితం చేసే సరికొత్త కలినరీ గమ్యస్థానం మెక్సరోసా.. జూబ్లీహిల్స్ లోని రోడ్ నెంబర్ 22లో గురువారం అధికారికంగా తన తలుపులు తెరిచింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రతి వంటకాన్ని సమున్నతం చేసే ఆధునిక మలుపుతో సాంప్రదాయ మెక్సికన్ ఆహారం గొప్పతనాన్ని వేడుక జరుపుకునే ప్రత్యేకమైన గ్యాస్ట్రోనమిక్ ప్రయాణాన్ని అతిథులకు పరిచయం చేసింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఒక లీనమయ్యే అనుభూతిని అందించింది. శక్తివంతమైన రంగుల కలయిక, జాగ్రత్తగా ఎంపిక చేసిన సంగీతం, స్టార్ ఆఫ్ ది ఈవినింగ్‌గా నిలిచిన మెక్సరోసా వినూత్నమైన, ఆహ్లాదకరమైన మెనూ ద్వారా ప్రజలను మెక్సికో తీరాలకు తీసుకువెళ్ళింది. మెక్సికన్ సంప్రదాయాల ద్వారా ప్రేరేపించబడిన ఆహ్లాదకరమైన కాక్‌టెయిల్‌ల నుంచి తాజా, అధిక-నాణ్యత పదార్థాలు, సమయానుకూలమైన సాంకేతికతలతో రూపొందించిన వంటకాల వరకు, మెక్సరోసా అసమానమైన భోజన అనుభవాన్ని అందజేస్తానని హామీ ఇచ్చింది. రెస్టారెంట్ ప్రారంభం గురించి మెక్సరోసా ప్రతినిధి టి ఆదిత్య రెడ్డి తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, "మెక్సరోసాను హైదరాబాదకు పరిచయం చేయడం మాకు చాలా ఆనందంగా ఉంది. మా లక్ష్యం కేవలం భోజనం కంటే ఎక్కువ అందించడమే-మెక్సికో గొప్ప రుచులు, శక్తివంతమైన సంస్కృతి ద్వారా ప్రజలను ఒకచోట చేర్చే అనుభవాన్ని మేము సృష్టించాలనుకుంటున్నాము. ఆహారం నుంచి ఆహార్యం వరకు సూక్ష్మ అంశాల పట్ల కూడా అధిక శ్రద్ధ వహించి, అతిథులు శాశ్వతమైన జ్ఞాపకాలను సొంతం చేసుకోగలరని నిర్ధారిస్తూ ఆలోచనాత్మకంగా రూపొందించాము " అని అన్నారు.



డాన్ బాస్కో హై స్కూల్‌లో ఆటల పోటీలు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎర్రగడ్డ లోని డాన్ బాస్కో హై స్కూల్‌లో నిర్వహించిన ఆటల పోటీల గురువారం ప్రారంభమయ్యాయి. ఖైరతాబాద్, షేక్ పేట్ జోనల్ టోర్నమెంట్, సెలెక్షన్ (కబ్బడి మరియు ఖోఖో) కార్యక్రమానికి బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, డిప్యూటీ ఈవో సామెల్ రాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి.ఈ.ఓ. హైదరాబాద్. ఎం.శామ్యూల్ రాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ - విశ్వేశ్వర్ రావ్, స్కూలు మెనేజ్మెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో మెరుగైన వైద్య చికిత్సలు



● కాలేయ వైద్య నిపుణులు టామ్ చెర్యన్

నవతెలంగాణ-బంజారా హిల్స్

వైద్యరంగంలో అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక పద్ధతులతో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించగలుగుతున్నామని సౌత్ ఏషియన్ లివర్ ఇన్స్టిట్యూట్ లివర్ స్పెషలిస్ట్ టామ్ చెర్యన్ అన్నారు. బంజారాహిల్స్ లోని ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు తేజస్వి, అరుణ్ లతో కలిసి ఆయన మాట్లాడారు. ఇన్ హన్స్డ్ రికవరీ ఆఫ్టర్ సర్జరీ ప్రోటోకాల్ పద్ధతిలో తమ ఆస్పత్రిలో చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పద్ధతిలో రోగి అత్యంత వేగవంతంగా సాధారణ స్థితికి చేరుకుంటాడని తెలిపారు. గతంలో లివర్ శస్త్ర చికిత్స నిర్వహిస్తే సుమారు 20 రోజులు అనంతరం డిశ్చార్జ్ చేసేవారని తమ ఆస్పత్రిలో చికిత్సలు పూర్తిచేసిన 7 నుంచి 8 రోజుల్లోనే రోగులను డిశ్చార్జ్ చేస్తున్నట్లు చెప్పారు.ఇది ఆధునిక చికిత్స పద్ధతి వల్లే సాధ్యం అవుతుందన్నారు. లివర్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదిస్తే శస్త్ర చికిత్స వరకు వెళ్లకుండా సాధారణ స్థితికి కూడా రావచ్చని అన్నారు.

IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURTS: AT: HYDERABAD.
O.S. No. 4622 of 2024

Between:
K Rama Devi & Others ...Plaintiffs
And
To All Concerned & Another ...Defendants

To,
All Concerned

NOTICE

Please take notice that the above named Plaintiffs have filed the above suit to Declare the Plaintiffs as Legal Heirs of Late Sri. Koyakar Srinivas, and the same is posted on 14-10- 2024. That if any person/s has got any kind of objection in the above matter may appear before the Hon'ble Court on **14-10-2024** at 10.30 A.M. either personally or through an Advocate, failing the matter will be decided on the material available.

By the Order of the Court
Valentina
Advocate
Counsel for the Plaintiffs
Phone: 9505641119

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGAREDDY DISTRICT : AT : RAJENDRANAGAR
O.S.NO. 431 OF 2024

Between :-
1. RANGA VIJAYALAKSHIMI w/o Late Vijay kumar Paindla
2. PAINDLA VRISHANK S/o Late. Vijay Kumar Paindla
3. VEDANSH PAINDLA S/o Late. Vijay Kumar Paindla

The Plaintiff No.2 & 3 represented by Plaintiff No.1 through their mother as natural guardian (mother) All the Plaintiffs are R/o VILL No.27, Empire Insignia, Peeramcheruvu, Behind Kali mandir, Bandlaguda Jagir, Hydershakote, K.V. Rangareddy, Telangana - 500091 ....Plaintiffs

AND

The Tahsildar Gandipet Mandal, Rangareddy District & another ...Defendants

SUMMONS

To
All Concerned

The above named plaintiffs have filed suit for declaration to declaring them as legal heirs of deceased Vijay Kumar Paindla he died on 10-05-2024 at Care Hospital Hyderabad. The above suit is posted on 30-09-2024 for objection. If any person or persons having any right claim, interest, or objection over the claim of Plaintiffs. Hence are hereby required to appear in person or through your pleader on the above date by 10.30 AM before the above said Hon'ble Court, failing which the above matter will be heard and deciding accordingly.

//BY ORDERS OF THE COURT//
K. FLORENCE B.com
ADVOCATE & NOTARY
APPOINTED BY THE GOVT OF G.O.MS NO.423 #2-2-66/1, OPP. COURT COMPLEX, UPPARPALLY, RAJENDRANAGAR, R.R.DIST.

IN THE COURT OF THE HON'BLE VIII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT : HYDERABAD
O.S. No. 4527 of 2023

Between:
Sunerha Sanjay ...Plaintiff
And
A. Chandra Shekar ...Defendant

To,
A.Chandra Shekar, S/o. Satyanarayana, R/o. 16-11-281, Moosarambagh, Hyderabad ...Defendant

Whereas the above named plaintiff filed a suit for Recovery of Money against you and the same stands posted to 16-10-2024.

You are hereby directed to appear on 16-10-2024 at 10:30 AM either in person or through pleader, else the matter will be heard and decided Ex-parte.

//BY ORDER OF COURT //
Mohammed Aleemullah
Advocate
D.No. 11-4-892, Chilkalguda, Secunderabad-61.

IN THE COURT OF THE HON'BLE XII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD
O.S.No.5958 of 2023

Between:
Canara Bank, Ameerpet Branch, Hyderabad ...Petitioner/Plaintiff
And
Sri Atla Ranjith Reddy and another ...Respondents/Defendants

To
1.Sri Atla Ranjith Reddy S/o.Atla Narsi Reddy, aged about 32 yrs, Occ: Business, 8/0 3-12-14/B, Srinivas Nagar Colony, Mansoorabad, L.B.Nagar, R.R.Dist-500068.
PH NO: 9177432222.
2.Sri Aylane Satish Reddy S/o Aylane Ram Reddy, aged about 34 yrs, Occ: Business, R/o 3-12-14/B, Srinivas Nagar Colony, Mansoorabad, L.B.Nagar, R.R.Dist-500068.
PH NO: 9100894747.

Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of Rs.1,21,038/- together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person **on the 23rd October, 2024, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
N.Venugopala Rao
Advocate
1-2-234/2/1, Plot No.2/P
Road.No: 4. S.R.Colony
Kothapet. Hyd-bed

IN THE COURT OF THE CHIEF JUDGE. CITY CIVIL COURTS AT: HYDERABAD
I.A.No:3582 of 2024
In
A.S.S.R.No:13659 of 2024

Between:
S.K.Srinivasa Rao ...Petitioner/Appellant
And
A.Govinda Rao ...Respondent/Respondent

Sri. Arudala Govinda Rao S/o.A. Rama Rao R/o. H.No: 3-6-201, Makhdoom Bhavan Himayath Nagar, Hyderabad

NOTICE

Please take notice the above petitioner/Appellant filed case against you for challenging the judgment and decree in OS.No.3070/2019 on the file of X Junior Civil Judge, CCC. At: Hyderabad. The I.A.No-3582/2024 is posted for your appearance and reply **on 18-10-2024 at 10.30 am.** The said case is coming before Hon'ble Chief Judge, City Civil Court, At: Hyderabad.

(Notice as per the orders of the court)
D.Siva Rama Prasad
Advocate
Plot No: 9, APAU Colony Asmangadh/ Hyderabad-60
Mobile No: 9440 615947
Counsel for the Petitioner

పేరు మార్పు

నేను, శ్రీ.ప్రవీణ్ షా తండ్రి సోమచంద్ షా, వయసు సుమారు 56 సం॥లు, నివాసం: ఇ.నెం.3-1-100, రోడ్ నెం.4, శివపురి కాలనీ, సరూర్‌నగర్, ఎల్‌బి నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500074. నా పేరు **ప్రవీణ్ కుమార్ లోదయా** (పాత పేరు) నుండి **ప్రవీణ్ షా** (క్రొత్త పేరు)గా అన్ని భవిష్యత్తు ప్రయోజనాల కోసం మార్చబడిందని దీని ద్వారా ప్రకటిస్తున్నాను.

CHANGE OF NAME

నేను, గుడిపల్లి సరోజ (పాత పేరు) W/o **కల్వకొలను గంగాధర శర్మ** R/o ప్లాట్ నెం 178, R.No.7, విజయపురికాలనీ, వనస్థలిపురం, హైదరాబాద్-70. నా పేరును **కల్వకొలను నాగ సరోజ** గా మార్చుకున్నాను. పాస్‌పోర్ట్ పర్పస్ మరియు ఫ్యూచర్ కరెస్పాండెన్స్ కొరకు ఇకముందు నా పేరు **కల్వకొలను నాగ సరోజ** గా కొనసాగుతుంది.

IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT; HYDERABAD
O.S.No.1392 of 2024

Between:
Canara Bank, Somajiguda Branch, Hyderabad ...Petitioner/Plaintiff
And
M/s Radha Informatics ...Respondent/Defendant

To
M/s Radha Informatics, Represented by its Sole Proprietor Smt Vengala Jyothi Malleswari, W/o Rami Reddy Veeram, aged about 45 years, Occ: Business, R/c 215, 2nd Floor, Panchasheela Towers, Parklane Road, Secunderabad-500003. PH NO: 9059747643.

Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of Rs.12,93,434/- together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person **on the 23rd October, 2024, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
N.Venugopala Rao
Advocate
1-2-234/2/1, Plot No.2/P
Road.No: 4. S.R.Colony
Kothapet. Hyd-bed

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE CUM XIV ADDL JUDICA-IAL MAGISTRATE OF FIRST CLASS AT:HAYATHNAGAR
O.S No. 177 OF 2022

Between
Smt. V. Samantakamani. ...Plaintiff
AND
N. Jagadeeshwar Goud. ...Defendant

To,
N. Jagadeeshwar Goud, S/o Late. Rajaiah,Aged about: 60 years, Occ: Advocate,R/o C-2, Jaya Apartments, Dwarakanagar,R.K Puram, Hyderabad.

Please take the notice that the above named Plaintiff have filed a suit for perpetual injunction, the same is coming for your appearance before the Prl. Junior civil judge cum XIV Additional Judicial Magistrate Of First Class, Ranga Reddy Dist. At: Hayathnagar. The said suit is posted on 16.10.2024 at 10:30 A.M for your appearance. If no appearance is made on your behalf on the above date, the matter will be heard and decided in your absence.

//BY ORDER OF THE COURT//
Nyayapathi Prashanth
Advocate
Office at H.No. 1-1-298/2/2, Flat No. 201, Annapurna avenue Street No.1 Ashok Nagar, Hyderabad-20, Ph:9848887454.

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD
O S NO: 93 OF 2024

Between:-
Mr. Tarugula Sunil Kumar ..... Plaintiff
AND
1. Smt.Siddagari. Jhansi Devi & others ... Defendants

To Smt.Siddagari. Jhansi Devi w/o S.Murali Mohan Aged about: 50 years Occ: Housewife R/o H NO:12-13-468, Tarnaka Street NO:1, Secunderabad 500 007

Whereas, the above named Plaintiff has instituted as suit against you for recovery of money, you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit on the **22 nd day of October 2024** at 10-30 AM., and in default the Hon'ble Court shall pass appropriate orders placing you ex parte.

//BY THE ORDER OF THE COURT//
CH. SHYAM RAO
S.G.E. SWAROOP KUMAR
D.N. SRINIVAS
Advocates
1-7-135/3,Zamistanpur,Hyd-20, Ph:9246533237

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE MEDCHAL-MALKAJGIRI DIST. AT: KUSHAIGUDA
O.S.No.105 of 2024

Between:-
P.Latha & 3 others ...Plaintiffs
And
The Tahsildar/MRD Uppal Bagayat, Uppal Mandal & another Medchal-Malkajgiri Dist. TS. ...Defendants

To
1. The Tahsildar MRO Uppal, Bagayat Uppal Mandal Medchal-Malkajgiri Dist. TS.
2.All Concerneds. ...Defendants

That the Plaintiffs above named have filed the apove suit in O.S. No. 105 of 2024 against the Defendants to Declare them as Legal heirs of Late P. Ramulu Yadav who died on 23-01-2019 at Secunderäppad, and the said case is posted to **14-10-2024** for your appearance either in person or through an advocate **at 10-00 A.M** failure on your part to appear, **on 14-10-2024,** the matter will be decided in your sma absence, setting you exparte.

// BY THE ORDER OF THE COURT//
A.G.DESHMUKH
Advocate
H.NO.20-2-157 3rd floor
K.Y Complex Chota Hussaini Alam, Hyderabad.64.
Cell: 9392259154

IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT : HAYATHNAGAR
O.S. No. 755 of 2024

Between:
Apparao Matha and another ...Plaintiffs
AND
All concerned ..Defendants

To, All Concerned

Please take notice that, the Plaintiffs have filed the above SUIT for declaration to declare them as legal heirs of Late Matha Indira Devi W/o. Matha Appa Rao who died on 15-08-2010 in respect of Suit Schedule Property and the same has been posted on 25-10-2024. If any person(s) having any objection or claims, they may appear on 25-10-2024 at 10:30 AM before the Hon'ble Court, either in person or through advocate, otherwise the matter will be decided basing the documents available on record. **SCHEDULE OF PROPERTY** All that the piece and parcel of the land bearing plot No. 67, in Laxmi Enclave -II admeasuring 200 Sq.Yds or 167.23 Sq.Mtrs, in Survey No.s 58 and 60, situated at Gunthapally Village, Hayathnagar Mandal (Presently Abdullapurmet Mandal), Ranga Reddy District., and bounded by : North : Plot No. 68.South : 33' ft wide road.East : 33' ft wide road West : Plot No. 78

**\\ By order of the court **
M/s. K. Surender Reddy
Advocates
Plot No. 31, Sushma Sai Nagar, Vanathalipuram, Hyderabad - 70
Cell : 9948092567

IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE AT RAJENDRA NAGAR RANGA REDDY DISTRICT
O.S.NO. 726 OF 2022

Between:
01. RAGAM RAVI KUMAR. S/o. Late S Hari, Aged about: 53 years, Occ: Business
02. RAGAM SHIRISHA D/o Ragam Ravi Kumar, Occ: House Wife,& Both R/o. H.No. 1-3-69/4/2, Kavadiguda, Hyderabad-80, TS. ....Plaintiff's
AND
01. The Tahsildar, Shamshabad Mandal, R.R. District.
02 The Tahsildar, Sanga Reddy Mandal, Sanga Reddy District.
03. To All Concerned ...Defendant's

Whereas the above named Plaintiff's has filed a Suit for Declaration of Legal Heirs of Late Ragam Bharathi, W/o. Ragam Ravi Kumar, in respect of the property No. 1. All that the Farm Site Plot No. 1050, admeasuring 404 square yards, or 337.7 sq meters, in survey nos. 124/A-8, 124/A-9, 125/E & 125/VU, in Moghul Gardens" situated at: Kothwalguda Village, and Grampanchayath, Shamshabad Mandal, Ranga Reddy District, Telangana State, Property No.2 All that part and parcel of the land marked as plot no.73/15, in Survey nos. 120, 121 and 125 admeasuring 300 square yards equivalent to 250.83 square meters situated at Pedda Kanjarla Kalan, Sangareddy District, and Property No.3 All that piece of land marked as Plot No. 377 in Block No. D admeasuring 200 square yards or equivalent to 167.2 square meters forming part of land bearing Survey Nos. 61 situated at Ameenpur, within the limits of Ameenpur Gram Panchayat, Patancheru Mandal, Sanga Reddy District, and any person having any right, claim, title interest of any nature whatsoever may appear in the above court in person or by pleader duly instructed on **16th October, 2024,** at 10.30 A.M. to answer the claim. Take notice that in default of appearance on that day, the case will be heard and determined in absence.

//By Order of the Court//
B. MAHESH KUMAR,
ADVOCATE,
H.No. 1-3-3/B/1, Kawadiguda, HYDERABAD -500080, TS,
Cell No. 8639476649
(COUNSEL FOR PLAINTIFF's)

BEFORE THE ARBITRATOR FOR CENTRAL CASES COURT, INTEGRATED OFFICE COMPLEX FOR TAX AND COMMERCIAL VETERINARY HOSPITAL REGISTRATION DEPARTMENT, GROUND FLOOR, CAMPUS, ANNA SALAI, NANDANAM, CHENNAI-600 035.
ARC.No.165/2024

Sree Gokulam Chit & Finance Company (P) Ltd., No.49, Arcot Road, Kodambakkam, Chennai-24. ... Disputant

VERSUS

GOPALA KRISHNA.B & Others
1.Gopala Krishna. B. S/o. Kondala Rao. B, P. No.6, GMR Gardens, Near Suran Nagar, Turkapally, Boluram, Secunderabad-500 010.
2. Kavya. C.S.
W/o. Gopala Krishna. B, P.No.6, GMR Gardens, Near Suran Nagar, Turkapally, Boluram, Secunderabad-500-010.
3.Kondala Rao. B, S/o. Achaiah. B, P.No.6, GMR Gardens, Near Suran Nagar, Turkapally, Boluram, Secunderabad-500-010. ....Opponents

Take Notice that the above Arbitration case filed by Disputant Company for the recovery of Rs. 31,08,000/- together with further interest and case is posted on 03/10/2024.

Therefore you are requested to appear before the learned Arbitrator for Chit Fund Cases, Central Chennai, Chennai-35 on **03/10/2024** at 11 A.M in person, failing which the above case will be heard and decided Experte.

P.KARTHIKA
(Advocate)

ప్రకటన

మహారాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి న్యాయస్థానం సిరిసిల్ల గారి సన్నిధిలో.
A.S. No. 15 of 2024.

చొప్పదండి నర్సింహచారి ...వాది
మరియు
తాళ్ళపెల్లి రంగవ్వ మరియు ఇతరులు ...ప్రతివాదులు

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు శ్రీ చొప్పదండి నర్సింహచారి తండ్రి వెంకటస్వామి, వయస్సు 61 సం॥లు, నివాసం: ఇంటి నెం. 1-1-91, విశ్వబ్రాహ్మన వీధి, సిరిసిల్ల, జిల్లా రాజన్న సిరిసిల్ల గారు, గౌరవ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి న్యాయస్థానం, సిరిసిల్ల, జిల్లా రాజన్న సిరిసిల్ల గారి కోర్టులో ప్రతివాదులు నెం. 1 నుండి 7 వరకు గల వారిపై పైన పేర్కొన్న అప్పీలు దావా దాఖలు చేయడం జరిగినది. అట్టి దావాలో ప్రతివాది నెం.6 గా చూపబడిన మీరు అనగా **బుర్ర కౌసల్య భర్త బాలరాజు గౌడ్, నివాసం: సైదాబాద్, 3 గుండ్ల దగ్గర, హైదరాబాద్** అను మీకు కోర్టు నుండి నోటీసులు పంపించినప్పటికిని అట్టి నోటీసులు వివిధ కారణాలచేత వాపసు రావడం లేదు మరియు మీపైన తామీలు కావడం లేదు. అందువల్ల నా క్లయింట్ అయిన పిటిషనర్ గారు కోర్టు వారి నుండి పొందిన ఉత్తర్వుల క్రమం ఈ నోటీసును జారీ చేయడం జరిగింది. అట్టి ఎ.యస్. నెం. 15/2024, **తేది 14-10-2024 రోజున ఉదయం 10-30 ని॥లకు** పై న్యాయస్థానంలో నీ హాజరు కొరకు కలదు. కావున **తేది 14-10-2024** రోజున నీవు గాని, నీవు నీ అడ్వకేట్ ద్వారా గాని పై న్యాయస్థానంలో హాజరై తగు జవాబు ఇచ్చుటకు గాను ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయనైనది. ఒకవేళ కోర్టులో పై తేది రోజు మరియు సమయమునకు హాజరు కానిచో నీ పరోక్షంలో చట్టప్రకారంగా ఏకపక్ష నిర్ణయం తీసుకోనబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడం జరిగినది.

స్థలము: సిరిసిల్ల
తేది: 24-09-2024

// కోర్టు వారి ఉత్తర్వు క్రమం//
సం/-
(గోవిందు భాస్కర్),
అడ్వకేటు-సిరిసిల్ల
జిల్లా రాజన్న సిరిసిల్ల,
సెల్ నెం. 9440461968, 8519863030.

అస్సాం సీఎంను కలిసిన కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

జీహెచ్ఎంసీ స్టడీ టూర్‌లో భాగంగా అస్సాం రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను సీఎం క్యాంప్ కార్యాలయంలో హైదరాబాద్ గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.అధికారిక పర్యటనలోని పలు అంశాలపై వివరాలను అస్సాం ముఖ్య మంత్రితో చర్చించినట్టు తెలిపారు. వారితో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ ఉన్నారు.

పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా గణేష్ ఎన్నిక

- ప్రగతిశీలా ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్‌లో జరిగిన పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా జనరల్ కౌన్సిల్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సాంబ, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కందుకూరి గణేష్‌లను ప్రకటించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలపై, విద్యార్థి సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. స్కాలర్ షిప్స్ తక్షణమే విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయంగా డబ్బులు లేదా స్థలాలు ఇవ్వాలి



- తర్వాతనే ఖాళీ చేస్తారు
- సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్

నవతెలంగాణ-అంబర్‌పేట

మూసీ పరిహారక ప్రాంతాల ప్రజలకు, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీలకు, ప్రత్యామ్నాయంగా డబ్బులు లేదా స్థలాలు ఇచ్చిన తర్వాతనే బాధితులు ఖాళీ చేస్తారని అప్పటి వరకు వారికి సీపీఐ(ఎం) అన్ని విధాలుగా అండగా ఉంటుందని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్ అన్నారు. న్యూ దుర్గా నగర్ లో మూసీ నది వెంట ఉన్న స్మాల్ స్కేల్ ఇండస్ట్రీలకు అధికారుల మార్కింగ్ (రెడ్ కలర్‌తో ఎం అని)లు చేయడంతో ఇండస్ట్రీ యజమానులు, అందులో పనిచేసే సిబ్బంది గురువారం అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తా వద్ద ఆందోళన చేపట్టారు. వారికి సీపీఐ(ఎం) నాయకులు మహేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగా రావు మద్దతు తెలిపారు. అనంతరం యజమానులు మాట్లాడుతూ ఇవి పట్టా భూములు అని, తాము కొనుక్కుని షెడ్లు, ఇండస్ట్రీ కట్టుకున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయంగా తమకు డబ్బులు లేదా స్థలాలు ఇచ్చిన తర్వాతనే ఖాళీ చేస్తాం అని స్పష్టం చేశా రు. లేకపోతే ప్రాణాలైనా అర్పిస్తామని బాధితులు అన్నారు. ఇక్కడ చిన్నాచితక ఇండస్ట్రీలు 200 వరకు ఉన్నాయని, ఐదువేల మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. వారందరికీ ప్రత్యామ్నాయం చూపిన తర్వాత నే తమ నిర్మాణాల వద్దకు రావాలని డిమాండ్ చేశారు. హైకోర్టులోస్టే ఉన్నా తమ ఇండస్ట్రీ గోడలకు, గేట్లకు మార్కింగ్ పెడుతున్నారని.. కోర్టును కూడా ధిక్కరించడం బాధాకరమని అన్నారు.

ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం కేటాయించాలి



- తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మెన్ జిలుకర రవికుమార్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర సాధన కోసం పోరాడిన క్రిస్టియన్ ఉద్యమకారులకు ప్రతి ఒక్కరికీ 250 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు కట్టుకోవడానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మెన్, పాస్టర్ జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు .జేఏసీ ఆధ్వర్యంలో గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జేఏసీ రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఉద్యమాల్లో పాల్గొని, సర్వం కోల్పోయి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రిస్టియన్ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ విజయ భేరీ మహా సభలో నాటి పీసీసీ అధ్యక్షులు, నేటి సీఎం ఎ.రేవంత్ రెడ్డి క్రిస్టియన్ జేఏసీకి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.తెలంగాణ జేఏసీ ఇచ్చిన ప్రతి ఉద్యమంలో క్రైస్తవులు పాల్గొని, అరెస్టులు, లాఠీచార్జీలకు గురయ్యారని, ఉద్యమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఆర్థికంగా ఎంతో వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రైస్తవ ఉద్యమకారులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదని ఆరోపించారు.ఇప్పటికైనా సీఎం ఎ.రేవంత్ రెడ్డి తమకు ఇచ్చిన హామీల ప్రకారం క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సాధన ఉద్యమకారునికి ప్రతి నెలా రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రతి ఒక్కరికీ 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్, మధ్యప్రదేశ్ రాష్ట్ర మాజీ డీజీపీ కూచిపూడి బాబురావు, జేఏసీ రాష్ట్ర కో-చైర్మెన్ మేకల సారయ్య డా.బిషప్ ముల్కల భాస్కర్, డీఆర్ డీఓ రిటైర్డ్ ఎంప్లాయ్ వి.సోమయ్య, బిషప్ వీరాజీ పంట ఇజ్రాయెల్, సిస్టర్ లూదియ, సిస్టర్ పద్మ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా బీసీలంతా కలిసి రావాలి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బీసీలలో ఐక్యత రావడం కోసం రాజకీయాలకతీతంగా అన్ని బీసీ కుల సంఘాలతో జేఏసీని ఏర్పాటు చేసుకుని బీసీ నాయకులందరూ కలిసి రావాలని అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం తీర్మానించింది. గురువారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు రాజకీయ నాయకులు పాల్గొని మాట్లాడారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీల రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కులగణన ప్రక్రియ ఏ రాష్ట్రానికి, ఆ రాష్ట్రమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (నవీన్) మాట్లాడుతూ రాష్ట్రంలో చివరి సీఎం రేవంత్ రెడ్డియేనని, 2028లో బీసీలే సీఎం అయ్యేందుకు బీసీలంతా కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ బీసీల హక్కుల సాధనకు ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు రాజీనామా చేయడం చారిత్రాత్మకమన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం అధ్య క్షులు బొల్ల శివశంకర్ మాట్లాడుతూ బడుగుల అభివృద్ధికి నాడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ మొదలుకుని, నేడు పద్మశాలి సమాజం కృషి చేస్తుందని చెప్పారు. బీసీలంతా ఐక్యం కావాలని, లేకపోతే బాపూజీ ఆత్మ క్షోభిస్తుంద˜న్నారు. బీసీల ఆశయాల సాధనకు పద్మశాలి చేనేతలు ముందడుగు వేయాలని కోరారు. బీసీలంతా ఐక్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో పైచేయి సాధించాలని పిలుపునిచ్చారు. బీసీ నాయకులు కందగట్ల స్వామి, కమర్తపు మురళీ, బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ బి.ఎస్. రాములు, ఆప్కో మాజీ చైర్మెన్ గడ్డం జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు అనుబంధంగా గోశాలలు ఏర్పాటు చేయాలి



- మహేష్ అగర్వాల్

నవతెలంగాణ-అంబర్‌పేట

దేశ వ్యాప్తంగా ఉన్న దేవాలయాలకు అనుబంధంగా గోశాలలు ఏర్పాటు చేయాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. షిర్డీ సాయిబాబా సేవా సమాజ్ నిర్వహిస్తున్న గోశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో గురువారం గోవులకు పశుగ్రాసం అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో జరుగుతున్న పూజల్లో దేవుళ్లకు పెడుతున్న నైవేద్యాలు, భక్తులు అందజేస్తున్న లడ్డూలు, ఇతర ప్రసాదాలు పూర్తిగా కల్తీమయంగా మారుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తుండటంతో భక్తులు ప్రసాదాలు తీసుకోవాలంటేనే జంకుతున్నారని అన్నారు. స్వచ్ఛమైన ఆవు పాలు, పెరుగు, నెయ్యి, వెన్నతో పాటు పాల పదార్థాలతో చేసే నైవేద్యాలను దేవుళ్లకు పెట్టాలంటే దేవాలయాల్లో గోశాలలు నిర్వహిస్తే సాధ్యమవుతుందని సూచించారు. భక్తులకు కూడా ఆలయాల నిర్వహణ పట్ల నమ్మకం కలిగి అవసరమైన నిధులను అందజేసేందుకు ముందుకు వస్తారని తెలిపారు. ప్రతి దేవాలయంలో నైవేద్యానికి ఉపయోగించే వస్తువులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమం లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ప్రతినిధు లు ప్రేమ్చంద్ మునోద్, మంజుల మునోద్, విక్రమ్ చాండక్, గోశాల ప్రతినిధులు రాంకోటేశ్వర్ రావు, చౌకీరాజు, కోటిరాజు, ఆశీన్ సోని, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు వస్తున్నారు..

- అయిదు ప్రాజెక్టుల్లో ఖాళీల పోస్టుల వివరాల సేకరణ
- హైదరాబాద్ జిల్లాలో 145 మంది టీచర్లు, 298 ఆయాల భర్తీ
- పోస్టుల భర్తీతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు
- కేంద్రాల నిర్వహణ మెరుగుపడి.. పిల్లలు, బాలింతలు, గర్భిణీలకు మేలు
- త్వరలో వెలువడనున్న నోటిఫికేషన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. ఏటా ఖాళీలు ఏర్పడుతున్నా.. కొత్తగా నియామకాలు జరగకపోవడంతో పోస్టుల కొరత ఏర్పడి కేంద్రాల నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. దీంతో కొంత మంది విద్య, పౌష్టికాహారానికి దూరమవుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఈ నేపథ్యంలో మహిళ శిశు సంక్షేమ అధికారులు జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నారు. అయిదు ప్రాజెక్టుల వారిగా ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో వివరాలు సేకరించారు. నివేదికను సిద్ధం చేసి ఉంచారు. నియామకాలకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

హైదరాబాద్ జిల్లా పరిధిలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) కింద అయిదు ప్రాజెక్టులున్నాయి. చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్‌లోని ఆయా ప్రాజెక్టుల పరిధిలో 970 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో 835 మంది టీచర్లు, 672 మంది ఆయాలు పనిచేస్తున్నారు. దీంతో 145మంది టీచర్ల పోస్టుతో పాటు 298 మంది ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు గుర్తించిన అధికారులు వాటిని భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది జిల్లా కలెక్టర్ ఆమోదంతో అయిదు ప్రాజెక్టుల పరిధిలో ఖాళీలు ఏర్పడ చోట టీచర్లు, ఆయాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ.. ఎన్నికల కోడ్ రావడంతో వాయిదా పడింది. కొత్త ప్రభుత్వం రాకతో అంగన్‌వాడీల బలోపేతంపై దృష్టిసారించడంతో కొత్త పోస్టుల మంజూరుతో పాటు రిక్రూట్‌మెంట్‌కు చర్యలు తీసుకుంటుంది. దీంతో జిల్లాలో మరోసారి అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి అవకాశం లభించింది. ఈ ప్రక్రియ దాదాపు పూర్తికావొచ్చింది. రోస్టర్ పాయింట్స్ కేటాయింపు దశలో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే అంగన్‌వాడీ టీచర్, ఆయాల పోస్టులకు ఇంటర్ విద్యార్హతగా నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరించడానికి అధికారుల సన్నాహాలు చేస్తున్నారు.

443 పోస్టుల భర్తీకి చర్యలు..

జిల్లాలోని ఖైరతాబాద్, చార్మినార్, గోల్కొండ, నాంపల్లి, సికింద్రాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 970 ప్రధాన అంగన్వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో చార్మినార్ 274 అంగన్వాడీ కేంద్రాలుండగా.. 238 మంది టీచర్లు, 190 ఆయాలు పనిచేస్తున్నారు. గోల్కొండలో 163 సెంటర్లకు 141 మంది టీచర్లు, 114 మంది ఆయాలు, ఖైరతాబాద్ 151 కేంద్రాల్లో 130 మంది టీచర్లు, 99 మంది ఆయాలు, నాంపల్లి 201 మందికిగాను 168 మంది టీచర్లు, 139 ఆయాలు, సికింద్రాబాద్‌లో 181కిగాను 148 మంది టీచర్లు, 130 ఆయాలు పనిచేస్తున్నారు. మొత్తం 970 మంది టీచర్లకు గాను ప్రస్తుతం 835 మంది, ఆయాలు 672 మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో మొత్తం 443 ఖాళీలు ఉన్నట్టు గుర్తించిన అధికారులు వాటి భర్తీకి చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయా ప్రాజెక్టుల వారీగా రోస్టర్ పాయింట్స్‌ను కేటాయింపు ప్రక్రియ జరుగుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఖాళీ పోస్టుల వివరాలు ఉన్నతాధికారులకు నివేదించామని, ఒకటి రెండు నెలల్లో నోటిఫికేషన్ వచ్చే అవకాశముందని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి ఒకరు తెలిపారు. కాగా పోస్టుల భర్తీతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలతో పాటు కేంద్రాల నిర్వహణ మెరుగుపడి పిల్లల, గర్భిణులు, బాలింతలకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో 0-6 నెలలు నిండిన పిల్లలు 5,849 ఉండగా.. 7 నెలల నుంచి మూడేండ్ల చిన్నారులు 64,713 మంది, 3-6 ఏండ్లలోపు పిల్లలు 52,308 మంది, గర్భిణీలు 10,076 మంది, బాలింతలు 5,826 మంది ఉన్నారు.



బధిరుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి



- డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్

నవతెలంగాణ-ముషీరాబాద్

బధిరుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్ ఉపాధ్యక్షులు కాటమోని వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సమాజంలో వినికిడి లోపం కలిగినవారు తీవ్రంగా వివక్షకు గురవుతున్నారన్నారు. మానసికంగా కంగిపోతున్నారని దేశవ్యాప్తంగా ప్రభుత్వ హాస్పిటల్లో 4000 మంది మాత్రమే ప్రభుత్వ కాంట్రాక్ట్ ఆడియోలాజిస్టులు, స్పీచ్ తెరపిస్ట్ డాక్టర్స్ ఉన్నారన్నారు. దేశంలో వివిధ భాషలు 22 ఉన్నాయని, బధిరుల భాషని 23గా చేర్చాలని, వారి విద్య వైద్యానికి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. స్కూళ్లలో ప్రత్యేక టీచర్లను నియమించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, సత్యనారాయణ, వాసుదేవా సుకయ్య, ఖారిం, మునీష పాల్గొన్నారు.

బాధితురాలికి అన్ని రకాల సహకారాలు అందించాలి

- ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి అనసూయ

నవతెలంగాణ-ముషీరాబాద్

ఆసిఫాబాద్ కొమరం భీమ్ జిల్లా జైనూర్‌లో గతనెల 31 న గిరిజన మహిళ పై జరిగిన లైంగికదాడి, హత్యా ప్రయత్నం సంఘటనలో బాధితురాలికి అన్ని రకాల సహా య సహకారాలు అందించాలని, నిందితుడిని చట్టప్రకా రం విచారించి శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.అనసూయ గురువారం పత్రిక ప్రకటన ద్వారా ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. నిందితుడిని, బాధితురాలి సమస్యను పక్కన పెట్టి, ఈ సంఘటనను మత సంఘర్షణగా ,రెండు కమ్యూనిటీల మధ్య ఘర్షణగా చిత్రీకరించటం సరికాదన్నారు. రాజకీయ పార్టీలు సమస్యను రాజకీయ పరం చేస్తూ కమ్యూనిటీల వైపు నిలబడి శాంతిభద్రతల సమస్యకు కారణం కావడం ఆస్తులు నష్టపరుచుకోవడం, భౌతిక దాడులకు దిగబడటం సరికాదని అన్నారు. ప్రజలు సామరస్యంతో, సంయమనాన్ని పాటిస్తూ బాధితురాలికి న్యాయం జరిగేలా, నిందితుడికి తగిన శిక్ష విధించేలా వ్యవహరించాలని కోరారు. మత ఘర్షణలకు దిగడం వలన తప్పుడు సంకేతాలు వెలువడుతాయన్నారు.

చిట్టీల పేరుతో రూ 4.70 కోట్లు మోసం... రాత్రికి రాత్రే పరార్..

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

చిట్టీల పేరుతో రూ 4.70 కోట్లు వసూలు చేసి రాత్రికి రాత్రే దంపతులు పరారైన ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... చింతల్ వెంకటేశ్వర నగర్‌లో నివాసముండే నాగమణి , నాగమన్నయ్యలు చిట్టీల పేరుతో 12 ఏండ్లుగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దంపతులు చుట్టుపక్కల ఉన్న ప్రజలతో చిట్టీల వ్యాపారం కొనసాగిస్తున్నారు. అయితే రూ .1లక్ష నుండి రూ.10 లక్షల వరకు చిట్టీలు కట్టించుకొని తిరిగి చెల్లించకుండా సుమారు రూ.4.70 కోట్లతో ఉడాయించారు. విషయం తెలుసుకున్న బాధితులు జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించి తమకు తగిన న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఐలమ్మ సేవలు చిరస్మరణీయం..



- జోనల్ కమిషనర్ టి.వెంకన్న

నవతెలంగాణ-ధూల్ పేట్

పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని ఆత్మ గౌరవాన్ని కాపాడిన చిట్యాల ఐలమ్మ సేవలు చిరస్మరణీయమని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న కొనియాడారు. గురువారం చాంద్రాయణగుట్ట నర్సిపూల్ బాగ్‌లోని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి జోనల్ అధికారులతో కలిసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ తొలి భూ పోరాటానికి నాంది పలికి పెతందార్లపై వీరోచితంగా పోరాటం చేసి ధైర్యశాలిగా నిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఏఎంసి రాజారావు, జోనల్ కమిషనర్ సీసీ గుంటు గిరిబాబు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముషీరాబాద్: ప్రజలను ఐక్యం చేసి నైజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాటం చేసిన అగ్నికనం చిట్యాల ఐలమ్మ అని వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఎం.వి.రమణ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ముందు తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్ అధ్యక్షతన ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఎం వి రమణ హాజరై మాట్లాడుతూ ఐలమ్మ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం చేసిన పోరాటమని ప్రపంచ చరిత్ర పుటాల్లోకి ఎక్కిన, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తన భూమిలో పండిన పంటను విస్నూర్ దేశముకు గుండాలు దౌర్జన్యంగా దొంగిలిస్తుంటే, కమ్యూనిస్టుల నాయకత్వంలో ఎర్రజెండా చేత పట్టి నైజాం రజాకారులను కారులను గుత్పల్ అందుకొని రాళ్లతో తరిమి కొట్టిన చరిత్ర ఆమెదే అని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు పోరాటం చేస్తుంటే ఆ పోరాటంలో తాను సైతం అంటూ అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసి నైజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాటం చేసిన అగ్నికణం చిట్యాల ఐలమ్మ అని, ఆమె ధైర్యం తెగింపు, పోరాటం నేటి తరానికి ఆదర్శంగా ఉంటుందని, ప్రభుత్వం వెంటనే ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంకు బండ్ పై నెలకొల్పాలని, రజకులకు రక్షణ చట్టం తేవాలని కోరారు సెంట్రల్ జిల్లా కార్యదర్శి మరియాల గోపాల్, సోషల్ మీడియా రాష్ట్ర కోకన్వీనర్ రాపర్తి ప్రభాకర్, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కరరావు నాయకులు మంగయ్య, రామస్వామి మహిళా సంఘం నాయకులు , లక్ష్మమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాతబస్తీలో అధికారులు రెడ్ మార్క్..



నవతెలంగాణ - ధూల్‌పేట్

మూసీ సుందరీకరణ ప్రక్షాళనలో భాగంగా గురువారం పాతబస్తీలోని మూసి పరివాహక ప్రాంతాల్లోని నివాసాలను అధికారులు రెడ్ మార్క్ వేశారు. బహదూర్ పురా కిషన్ బాగ్, పురాణ పూల్, పెట్లా బూర్జ్ పాత పోలీస్ హెడ్ క్వార్టర్స్, చాదర్‌ఘాట్, ఎంజీబీఎస్ మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న అక్రమ నివాసాలను అధికారులు గుర్తించి మార్క్ వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బహదూర్‌పురా మండల తహసీల్దార్ కె. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కిషన్ బాగ్, ఆసద్బాబానగర్ నుంచి బహదూర్ పురా వరకు నాలాలో ఉన్న నివాసాలకు రెడ్‌మార్క్ వేశారు. సుమారు 253 నివాసాలను గుర్తించి అందులో నివసిస్తున్న వారిని నోటీసులు ఇచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. ఇండ్లు కోల్పోతున్న వారికి డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించాలని అధికారులు నిర్ణయించినట్టు చెప్పారు. ప్రస్తుతం నాలాలోపలికి ఉన్న నివాసాలను మాత్రమే గుర్తించామని, బఫర్ జోన్‌లో ఉన్న నివాసాల జోలికి వెళ్ళడంలేదన్నారు. ఈ సందర్భంగా బహదూర్‌పురా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అడ్డుకున్న స్థానికులు

పెట్లా బూర్జ్‌లో అధికారులు రెడ్ మార్క్ వేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. రెడ్ మార్క్ వేయొద్దని, తమ ముత్తాతల నుండి ఇక్కడే నివాసం ఉంటున్నామని తెలిపారు. స్థానికంగా మసీద్, చర్చిలు, ఆలయాలు తొలగించడం సరికాదని పలువురు వాపోయారు. పెట్లా బూర్జ్ చర్చి సభ్యులు చర్చికి అవకాశం కల్పించాలని కోరారు. దీంతో స్థానిక చార్మినార్ ఎమ్మెల్యే ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అధికారులకు మార్క్ వేయనియ్యాలని, స్థానికులను ప్రత్యామ్నాయం కల్పిస్తున్నారని తెలిపారు. హుస్సేని అలం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చాదార్ ఘాట్ లో నివాసాలను గుర్తించి రెడ్ మార్క్ వేయడం తో స్థానికులు అడ్డుకున్నారు. దీంతో చాదార్ ఘాట్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నిర్వాసితులకు డబల్ బెడ్ రూంలను కల్పిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఇట్ల చేద్దాం

పుదీనా ఆకులను మరిగించిన నీటిని తాగితే జలుబు, దగ్గుతో ఉపశమనం కలుగుతుంది.



మేము సిద్ధంగా ఉన్నాం

నిజమైన ఛాంపియన్‌లు మైదానంలో మాత్రమే తయారు చేయబడరు. వారి చుట్టూ ఉన్న నిరంతర ప్రోత్సాహం, శిక్షణ, మద్దతు ద్వారా వారు రూపొందించబడతారు. పునాది బలంగా ఉండి, సరైన మార్గదర్శకత్వం లభిస్తే అత్యంత సవాలుగా ఉన్న కలలను కూడా సాధించవచ్చని ఈ ఐదుగురు అమ్మాయిలు రుజువు చేస్తున్నారు. పోడియంకు వెళ్లే మార్గం కోసం లెక్కలేనన్ని గంటలపాటు కఠినమైన శిక్షణ పొందారు. అన్ని స్పోర్ట్స్ ఈవెంట్‌లలో దేశానికి ప్రాతినిధ్యం వహించే సామర్థ్యాన్ని పొందారు. 'ఇప్పుడు మేము పోటీకి సిద్ధంగా ఉన్నాం' అంటూ ఆత్మవిశ్వాసంతో చెబుతున్న ఔత్సాహిక అథ్లెట్ల పరిచయాలు నేటి మానవిలో...

ఆరేండ్లు కష్టపడింది.....



కుసుమ రావాడ... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ అథ్లెటిక్స్ తన ప్రయాణంలో అనేక సవాళ్లు ఎదుర్కొంది. 23 ఏండ్ల ఈమె లాంగ్ జంప్‌లో పతకం కోసం ఆరేండ్ల పాటు కష్టపడింది. గాయాలతో పోరాడింది. జాతీయ పోటీల్లో అవకాశాలు రాక విపరీతమైన ఒత్తిడికి గురయింది. ఒకానొక సమయంలో అథ్లెటిక్స్‌ను వదులుకోవాలని కూడా భావించింది. 2017లోనే కుసుమ ABSFలో చేరి నిజమైన క్రీడాకారిణిలా శిక్షణ పొందడం ప్రారంభించింది. చివరకు 2023లో ఆమె కృషి ఫలించింది. U23 జాతీయ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో రజతం సాధించింది. 2024లో ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్‌లో స్వర్ణం సాధించింది. ఆమె అథ్లెటిక్ కెరీర్‌లో ఒక ముఖ్యమైన మలుపు తిరిగింది. ఎన్ని సవాళ్లు ఎదురైనా తన కలలను ఎప్పటికీ వదులుకోకూడదని బలంగా నిర్ణయించుకున్న కుసుమ నేడు ఒలింపిక్స్‌తో పాటు మరిన్ని విజయాలు సాధించడంపై దృష్టి సారించింది. ■

లాంగ్ జంప్ స్టార్

సుస్మిత... రాజస్థాన్‌లోని రాజ్‌గఢ్ అనే చిన్న నగరం నుంచి వచ్చిన ఈమెకు క్రీడా ప్రపంచంలోకి అడుగుపెట్టడం అంత సులభం కాలేదు. ఆమె ఎదుర్కొన్న అనేక సవాళ్లు, గాయాలు, ఎదురుదెబ్బలు ఆమెను మరింత దృఢంగా తీర్చిదిద్దాయి. 2020లో ABSFలో చేరడం, లెజెండరీ కోచ్ రాబర్ట్ బాబీ జార్జ్ వద్ద శిక్షణ పొందడం సుస్మిత జీవితంలో ఒక కీలకమైన మలుపు. 2023లో జరిగిన ఆసియా U20 అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో రజత పతకాన్ని, 2023లో జరిగిన U20 నేషనల్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. ఆమె తన ప్రతిభకు స్కాలర్‌షిప్ కూడా అందుకుంది. సుస్మిత కుటుంబ సభ్యులు, ముఖ్యంగా తండ్రి ఆమెను నిత్యం ప్రోత్సహిస్తున్నారు. గొప్ప కోచింగ్, అత్యుత్తమ శిక్షణా పరికరాలు, తగిన ఆహారంతో ఆమె ముందుకు సాగుతుంది. తదుపరి ఒలింపిక్స్‌కు అర్హత సాధించ గలదని ఆమె ఇప్పుడు నమ్మకంగా ఉంది. ■



ట్రిపుల్ జంప్ ఛాంపియన్

పూర్వా సావంత్... 2021లో ట్రిపుల్ జంప్‌లో తన అభిరుచిని కనుగొనే ముందు ఆమె వివిధ ఈవెంట్‌లను అన్వేషించడం మొదలుపెట్టింది. అథ్లెటిక్స్‌లో ఈమె ప్రయాణం ఏడేండ్ల వయసులోనే ప్రారంభమైంది. ఆమె 2023 ఆసియా ఇండోర్ ఛాంపియన్‌షిప్‌తో సహా అంతర్జాతీయ వేదికపై రెండుసార్లు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. మార్చి 2022లో ABSFలో చేరినప్పటి నుండి ఆమె తన క్రీడపై కోచ్ రాబర్ట్ బాబీ జార్జ్ నుండి స్థిరమైన మార్గదర్శకత్వం పొందింది. ఆమె భారతదేశానికి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించింది. ఒకసారి కజికిస్తాన్ 2023లో జరిగిన 10వ ఆసియా ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో, మరొకసారి చెంగ్డూలో జరిగిన వరల్డ్ యూనివర్శిటీ గేమ్స్ 2024లో. ఆమెను ప్రేరేపించిన విషయం ఏమిటని అడిగినప్పుడు పెద్దగా నవ్వుతూ తన తల్లిదండ్రులు అని చెప్పింది. 'వారు మానసికంగా ఇచ్చే మద్దతు నాకు చాలా విలువైనది. వారు నన్ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటారు' అని ఆమె జోడించింది. ■



ఎ ప్రామిసింగ్ ఫ్యూచర్

నమయి రుచిత... అథ్లెటిక్స్‌లో ఈమె ప్రయాణం ప్రత్యేకమైనది. ఒక చిన్న పట్టణంలో పరిమిత వనరులతో ప్రారంభించింది. తాత్కాలిక అడ్డంకులతో అసమానమైన ట్రాక్‌లపై అలసిపోకుండా శిక్షణ పొందింది. అయితే ఇది అందరూ చేరుకోలేనిదిగా అనిపించే కలతో నడిచేది. ఆమె ప్రారంభ ఏడాది ఎదురుదెబ్బలు, గాయాలు, ఆర్థిక సవాళ్లు, సందేహాస్పద క్షణాలతో నిండి ఉంది. 2018లో ఆమె ABSFలో చేరినప్పుడు అంతా మారిపోయింది. అక్కడ ఆమె పోషకాహారం, పునరుద్ధరణ, శిక్షణా పరికరాలతో సహా సౌకర్యాలు, కోచింగ్, అవసరమైన మద్దతును పొందింది. ఈ కొత్త మద్దతుతో ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్‌లో బంగారు పతకాన్ని గెలుచుకోవడంతో రుచిత కష్టానికి ఫలితం దక్కింది. ఆమె కొత్త ఎత్తులను సాధించడానికి సిద్ధమవుతుంది. ప్రతిష్టాత్మకమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రేరణ పొందింది. ■



ఎ లెజెండ్ ఇన్ ది మేకింగ్

శైలి సింగ్ ఝాన్సీ... చిన్న పట్టణానికి చెందిన అమ్మాయి. అలాంటి చోట లాంగ్ జంప్ వంటి క్రీడలలో మహిళలు పాల్గొనడం అసాధారణం. అభిరుచి ఉన్నప్పటికీ ఎక్కడ నుండి ప్రారంభించాలనే దానిపై ఆమెకు సరైన మార్గదర్శకత్వం లేదు. 2018లో ABSFలో చేరి క్రీడల్లోని సూక్ష్మ నైపుణ్యాలను నేర్చుకోవడం మొదలుపెట్టిన తర్వాత ఆమె పరిస్థితి మారిపోయింది. 'జీవితం మీకు ఇచ్చే అవకాశాన్ని పొందండి' అనే తన గురువు మాటలను ఆమె ఎంతో శ్రద్ధగా పాటించింది. ఎంతో ఉత్సాహంతో శిక్షణ పొందుతోంది. శైలి ప్రస్తుతం U-16 కేటగిరీ (6.15 మీ), U-18 కేటగిరీ (6.48 మీ), U-20 కేటగిరీ (6.76 మీ)లలో జాతీయ రికార్డులను కలిగి ఉంది. ఏప్రిల్ 2023లో జరిగిన ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో 6.76 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ జంప్‌తో స్వర్ణంతో సహా పలు పోటీల్లో పతకాలు గెలుచుకున్నప్పటికీ ఒలింపిక్స్ 2024కి అర్హత సాధించలేకపోయింది. ఇదే ఆమెను ప్రేరేపించింది. ఈసారి మరింత కష్టపడి దేశం కోసం ప్రశంసలు పొందాలని నిర్ణయించుకుంది. అథ్లెట్లకు ప్రజల నుండి మంచి ప్రోత్సాహం లభిస్తుందని ఆమె నమ్ముతుంది. ఇది వారిని మెరుగ్గా రాణించేలా ప్రోత్సహించడమే కాకుండా వారి కెరీర్, అభిరుచిని క్రీడల్లో కొనసాగించేందుకు విశ్వాసాన్ని ఇస్తున్నాయి. ■



కొలెస్ట్రాల్ తగ్గేందుకు...



కరివేపాకు.. దీనితో ఆరోగ్య ప్రయోజనాలతో పాటు కొన్ని బ్యూటీ బెనిఫిట్స్ కూడా ఎన్నో లాభాలున్నాయి. వీటిని తినడం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ పెరిగి ఐరన్ లోపం తగ్గుతుంది. ఇందులో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. పచ్చి కరివేపాకును రోజూ కొద్దిగా తినటంవల్ల కలిగే లాభాలేమిటో చూద్దాం...

ఎముకల బలానికి..

కరివేపాకులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది దంతాలు, ఎముకల ఆరోగ్యానికి మంచిది. కీళ్ళనొప్పులు, షుగర్ ఉన్నవారిలో ఎముకల నొప్పిని తగ్గించి వాటిని బలంగా మారుస్తుంది.

కొలెస్ట్రాల్‌ని తగ్గించడం..

కరివేపాకు తింటే LDL అనే చెడు కొలెస్ట్రరాల్ తగ్గుతుంది. దీంతో రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోదు. చెడు కొలెస్ట్రాల్ తగ్గితే బీపి కూడా కంట్రోల్ అవుతుంది. దీంతో గుండె సంబంధ సమస్యలు తగ్గి హార్ట్ హెల్త్ బాగుంటుంది.

ఇమ్యూనిటీ పెరుగుదలకు

రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఓ గ్రాము పచ్చి కరివేపాకు తింటే ఇమ్యూనిటీ పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కరివేపాకులో ప్రోటీన్స్, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. దీని వల్ల ఇమ్యూనిటీ బలంగా మారతుంది. ఇన్ఫెక్షన్లు దూరమవుతాయి. ■



ప్రాణాలు తీసిన పవిత్ర స్నానం

బీహార్‌లో 47 మంది భక్తులు మృతి

పాట్నా : బీహార్‌లో పవిత్ర స్నానం ప్రజల ప్రాణాలను తీసింది. 'జీవిత్‌పుత్రిక' పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మూడ్రోజుల వేడుకల్లో భాగంగా పలు నదులు, చెరువుల్లో పవిత్ర స్నానాలు ఆచరించే క్రమంలో సుమారు 50 మందికి పైగా నీటిలో మునిగిపోయారు. 47 మంది చనిపోగా, ముగ్గురు గల్లంతయ్యారు. వీరిలో 37 మంది చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటనను విడుదల చేసింది.

గతేడాది ఇదే పండుగ సందర్భంగా పవిత్ర స్నానాలు ఆచరిస్తూ మొత్తం 22 మంది చనిపోయారు. జీతియా లేదా జీవిత్‌పుత్రిక పండుగ సందర్భంగా మహిళలు వారి పిల్లల బాగు కోసం ఉపవాసం ఆచరిస్తారు. మూడ్రోజుల పాటు ఈ పండుగ వేడుకలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు నదులు, చెరువుల్లో భక్తులు పవిత్ర స్నానాలను ఆచరిస్తారు. ఈ సారి చోటు చేసుకున్న మరణాలు రాష్ట్రంలో 15 జిల్లాల నుంచి నమోదయ్యాయి. "ఇప్పటి వరకు 47 మృతదేహాలను వెలికి తీశాం. తదుపరి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి" అని బీహార్ విపత్తు నిర్వహణ విభాగం తెలిపింది. ఈ ఘటనల పట్ల బీహార్ సీఎం నితీశ్ కుమార్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

30రోజుల్లో డిజిటల్ హెల్త్‌కార్డులు

(మొదటిపేజీ తరువాయి)

పోరాడుదామని ఆయన పిలుపునిచ్చారు.

తమ ప్రభుత్వం లాభాలార్జించే ప్రభుత్వం కాదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తున్నామని తేల్చిచెప్పారు. స్వాతంత్ర్య భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తీసుకున్న విప్లవాత్మక చర్యల ఫలితంగా సమాజంలో ఆకలి, కరువు చావులు లేవనీ, ప్రజల ఆయుష్షు పెరిగిందని తెలిపారు. ప్రస్తుత సమాజానికి అత్యంత అవసరమైన విద్య, వైద్యమే తమ ప్రాధాన్యతలని తేల్చి చెప్పారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ట్రస్టీ చైర్మెన్ ఎస్.వి.రావు వినతి మేరకు, ఇబ్రహీంపట్నంలో స్పోర్ట్స్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉస్మానియా యూనివర్సిటీలో స్థలం అప్పగింతకు సంబంధించిన విజ్ఞప్తిని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ క్యాన్సర్ సేవలు ఒక సంక్లిష్టమైన విషయమని తెలిపారు. క్యాన్సర్ బాధితులు ఆస్పత్రులకు ఆలస్యంగా వస్తుండటం సమస్యగా ఉందని తెలిపారు. దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాలన్నారు. క్యాన్సర్ రోగులకు సేవలందించేందుకు స్పష్టమైన అవగాహనతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సెంటర్ ఏర్పాటుకు సహకరించిన దాతలను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎండీ శ్రీధర్ పెద్దిరెడ్డి, దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ట్రస్టీ చైర్మెన్ ఎస్.వీ.రావు, మాజీ అధ్యక్షురాలు లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బిల్కిస్ బానో కేసులో గుజరాత్ సర్కార్‌కు షాక్

దోషులతో బీజేపీ ప్రభుత్వం కుమ్మక్కైనట్టుందని సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ : గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. బిల్కిస్ బానో కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను తీర్పు నుంచి తొలగించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో దోషులుగా తేలిన 11 మందికి శిక్షాకాలం ముగియకముందే దానిని మాఫీచేసి (రెమిషన్ ఇచ్చి) వారిని గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడాన్ని తప్పుబడుతూ సుప్రీంకోర్టు గతేడాది కీలక వ్యాఖ్యలు చేసింది. దోషులతో ప్రభుత్వం కుమ్మక్కైనట్టుందని వ్యాఖ్యానించింది. తీర్పులో ఈ వ్యాఖ్యలను తొలగించాలంటూ గుజరాత్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ప్రభుత్వ తీరును మరోసారి ఎండగడుతూ పిటిషన్‌ను కొట్టివేసింది.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో సామూహిక లైంగికదాడి, ఆమె కుటుంబంలో ఏడుగురు సభ్యుల దారుణ హత్య కేసులో 11 మంది దోషుల విడుదల చెల్లదంటూ జనవరిలో సుప్రీం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. గుజరాత్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, రెండు వారాల్లోగా దోషులను మళ్లీ జైల్లో పెట్టాలని ఆదేశించింది. " లేని అధికారాన్ని గుజరాత్ ప్రభుత్వం వాడుకుంది. అది చట్ట ఉల్లంఘనే. ఆ ప్రాతిపదికన చూసినా రెమిషన్ ఉత్తర్వుల్ని కొట్టివేయాల్సిందే. సుప్రీంకోర్టు తీర్పును ఉపయోగించుకుని, చట్టాన్ని ధిక్కరించి, దోషులకు శిక్ష తగ్గించారని చెప్పడానికి ఇదో తిరుగులేని ఉదాహరణ. విచక్షణాధికారాన్ని గుజరాత్ దుర్వినియోగం చేసింది" అని అప్పట్లో సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.

2002 నాటి ఘటన..

2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో మతపరమైన అల్లర్లు జరిగినప్పుడు భయాందోళనతో పారిపోతున్న బిల్కిస్ బానో (అప్పటి వయసు 21 ఏండ్లు) లైంగికదాడికి గురయ్యారు. ఆ సమయంలో ఆమె ఐదు నెలల గర్భిణీ. ఆమెపై దారుణానికి ఒడిగట్టడంతో పాటు ఆమె మూడేండ్ల కుమార్తె సహా కుటుంబ సభ్యుల్లో ఏడుగురిని హతమార్చడం పెను సంచలనమైంది. 11 మంది నిందితులకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 2008 జనవరి 21న యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. తర్వాత బాంబే హైకోర్టు కూడా దీన్ని సమర్థించింది. (సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని, సాక్షులకు ముప్పు ఉంటుందని బానో అనుమానాలు వ్యక్తం చేయడంతో అప్పట్లో విచారణను అహ్మదాబాద్ నుంచి ముంబయికి మార్చారు.) దోషులు 15 ఏండ్లు కారాగారంలో గడిపారు. అనంతరం తనను విడుదల చేయాలంటూ వారిలో ఒకడు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో దానిని పరిశీలించాలని సర్వోన్నత న్యాయస్థానం గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కేసులో నిందితులందరికీ రెమిషన్ మంజూరు చేయాలని కమిటీ సభ్యులు సిఫారసు చేశారు. 2022 ఆగస్టు 15న దోషులంతా విడుదలయ్యారు.

నీళ్లను ఒడిసిపట్టి ప్రజలకందించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీళ్లను ఒడిసిపట్టి ప్రజలకందించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఏఈఈలకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నియామకాల ఆకాంక్షల కోసమే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందనీ, అలాంటి శాఖలో ఉద్యోగులుగా నియమితులవుతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజల భావోద్వేగం నీళ్లతో నిండి ఉందని తెలిపారు. ఏ వృత్తిలోనైనా క్షేత్ర స్థాయిలో అనుభవం ఉన్నవాళ్లే రాణిస్తారని సీఎం వ్యాఖ్యానించారు. గతంలో ఇంజనీర్లు ఉదయం 5 గంటలకే ఫీల్డ్ విజిట్‌కు వెళ్లి రిపోర్టులు రాసే వారనీ, మధ్యలో పర్యటనలు ఆగిపోతే తాము అధికారంలోకి వచ్చాక క్షేత్ర స్థాయిలో పర్యటనలకు ఆదేశించినట్టు తెలిపారు. కాళేశ్వరానికి రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తే కూలిందనీ, దీనికి రాజకీయ నాయకులు, అధికా రుల్లో ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుం టున్నారనీ, చర్యలు తీసుకుంటే డిపార్ట్‌మెంటే మిగలదన్నారు. గత పదేండ్లలో రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసిన ప్రాజెక్టులు పూర్తి కాలేదని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆపరేషన్ మూసీ

(మొదటిపేజీ తరువాయి)

మూసానగర్, శంకర్ నగర్‌లో హిమయత్ నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, గోల్కొండ మండల పరిధిలోని ఇబ్రహీంబాగ్, ఆశ్రమ్‌నగర్ ఎమ్మార్వో అహల్య, బహదూర్‌పురా, కిషన్‌బాగ్ పార్క్ సమీపంలో తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు.

అక్కడక్కడా నిరసన సెగలు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు ఇండ్లను మార్కింగ్ చేసి, నివాసితులను ఒప్పించడానికి 25 బృందాలను బుధవారం ఏర్పాటు చేశారు. గురువారం మొదటి రోజు ఆయా బృందాలు ప్రతి ఇల్లూ తిరుగుతూ నివాసితులతో మాట్లాడాయి. ఇప్పుడుంటున్న ఇండ్లకు వరదల ముప్పు ఉంటుందని, ఎప్పటికైనా ఇబ్బందులు తప్పవని వివరించారు. డబుల్ ఇండ్ల డ్రాను నివాసితులతోనే తీయిస్తామని, ఖాళీ చేసే సమయంలో సామాను తీసుకెళ్లడానికి ట్రాన్స్‌పోర్టు ఖర్చు సైతం ప్రభుత్వమే భరిస్తుందని రివర్ బెడ్ నివాసితులకు తెలియజెప్పున్నారు. అయితే, అక్కడక్కడ అధికారులకు నిరసన సెగలు తగిలాయి. చైతన్యపురిలోని సాయినగర్‌లో బఫర్‌జోన్ నివాసితులు రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. తహసీల్దార్ విద్య బృందంతో వాగ్వాదానికి దిగారు. రివర్ బెడ్‌లో నిర్మించుకున్న ఇండ్లకు నోటీసులు ఇస్తున్న సమయంలో బఫర్ జోన్‌లో ఉన్నవారు ఆందోళనకు దిగడంతో అధికారులు నచ్చజెప్పారు. ప్రస్తుతం రివర్ బెడ్ పరిధిలోనే మార్కింగ్ చేస్తున్నామని సర్దిచెప్పటంతో శాంతించారు. ఈ సర్వే రివర్ బెడ్‌కే పరిమితమని, మిగతావారు ఆందోళన చెందొద్దని సూచించారు. కాగా, హైదరాబాద్ జిల్లాలో మొత్తం 1071 ఇండ్లు, కమర్షియల్ కట్టడాలు ఉండగా.. గురువారం 780 ఇండ్లకు మార్కింగ్ చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 239 ఉండగా.. 75 ఇండ్లకు మార్కింగ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో 333 ఉండగా, 150 ఇండ్లకు మార్కింగ్ చేశారు. గండిపేటలో మరో 32 షెడ్లను స్వయంగా యజమానులే కూల్చేసుకున్నారు.

కావాల్సిన చోట 'డబుల్' ఇండ్ల కేటాయింపు!?

ప్రస్తుతం చేస్తున్న సర్వే ఆధారంగా అయితే సొంత ఇండ్లు ఉన్నవారందరికీ డబుల్ బెడ్‌రూమ్ నివాసాలు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. ఇండ్లు కోల్పోతున్న వారికి వేరొక చోట డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించే అవకాశం ఉంది. సర్వే సందర్భంగా మూడు ప్రాంతాలను సూచిస్తూ.. ఎక్కడ ఇల్లు కావాలనేది అడిగి తెలుసుకుంటున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో ఇండ్లు కోల్పోయిన వారికి సిటీలోనే కేటాయించే అవకాశముంది.

మలక్‌పేట చంచల్‌గూడలో 141 డబుల్ బెడ్రూం ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. వనస్థలిపురంలోని సాహెబ్ నగర్‌లో 95 డబుల్ ఇండ్లు, ధూల్‌పేటలోనూ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. వాటిని కేటాయించే అవకాశం ఉందని సమాచారం. బఫర్ జోన్‌లో, ఎఫ్టీఎల్‌లో ఇండ్లు ఉన్నవారికి కొల్లూరు డబుల్ బెడ్రూంలలో అవకాశం ఇస్తారని తెలుస్తోంది. నాగోల్ బండ్లగూడలోని ఖాళీ రాజీవ్ స్వగృహ ఇండ్లను నిర్వాసితులకు కేటాయిస్తారని ప్రచారం నడుస్తోంది.

లడ్డూ వెనుక రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు కొత్తగా వచ్చే లబ్ది ఏమీ ఉండదని, అయితే ప్రత్యర్థులు పైచేయి సాధించకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత తమపై ఉన్నదని వారు చెప్పారు. చంద్రబాబు చర్యలతో పార్టీకి లబ్ది చేకూరుతుందని ఓ టీడీపీ ఎమ్మెల్యే తెలిపారు. చంద్రబాబు చర్యలు ఆంధ్రప్రదేశ్‌లోని హిందువులకే కాకుండా ప్రపంచంలోని హిందువులందరికీ భరోసా ఇచ్చాయని టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు చెప్పారు.

నేను సైతం అంటున్న జనసేన

బీజేపీకి మిత్రపక్షంగా, ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ కూడా సనాతన ధర్మం నినాదాన్ని ఎత్తుకుంది. ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రస్తుతం 11 రోజుల 'ప్రాయశ్చిత్త దీక్ష'లో భాగంగా ప్రసిద్ధ దేవాలయాలను సందర్శిస్తూ తిరుపతిలో జరిగిన తప్పిదానికి క్షమాపణలు కోరుకుంటున్నారు. విజయవాడలోని కనకదుర్గ దేవాలయాన్ని సందర్శించి మెట్లు కడిగారు. దేవాలయాలకు సంబంధించిన వ్యవహారాలను చూడడానికి సనాతన ధర్మ రక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలోని హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను నిరసిస్తూ ధర్మ పరిరక్షణ దీక్ష చేపట్టాలని పవన్, బీజేపీ నేతలు 2020లో పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. టీడీపీ వ్యవస్థాపకుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును అనుకరిం చేందుకు పవన్ చేస్తున్న ప్రయత్నాలను తాము గమనిస్తున్నామని టీడీపీ నాయకులు చెప్పారు. వేషధారణలో కూడా పవన్ ఇటీవల ఎన్టీఆర్‌ను అనుకరించారు.

పవన్ చర్యలపై బీజేపీ సంబరం

ఏపీలో పార్టీకి నిర్మాణపరంగా కానీ, నాయకత్వ పరంగా కానీ తగిన బలం లేకపోయినా పవన్ కల్యాణ్ కేంద్ర నాయకత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారని, తాము ఏ భావజాలంతో ఉన్నామో దానికి ఆయన మద్దతుగా నిలుస్తున్నారని బీజేపీ సంబరపడుతోంది. 'పార్టీ మద్దతుదారులలో ఆయన అత్యంత విశ్వసనీయ వ్యక్తి. నరేంద్ర మోడీ సహా పార్టీ నాయకత్వం ఆయన పట్ల తమ అభిమానాన్ని, గౌరవాన్ని ఎన్నడూ దాచుకోలేదు' అని ఓ బీజేపీ నేత వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన తొలి ఎన్డీఏ సమావేశంలో పవన్‌ను ఉద్దేశించి 'ఆయన పవనం కాదు. తుఫాను' అని మోడీ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు.

నితీష్ అడుగులతో బీజేపీ బెంబేలు

రామ మందిరం నిర్మించినందుకు బీహార్ నేత నితీష్ కుమార్ ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. సీతామర్హి-అయోధ్య మధ్య నేరుగా రైల్వే లైను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. నితీష్ వైఖరి బీహార్‌లోని బీజేపీ వర్గాలలో ఆందోళన కలిగిస్తోంది. లోక్‌సభ ఎన్నికలలో అనూహ్య ఫలితాలు సాధించిన నితీష్ కుమార్, ఇప్పుడు తమ హిందూ ఓటు బ్యాంకుకు ఎక్కడ గండి కొడతారోనని కొందరు బీజేపీ నేతలు భయపడుతున్నారు. 'గత ఎనిమిది నెలల కాలంలో ఆయన ఎప్పుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదు. మా ఓటు బ్యాంకును గండి కొట్టేందుకు ఇది ఓ ప్రయత్నం కావచ్చు. సంకీర్ణ భాగస్వామిగా ఉన్నప్పటికీ గత ఎనిమిది నెలలుగా ఆయన మౌనంగానే ఉన్నారు. ఇప్పుడు హఠాత్తుగా రామ మందిర నిర్మాణాన్ని కొనియాడారు. ఆయన ఏం చేయబోతున్నారో పార్టీ గమనించాల్సి ఉంది' అని బీజేపీ నాయకుడొకరు చెప్పారు. శ్రీరాముడు కేంద్రంగా బీజేపీ సాగించిన రాజకీయాలకు భిన్నంగా సీతాదేవి కేంద్రంగా నితీష్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇది బీజేపీ రాజకీయాలకు ఆమోదం తెలిపినట్లే కన్పిస్తున్నప్పటికీ రామాయణ సర్క్యూట్, రాష్ట్రంలో టూరిజం అభివృద్ధిపై నితీష్ దృష్టి కేంద్రీకరించారని బీజేపీ నాయకులు గుర్తు చేశారు.

రేపు వైసీపీ పూజలు

లడ్డూ వివాదంలో చంద్రబాబు పైచేయి సాధిస్తున్నారేమోనన్న అనుమానంతో వైసీపీ కూడా రంగంలోకి దిగింది. చంద్రబాబు దెబ్బతీసిన తిరుమల పవిత్రతను పునరుద్ధరించేందుకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో పూజలు నిర్వహించాలని వైసీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.



తల్లి మనసు షూటింగ్ పూర్తి

రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్ర ధారులుగా రూపొందుతున్న చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మాతగా తొలిసారి సినీరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న చిత్రమిది. పలువురు ప్రముఖ దర్శకుల వద్ద దర్శకత్వ శాఖలో విశేష అనుభవం గడించిన వి.శ్రీనివాస్ (సిప్పీ) దీని ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు.

ఈ సినిమా షూటింగ్ పార్ట్ పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్మాత ముత్యాల అనంత కిషోర్ మాట్లాడుతూ, "సన్నివేశాలకు అనుగుణంగా హైదరాబాద్‌లోని వివిధ లొకేషన్స్‌లో టాకీ, క్లైమాక్స్, పాటలతో సహా షూటింగ్ పార్ట్ మొత్తం సింగిల్ షెడ్యూల్లో పూర్తి చేశాం. మంచి కథ, కథనాలు ఈ చిత్రానికి ప్రధాన బలమైతే, అందుకు సరిపోయే ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణులు మరో బలం. మనసును కట్టి పడేసే అద్భుత చిత్రంగా దీనిని మలిచాం. మా నాన్న పర్యవేక్షణలో దర్శకుడు అద్భుతంగా సినిమాను తీశారు. మేము అనుకున్నట్టే చాలా బాగా వచ్చింది. తొలి ప్రయత్నం లోనే ఒక మంచి సినిమా తీసినందుకు ఆనందంగా ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి' అని చెప్పారు.

'ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకులకు అందించాలన్న తపనతో మా అబ్బాయి నిర్మాతగా చేస్తున్న చిత్రమిది. వాస్తవిక జీవితానికి అద్దంపట్టే విధంగా ఉంటుంది' అని చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య అన్నారు.

దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) మాట్లాడుతూ, 'ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథ ఇది. పలురకాల భావోద్వేగాలు, ఆ తల్లి సంఘర్షణల నేపథ్యంలో ఈ చిత్రాన్ని మలిచాం' అని తెలిపారు.

రఘుబాబు, శుభలేఖ సుధాకర్, సాహిత్య, వైష్ణవి, దేవిప్రసాద్, ఆదర్శ్ బాలకృష్ణ, శాంతకుమార్, గౌతం రాజు, దేవిశ్రీ, జబర్దస్త్ ఫణి తదితరులు ఈ చిత్రంలోని ఇతర ముఖ్య తారాగణం.

నవచిత్రం

ఆయుధ పూజ..సందడి షురూ



ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'దేవర'. నేడు (శుక్రవారం) ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని 'ఆయుధ పూజ..' సాంగ్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, కాలభైరవ ఆలపించారు. దీనికి అనిరుధ్ అద్భుతమైన స్వరాలను సమకూర్చారు. రిలీజైన కొద్ది నిమిషాల్లోనే ఈ పాట విశేష ప్రేక్షకాదరణ పొంది, సినిమాపై మరిన్ని అంచనాలను పెంచింది.

యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందింది. దేవర, వర అనే రెండు పాత్రల్లో ఎన్టీఆర్ తన నట విశ్వ రూపాన్ని మరోమారు చూపించబోతున్నారు. బాలీవుడ్ నటి జాన్వీకపూర్ కథానాయికగా, బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ శక్తివంతమైన ప్రతినాయకుడిగా నటించారు.

నందమూరి కళ్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె నిర్మించిన ఈచిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది.

1000కి పైగా జానపద కళాకారులతో

రా మచ్చా మచ్చా..



తమన్, శంకర్, రామ్‌చరణ్, శిరీష్

పక్కా కమర్షియల్ సినిమాల్లో సందేశాన్ని సైతం మిళితం చేస్తూ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేయటంలో దర్శకుడు శంకర్ దిట్ట. అలాగే ఆయన సినిమాల్లోని పాటలు సైతం చాలా వైవిధ్యంగా ఉంటాయి.

తాజాగా 'గేమ్ చేంజర్' సినిమాలోని పాటలతో ఆయన మరోసారి తన ప్రత్యేకత చాటుకున్నారు. ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'జరగండి.. జరగండి' ఇప్పటికే విశేష ఆదరణ పొందింది. ఈనెల 28న రెండవ సాంగ్ 'రా మచ్చా మచ్చా' ప్రోమోను, 30న పాటను రిలీజ్ చేయబోతున్నారు.

ఈ పాట కోసం శంకర్ ఏకంగా 1000కి పైగా జానపద కళాకారులను తీసుకున్నారు.

వీరంతా ఈ పాటలో రామ్ చరణ్‌తో కలిసి డాన్స్ చేయటం విశేషం.

రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'గేమ్ చేంజర్'. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్. క్రిస్మస్ సందర్భంగా సినిమాను తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నారు.

ఈ పాట గురించి డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ, 'నేను రామ్‌చరణ్ కోసం ఓ ఇంట్రడక్షన్ సాంగ్ కావాలని తమన్‌ను అడిగాను. డిఫరెంట్‌గా చేద్దామని ఇద్దరం అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృతులను బేస్ చేసుకుని పాటని చేశాం. ఏపీలో గుసాడి, కొమ్ము కోయ, తప్పెట గుళ్ల వంటి జానపద నృత్యాలను పాటలో భాగం చేయాలనుకున్నాను.అలాగే వెస్ట్ బెంగాల్‌కు చెందిన చౌ, ఒరిస్సాకు చెందిను గుమ్రా, రానప్ప, పైకా, దురువ వంటి వాటితో పాటు కర్ణాటకు చెందిన హలారి. ఒక్కలిగ, గొరవర, కుణిత వంటి నృత్య రీతులను కూడా భాగం చేశాం. దీని వల్ల పాట గ్రాండియర్ లుక్‌తో వచ్చింది. సౌండింగ్ కూడా చాలా ఫ్రెష్‌గా ఉంది. పాట ఒక సెలబ్రేషన్‌లా ఉంటుంది. గణేష్ ఆచార్య కొరియోగ్రఫీ అందించారు. రామ్‌చరణ్ అయితే ఓ బీజీఎంను సింగిల్ షాట్‌లో పూర్తి చేశారు. ఇది చరణ్ ఫ్యాన్స్, సినీ లవర్స్‌కు ఓ ట్రీట్‌లా ఉంటుంది. అనంత్ శ్రీరామ్ పాటను సూపర్బ్‌గా రాశారు. దిల్ రాజు, శిరీష్ చాలా సపోర్ట్‌గా నిలిచారు' అని అన్నారు.

> 'రా మచ్చా మచ్చా' సాంగ్‌లో అన్నీ సంస్కృతులను చూపించటం ఐ ఫీస్ట్‌లా ఉంటుంది. దర్శకుడు శంకర్ చాలా హుక్ లైన్స్ రాశారు. చివరకు 'రా మచ్చా మచ్చా..' అనే లైన్‌ను సెలక్ట్ చేసుకున్నారు. పాటను స్క్రీన్‌పై చూస్తున్నప్పుడు చాలా ఎంజాయ్ చేస్తారు.
>
> - సంగీత దర్శకుడు తమన్



మిస్టర్ సెలెబ్రిటీ రిలీజ్‌కి రెడీ



'మిస్టర్ సెలెబ్రిటీ' సినిమాతో సుదర్శన్ పరుచూరి హీరోగా పరిచయం అవుతున్నారు. ఆర్‌పి సినిమాస్ బ్యానర్ మీద చిన్న రెడ్డయ్య, ఎన్.పాండు రంగా రావు నిర్మాతలుగా రాబోతోన్న ఈ మూవీకి చందిన రవి కిషోర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రీ దీక్ష, నాజర్, రఘుబాబు వంటి వారు ముఖ్య పాత్రలను పోషించారు.

ఈ సినిమా నుంచి ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నాయి.

తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ను పరుచూరి గోపాలకృష్ణ రిలీజ్ చేశారు. అక్టోబర్ 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మా మనవడు పరుచూరి సుదర్శన్ నటించిన ఈ సినిమా అక్టోబర్ 4న రాబోతోంది. మమ్మల్ని ఆదరించినట్టుగానే మా మనవడ్ని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నాను. కొత్త దర్శకుడైనా కూడా సినిమాను బాగా తీశారు. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని చెప్పారు.

'మమ్మల్ని ప్రేక్షకులు ఈ నలభై ఏళ్లుగా ఆదరిస్తూనే ఉన్నారు. ఇప్పుడు మా మనవడు పరుచూరి సుదర్శన్ ఈ సినిమా ద్వారా ఆడియెన్స్ ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రాన్ని నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా గొప్పగా నిర్మించారు. దర్శకుడు అద్భుతంగా సినిమాను తీశారు. మా మనవడ్ని ఆదరించి ఈ సినిమాను విజయవంతం చేయండి' అని పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు.

క్లీన్‌స్వీప్‌పై కన్నేసి..

భారత్, బంగ్లాదేశ్ టెస్టు సవాల్ కాన్పూర్‌కు చేరుకుంది. చెపాక్‌లో బంగ్లాను చిత్తు చేసిన టీమ్ ఇండియా.. కాన్పూర్‌లో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. నల్ల మట్టి పిచ్‌పై స్పిన్ మ్యాజిక్‌కు రంగం సిద్ధం చేసుకున్న రోహిత్‌సేన 2-0తో సిరీస్ సాధించటంపై కన్నేసింది.

క్లీన్‌స్వీప్‌పై భారత్, సమంపై బంగ్లాదేశ్ ఆశలు పెట్టుకోగా.. మరోవైపు మూడు రోజుల కుండపోతకు సిద్ధమవుతున్నాడు. కీలక కాన్పూర్ టెస్టుకు వర్షం ముప్పు పొంచి ఉండటంతో తుది జట్టు కూర్పు, ముగ్గురు స్పిన్నర్ల ప్రణాళిక ప్రభావితం అవుతాయా? చూడాలి. భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు నేటి నుంచి ఆరంభం.

- 2-0తో విజయంపై భారత్ గురి
- కాన్పూర్ టెస్టుకు వర్షం ముప్పు
- నేటి నుంచి భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు

ఉ॥ 9.30 నుంచి జియో సినిమాలో..



నవతెలంగాణ-కాన్పూర్

పాకిస్థాన్‌పై 2-0తో చారిత్రక టెస్టు సిరీస్ విజయంతో భారత్‌లో అడుగుపెట్టింది బంగ్లాదేశ్. తొలి టెస్టు తొలి రోజు భారత్‌ను 144/6తో కట్టడి చేసి ఆ జోరు కొనసాగించింది. కానీ ఆ తర్వాత టీమ్ ఇండియా మ్యాచ్‌ను మలుపుతిప్పింది. 280 పరుగుల తేడాతో చెపాక్ టెస్టులో ఏకపక్ష విజయం సాధించింది. స్వదేశంలో టీమ్ ఇండియా అత్యంత బలమైన జట్టుగా ఎందుకు కొనసాగుతుందో చెపాక్ టెస్టు ఓ ఉదహారణ. బంగ్లాదేశ్ శిబిరంలో ఇప్పుడు పాక్ సిరీస్ ఉత్సాహం లేదు. ఈ తరుణంలో నేటి నుంచి కాన్పూర్‌లో రెండో టెస్టు ఆరంభం కానుంది. వర్షం ముప్పు పొంచి ఉన్న టెస్టులో విజయమే లక్ష్యంగా ఇరు జట్లు బరిలోకి దిగుతుండగా.. ఆతిథ్య జట్టు క్లీన్‌స్వీప్‌కు రంగం సిద్ధం చేసుకుంది.

కుర్రాళ్లే బలం

విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ.. సహజంగా భారత టెస్టు మ్యాచ్‌లో పరుగుల భారం ఈ ఇద్దరిదే. కానీ చెన్నై టెస్టులో ఈ ఇద్దరు కలిపి నాలుగు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 34 పరుగులే చేశారు. అయినా, భారత్ 280 పరుగుల తేడాతో విజయం సాధించింది. అందుకు కారణం జట్టులోని యువ క్రికెటర్లు రాణించటమే. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ మెరుపు ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. సీనియర్లు అశ్విన్, జడేజాలు తొలుత బ్యాట్‌తో ఆదుకున్నా.. కుర్ర బ్యాటర్లు క్లిష్ట సమయంలో అండగా నిలిచారు. న్యూజిలాండ్‌తో సిరీస్ ముంగిట కోహ్లి, రోహిత్ ఫామ్ భారత్‌కు కీలకం. నేడు కాన్పూర్‌లో ఈ ఇద్దరి ఇన్నింగ్స్‌పై ఫోకస్ ఉండనుంది. స్పిన్ పిచ్‌పై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో ఆడనుంది. అశ్విన్, జడేజాలకు తోడుగా లోకల్ బాయ్ కుల్దీప్‌ను ఎంచుకునే అవకాశం ఉంది. అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా బౌలింగ్ శైలి ఒకే విధంగా ఉంటుంది. దీంతో స్పిన్ ఎటాక్‌లో భిన్నత్వం కోసం కుల్దీప్‌ను తీసుకునే వీలుంది. జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లు పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. చెన్నై టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో సీమర్లు 8 వికెట్లు పడగొట్టగా.. రెండో ఇన్నింగ్స్‌లో స్పిన్నర్లు 9 వికెట్లు కూల్చారు. ఇదే జోరు గ్రీన్‌పార్క్ పిచ్‌పై కొనసాగించేందుకు బౌలర్లు ఎదురు చూస్తున్నారు.



పుంజుకోగలరా?

స్పిన్ అనుకూల కాన్పూర్ టెస్టులో పుంజుకోవాలని బంగ్లాదేశ్ ఆశిస్తోంది. షకిబ్, మిరాజ్, తైజుల్ రూపంలో నాణ్యమైన స్పిన్నర్లు ఆ జట్టులో ఉన్నారు. బ్యాట్‌తో బంగ్లాదేశ్ ఆటగాళ్లు బాగానే ఆడుతున్నారు. చెన్నై టెస్టులో కెప్టెన్ నజ్ముల్ శాంటో ఫామ్‌లోకి వచ్చాడు. షకిబ్ అల్ హసన్, మెహిది హసన్ మిరాజ్, లిటన్ దాస్‌లు మంచి ఆరంభాలను అందుకున్నారు. కానీ భారత్‌లో టెస్టు మ్యాచ్‌లో పైచేయి సాధించేందుకు ఆ మెరుపులు సరిపోవు. ఐదు రోజుల పాటు నిలకడగా ఉత్తమ ప్రదర్శన చేయగలిగితేనే ఇక్కడ విజయం కోసం పోరాడగలం. ఈ సంగతి బంగ్లాదేశ్‌కు బాగా తెలుసు. పేసర్ నహిద్ రానాకు రెండో టెస్టులో ఆడే అవకాశం దక్కకపోవచ్చు. అతడి స్థానంలో మరో స్పిన్నర్‌ను తుది జట్టులో ఆడించనున్నారు.

పిచ్, పరిస్థితులు

కాన్పూర్ పిచ్ సంప్రదాయంగా స్పిన్‌కు అనుకూలం. తొలి రెండు రోజులు పేసర్లకు సహకారం లభించినా.. మూడో రోజు నుంచి బంతి గిరగిరా తిరుగుతుంది. నల్ల మట్టి పిచ్‌పై బ్యాటర్లకు పరుగుల వేట సులభం కానుంది. వర్షం సూచన ఉండటంతో ఇరు జట్ల తుది జట్టు కూర్పుపై ఆ ప్రభావం ఉండనుంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్/అక్షర్ పటేల్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

బంగ్లాదేశ్ : షాద్‌మాన్ ఇస్లాం, జాకిర్ హసన్, నజ్ముల్ శాంటో (కెప్టెన్), మోమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్, షకిబ్ అల్ హసన్, లిటన్ దాస్ (వికెట్ కీపర్), మెహిది హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లాం, హసన్ మహ్మద్, టస్కిన్ అహ్మద్.

వరుణుడు కరుణించేనా?

భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టుకు వర్షం ముప్పు పొంచి ఉంది. ఐదు రోజుల ఆటలో తొలి మూడు రోజుల వర్షం కురిసే అవకాశం అధికంగా ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం ఉదయం నుంచే కాన్పూర్‌లో చిరు జల్లులతో కూడిన వర్షం సూచనలు ఉన్నాయి. ఉదయం 11 తర్వాత వర్షం తీవ్రత అధికం కానుంది. ఇక శనివారం భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. శుక్ర, శని, ఆదివారాలు వర్షం ప్రమాదంతో ఆటపై ప్రభావం పడనుంది. వర్షం కారణంగా ఇరు జట్ల తుది జట్ల కూర్పు, ప్రణాళికల్లో సైతం మార్పులు చేర్పులు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు.

రెండు పిచ్‌లు సిద్ధం!

చెపాక్ ఎర్రమట్టి పిచ్‌పై భారత్ 280 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాన్పూర్ టెస్టులో పిచ్ స్పిన్నర్లకు అనుకూలం. కానీ మ్యాచ్ కోసం గ్రీన్‌పార్క్ స్టేడియం క్యూరేటర్ రెండు పిచ్‌లను సిద్ధం చేశారు. మ్యాచ్‌కు ముందు రోజు వరకు గ్రౌండ్స్‌మెన్ రెండు పిచ్‌లను సిద్ధం చేస్తూ కనిపించారు. టాస్ ముంగిట ఏ పిచ్‌ను వాడేది తెలిసే అవకాశం ఉంది. రెండు పిచ్‌లు సైతం నల్లమట్టితో చేసినవే అయినా.. వాతావరణ పరిస్థితులు ఆధారంగా పచ్చిక ఎక్కువ, తక్కువ ఉన్న పిచ్‌ను ఎంచుకోవాలనేది క్యూరేటర్ ఆలోచనగా తెలుస్తోంది.

అధునాతన ఫ్లడ్‌లైట్లు

గ్రీన్‌పార్క్ స్టేడియం చివరగా 2021లో టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చింది. న్యూజిలాండ్ పదో వికెట్ భాగస్వామ్యం పోరాడుతుండగా మరో 12 నిమిషాల ఆట మిగిలి ఉండగానే మ్యాచ్ నిలిచిపోయింది. వెలుతురు లేమి సమస్యతో అంపైర్లు మ్యాచ్‌ను కొనసాగించలేదు. దీంతో భారత్ విజయానికి వికెట్ దూరంలో ఆగిపోయింది. భారత్, బంగ్లాదేశ్ టెస్టుకు వెలుతురు లేమి సమస్యను అధిగమించేందుకు అధునాతన ఫ్లడ్‌లైట్లు ఏర్పాట్లు చేసినట్టు స్టేడియం అధికారులు వెల్లడించారు.

కోతులకు చెక్!

కాన్పూర్ అనగానే స్పిన్ స్వర్గధామ పిచ్‌తో పాటు కోతుల బెడద సైతం గుర్తుకొస్తుంది. స్టాండ్స్‌లో అభిమానులతో పాటు ఆటగాళ్లను కోతులు ఇబ్బందులకు గురిచేశాయి. భారత్, బంగ్లాదేశ్ టెస్టు మ్యాచ్‌కు యుపీసీఏ అధికారులు కోతులను కట్టడి చేసేందుకు రెండెంచల ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

ఆటలు

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

ట్రెసా, గాయత్రి జోడీ సైతం మకావు ఓపెన్ బ్యాడ్మింటన్



మకావు (చైనా) : మకావు ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత షట్లర్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నారు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిదాంబి శ్రీకాంత్ వరుసగా రెండో విజయం నమోదు చేశాడు. మెన్స్ సింగిల్స్ రెండో రౌండ్లో సహచర భారత షట్లర్ ఆయుశ్ శెట్టిపై 21-13, 21-18తో వరుస గేముల్లో గెలుపొందాడు. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జోడీ సైతం క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో 22-20, 21-11తో చైనీస్ తైపీ జోడీ లిన్ చున్, టెంగ్ చున్‌లపై వరుస గేముల్లో అలవోక విజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో తస్నీమ్ మిర్ 17-21, 21-13, 10-21తో మూడు గేముల మ్యాచ్‌లో జపాన్ షట్లర్ మియజాకి చేతిలో పోరాడి ఓటమి చెందింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి, సుమిత్ రెడ్డి జోడీకి నిరాశే ఎదురైంది. 17-21, 14-21తో మలేషియా షట్లర్లు వాంగ్, లిమ్ చేతిలో ఓటమి పాలయ్యారు.

టీ20లకు షకిబ్ గుడ్ బై

సొంతగడ్డపై సఫారీతో వీడ్కోలు టెస్టు



కాన్పూర్ : బంగ్లాదేశ్ స్టార్ ఆటగాడు షకిబ్ అల్ హసన్ టీ20లకు గుడ్ బై పలికాడు. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌తోనే పొట్టి ఫార్మాట్ కెరీర్‌కు ముగింపు పలికానని వెల్లడించాడు. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో వీడ్కోలు టెస్టు ఆడతానని ప్రకటించాడు. దీంతో బంగ్లాదేశ్ తరఫున షకిబ్ ఇక నుంచి వన్డేలు మాత్రమే ఆడనున్నాడు. భారత్‌తో టీ20 సిరీస్‌లోనూ షకిబ్ ఆడటం లేదు. అయితే, స్వదేశంలో వీడ్కోలు టెస్టుపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఏడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ ప్రభుత్వం కుప్పకూలింది. ఆ ప్రభుత్వంలో పార్లమెంట్ సభ్యుడిగా షకిబ్ భాగస్వామి. దీంతో మీర్పూర్‌లో జరిగే టెస్టులో షకిబ్‌కు భద్రత కల్పించటంపై బీసీబీ సహా ప్రభుత్వ విభాగాల నుంచి హామీ రావాల్సి ఉంది. టెస్టులో ఆడటంతో పాటు తిరిగి విదేశాలకు చేరుకునేందుకు స్పష్టమైన హామీ లభిస్తేనే ఆడతానని షకిబ్ తేల్చి చెప్పారు. బంగ్లాదేశ్‌లో సఫారీ పర్యటనకు దక్షిణాఫ్రికాకు ఇంకా భద్రతపరమైన క్లియరెన్స్ రావాల్సి ఉంది. 37 ఏండ్ల షకిబ్ 129 టీ20ల్లో 2551 పరుగులు, 149 వికెట్లు పడగొట్టాడు. 70 టెస్టుల్లో 4600 పరుగులు సహా 242 వికెట్లు తీసుకున్నాడు.



చెస్ హీరో అర్జున్‌కు ఘన స్వాగతం : ఫిడె 45వ చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం సాధించిన భారత జట్టులో కీలక ఆటగాడు, తెలంగాణ స్టార్ అర్జున్ ఇరిగేశికి హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అర్జున్‌కు రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షులు ప్రసాద్, శాట్ అధికారులు నందకిశోర్ గోకుల్ , అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, సురేశ్ కాలేరు సహా చెస్ క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు అపూర్వ స్వాగతం పలికారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- లేదంటే ఆమరణ దీక్ష చేస్తాం : టీజీఎస్ ఆర్టీసీ టీఎంజేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె హనుమంతు ముదిరాజ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని టీజీఎస్ఆర్టీసీ టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె హనుమంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని తెలిపారు. ఎస్‌డబ్ల్యూయూ, ఐఎన్‌టీయూసీ నుంచి వైదొలిగి ఇక నుంచి టీజేఎంయూగా యూనియన్ కొనసాగుతుందని తెలిపారు. కార్మికులపై పెరిగిన పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. దసరా పండుగ అడ్వాన్సులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2013 పే స్కేల్ ఏరియర్స్‌ను అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజేఎంయూ నాయకులు డీవీకే రావు, కె ప్రేమ్‌రాజ్, గోలి రవీందర్, పీకే మూర్తి, ఆర్ఎన్ రావు, జల్దా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రవాసీ ప్రజావాణి' ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విదేశాల్లో పనిచేసే కార్మికుల బాధలను, వారి కుటుంబ సభ్యుల ద్వారా హైదరాబాద్ బేగంపేటలోని ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి'లో విన్నవించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ జి చిన్నారెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కలిసి మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి' ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తారు. ఈ ఏర్పాట్లను ఎన్ఆర్ఐ ప్రతినిధులు వినోద్ కుమార్, మంద భీం రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, బొజ్జ అమరేందర్ రెడ్డి, గంగసాని నవీన్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస్ రావు గురువారం ప్రజా భవన్‌లో పరిశీలించారు. గల్ఫ్‌తోపాటు ఇతర దేశాల్లో ఉన్న భారతీయులు రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. భారత్‌లో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఢిల్లీలోని భారత ప్రభుత్వ దేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలను సంప్రదించడానికి సరైన మార్గదర్శనం లేక వారు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. ప్రవాసీ కార్మికులకు, కేంద్ర ప్రభుత్వానికి, భారత రాయబార కార్యాలయాలకు మధ్యన ఒక వారధిలా పని చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు అందించే దౌత్య సంబంధమైన సేవలను వేగవంతం చేయడానికి 'ప్రవాసీ ప్రజావాణి' ఉపయోగపడుతుంది.

బీసీ రిజర్వేషన్ల కోసం తమిళతరహాలో పోరాటం

- తమిళనాడు బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులతో బీఆర్ఎస్ నేతల భేటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమిళనాడు తరహాలో విద్యా, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లు సాధించేందుకు బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆ పార్టీ నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ చైర్మెన్లు తెలిపారు. తమిళ పార్టీలలో బహుజన వర్గాల ప్రాతినిథ్యం వంటి పలు అంశాలను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ బీసీ సీనియర్ నేతల బృందం తమిళనాడులో పర్యటిస్తోంది. గురువారం చెన్నైలో అక్కడి బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులతో బీఆర్ఎస్ నేతలు రాష్ట్రంలో రిజర్వేషన్లు, బీసీ అభివృద్ధి పథకాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాఉద్యోగాలలో బీసీలకు రిజర్వేషన్లు సాధించాలంటే ఆ తరహా రిజర్వేషన్లు ఒక్కటే పరిష్కార మార్గమని చెప్పారు. తమిళనాడు తరహా రిజర్వేషన్లు తమ రాష్ట్రానికి అమలు చేయాలని పలు మార్లు కేసీఆర్, ప్రధాని మోడీని కోరినట్టు గుర్తు చేశారు. తమిళనాడులో పర్యటిస్తున్న బృందంలో రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నాయకుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న శాసన మండలి మాజీ చైర్మెన్ స్వామి గౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, పుట్టమధు, కోరుకంటి చందర్, మాజీ చైర్మెన్లు జూలూరు గౌరీశంకర్, డాక్టర్ ఆంజనేయగౌడ్, పల్లె రవికుమార్, తుల ఉమ, గెల్లు శ్రీనివాస యాదవ్, నాగేందర్ గౌడ్, రవీంద్రసింగ్, బాలరాజు యాదవ్, మాజీ బీసీ కమిషన్ సభ్యులు సుభప్రద పటేల్, కిశోర్ గౌడ్, బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రీనివాస్, చెరుకు సుధాకర్, రాజ్యలక్ష్మి బీసీ జనసభ అధ్యక్షులు రాజారాం యాదవ్, విద్యార్థి సంఘం నేత దత్తాత్రేయ తదితరులు ఉన్నారు.

ఐలమ్మకు నివాళులు

తెలంగాణ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా చెన్నైలో బీఆర్ఎస్ నేతలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తొలితరం ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ

- మాజీ సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వాతంత్ర్య సమరయోధుడుగా, అనంతర కాలంలో తెలంగాణ స్వయంపాలన కోసం, ఆత్మగౌరవం కోసం, పోరాటాలు నడిపిన తొలితరం ఉద్యమ నేతగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి అజరామరమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. రాజకీయవేత్తగా తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు బాపూజీ నడిపిన రాజీలేని పోరాటాలు తెలంగాణ సోయి కలిగిన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కేసీఆర్ కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని (సెప్టెంబర్ 27) పురస్కరించుకుని ఆయన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. మంత్రి పదవిని త్యాగం చేసి నాటి తెలంగాణ వ్యతిరేకులకు సవాల్ విసిరిన బాపూజీ పట్టుదల తన మలిదశ రాష్ట్ర సాధన పోరాటంలో స్పూర్తి నింపిందని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు కాపాడబడాలంటే స్వరాష్ట్ర సాధనతోనే సాధ్యమనీ, తాను రాజీనామా చేసి ఉద్యమాన్ని ప్రారంభించిన నాడు, కొండా లక్ష్మణ్ బాపూజీ తనకు అండగా నిలిచిన సందర్భాన్ని కేసీఆర్ మరోసారి గుర్తు చేసుకున్నారు. స్వయంపాలన కోసం తాను తొలి అడుగు వేసిన నాటి జలదృశ్యం ఉద్యమ ప్రస్థానం నుంచి, స్వరాష్ట్రంగా నిలిపి పదేండ్ల బీఆర్ఎస్ పాలన సాధించిన ప్రగతి ప్రస్థానం ఒక చరిత్రాత్మక ఘట్టం అని కేసీఆర్ అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తన జీవితకాలం పోరాడిన బాపూజీ ఆకాంక్షలకు అనుగుణంగా పదేండ్ల పాలన కొనసాగిందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. బాపూజీ కృషిని భావి తరాలకు నిత్య స్పూర్తిగా నిలిపేందుకు నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఆయన స్మారకార్థం అనేక కార్యక్రమాలను చేపట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ సబ్బండ కులాల ఆత్మగౌరవాన్ని కాపాడడం, అన్ని రంగాల్లో వారి హక్కులకు రక్షణ కల్పించడం, వారిని స్వయంపాలనలో భాగస్వామ్యులను చేయడం ద్వారానే కొండా లక్ష్మణ్ బాపూజీ కి మనమందించే ఘన నివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

నిండుకుండలా సింగూరు ప్రాజెక్టు

- ప్రాజెక్టులోకి భారీ వరద

నవతెలంగాణ-పుల్కల్

ఉమ్మడి మెదక్ జిల్లాలో అతిపెద్ద ప్రాజెక్టు అయిన సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండటంతో నిండుకుండలా మారింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు. వారం రోజులుగా ఎగువ భాగం నుంచి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 12.128 క్యూసెక్కులు రావడంతో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టు 11వ గేటును 1.50 మీటర్ల పైకి లేపి దిగువకు 11.446 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరిగింది. అయితే, ప్రాజెక్టు పైకి అనుమతి ఇవ్వకపోవడంతో పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు.

ఇంకా నీళ్లల్లోనే 'వట్టెం' మోటార్లు

- ఆ వైపు వెళ్లకుండానే వెనుదిరిగిన మంత్రులు • తొమ్మిదేండ్లయినా పూర్తికాని పనులు • సాగు,తాగునీటికి తప్పని కష్టాలు

22 రోజులు కావస్తున్నా.. వెలికితీయని వైనం

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన వట్టెం పంపుహౌజ్ నీటిలో మునిగి దాదాపు నెల రోజులు కావస్తున్నా.. నేటికీ మునిగిన మోటార్లను వెలికి తీయలేదు. ఇక్కడ మొత్తం 10 మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా నాలుగు బిగించారు. మరో మోటారు నిర్మాణ దశలో ఉండగానే ఈనెల ఒకటిన కురిసిన భారీ వర్షానికి రింగ్‌బాండ్ తెగి నీరంతా టన్నెల్‌లోకి చేరింది. దీంతో ప్రాజెక్టు పనులు ఆలస్యం అవుతున్నాయి. జరిగిన నష్టాన్ని పరిశీలించి పనులు పూర్తి చేయించడా నికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు నీట మునిగిన మోటార్ల వైపు రాకుండానే వెళ్లిపోయారు. ఇప్పటికే మూడేండ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టు పనులు ఆగుతూ.. సాగుతూ జరుగుతున్న తరుణంలో మోటార్లు వరదలో మునగడంతో మరింత ఆలస్యం జరిగే అవకాశం ఉంది. మరోవైపు





సాగునీరందక.. భూములు కోల్పోయిన వారు ఉపాధి లేక హైదరాబాద్ వంటి నగరాలకు వలస పోతున్నారు. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం గ్రామానికి సమీపంలో పాలమూరు -రంగారెడ్డి టన్నెల్ నిర్మాణ దశలో ఉంది. టన్నెల్ పైభాగాన ఉన్న గొలుసుకట్టు చెరువుల్లో అధిక వర్షాలకు భారీగా వరద చేరింది. ఈ తాకిడికి రింగ్‌బాండ్ తెగి సర్జిపుల్ ద్వారా పంపు హౌజ్‌లోకి నీళ్లు వచ్చాయి. నెల రోజులు కావస్తున్నా డీవాటరింగ్ కావడం లేదు. ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు మునిగిన మోటార్ల వైపు వెళ్లకుండానే పర్యటన ముగించారు. ఈ ప్రాజెక్టును 2016 జూన్‌లో రూ.32500 కోట్లతో మొదలు పెట్టారు. మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణం దెబ్బతింటుందని గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయడంతో పనులు మందగించాయి.

ఆ తర్వాత తాగునీటి పేరుతో అనుమతులు తెచ్చుకున్నారు. జూరాల, రాజోళీ ప్రాజెక్టుల ద్వారా 2 లక్షల ఎకరాలకు మాత్రమే సాగు నీరందుతోంది. అందుకే పాలమూరు-రంగారెడ్డి ద్వారా రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందివ్వాలని లక్ష్యం నిర్ణయించారు. 61.67 కి.మీటర్ల సొరంగం, 915.47 కిలోమీటర్ల కాల్వలు తవ్వాల్సి ఉంది. తాగునీటి కోసం 7.15 టీఎంసీలు, పరిశ్రమలకు 3 టీఎంసీలు, సాగునీటి కోసం 75 టీఎంసీలు ఇవ్వాల్సి ఉంది. 1200 గ్రామాలకు తాగునీరు కూడా ఇవ్వాల్సి ఉంది. నీటిని తోడటానికి 31 మోటార్లు 145 మెగావాట్లు, 3 మోటార్లు 75 మెగావాట్లవి బిగించాల్సి ఉంది. బడ్జెట్ లేక పనులు నత్తను తలపిస్తు న్నాయి. తాజాగా మోటార్లు మునగడంతో ప్రాజెక్టు పనులు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

పాలకుల నిర్లక్ష్యం

జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులపై పాలకులు ఆది నుంచీ నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మూడేండ్లలో పూర్తి కావాల్సిన పనులు ఎనిమిదేండ్లు గడిచినా 70 శాతమైనా పూర్తి కాలేదు. 2024 బడ్జెట్‌లో పాలమూరు-రంగారెడ్డికి రూ.1285 కోట్లు కేటాయించారు. ఈ నిధులు ఇప్పటి వరకు చేసిన పనులకే సరిపోతాయి. మరో రూ.10 వేల కోట్లు ఇస్తేనే పనులు ముందుకు సాగుతాయని పలు రాజకీయ పార్టీల నేతలు చెబుతున్నారు. ప్రభుత్వం కల్వకుర్తికి రూ.715, కోయిల్‌సాగర్‌కు రూ.429 కోట్లు, సంగంబండకు రూ.138కోట్లు, నెట్టెంపాడుకు రూ.105కోట్లు, ఆర్డీఎస్‌కు రూ.29.50 కోట్లు, జూరాలకు రూ.5కోట్లు, బీమాకు రూ.32 కోట్లు కేటాయించింది. ఈ నిధులు నిర్వహణకు తప్ప పనుల పొడిగింపునకు ఏమాత్రం సరిపోవని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏడాదిలోపు పూర్తి చేస్తాం

పెండింగులో ఉన్న పాలమూరు రంగారెడ్డితో పాటు ఇతర ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేస్తాం. ప్రాధాన్యత క్రమంగా పూర్తి చేసి ఆయకట్టుకు నీరందిస్తాం. ప్రాజెక్టులకు నిధుల కొరత రాకుండా చూస్తాం. గత పాలకుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజా ప్రభుత్వంలో ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ఎవరికీ ఎటువంటి అనుమానాలూ అవసరం లేదు.

జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్, పర్యాటక శాఖామంత్రి

ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ

- వైమానిక ట్రైనింగ్ సెంటర్ నెలకొల్పండి : కేంద్ర మంత్రులకు ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ విజ్ఞప్తి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆదిలాబాద్‌లో మూతపడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ను పునరుద్ధరించాలని, స్థానికంగా ఎయిర్ ఫోర్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామిలను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్‌లు మీడియాతో మాట్లాడారు. ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీని పున: ప్రారంభించాలని కేంద్ర మంత్రి కుమారస్వామిని కోరినట్టు తెలిపారు. 1992 వరకు లాభాల్లో నడిచిన ఈ సంస్థ 1996లో మూత పడిందన్నారు. ఈ సంస్థను తిరిగి ప్రారంభించాలని కేంద్ర మంత్రిని కోరినట్టు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి కుమార స్వామి వెంటనే సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడారని చెప్పారు. సీఎం నుంచి సానుకూల సమాధానం వచ్చిందని, వారం రోజుల్లో ఈ సిమెంట్ ఫ్యాక్టరీ రీ ఓపెనింగ్ పై కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. అలాగే కేంద్ర రక్షణ శాఖ మంత్రిని కలిసి ఆదిలాబాద్‌లో ఎయిర్ ఫోర్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

బీఆర్ఎస్ వల్లే ఆదిలాబాద్‌కు ఎయిర్ ఫోర్స్ స్టేషన్ రాలే....: ఎంపీ నగేశ్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 2014లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కేంద్ర రక్షణ శాఖ ఒక కమిటీని పంపిందన్నారు. కమిటీ సిఫారసుల మేరకు స్టేషన్ ఏర్పాటుకు వెయ్యి ఎకరాల భూమి ఇవ్వాలని కేంద్రం కోరిందన్నారు. కానీ బీఆర్ఎస్ సర్కార్ భూమి కేటాయించకపోవడం వల్ల ఆదిలాబాద్‌కు ఎయిర్ ఫోర్స్ స్టేషన్ రాలేదని ఆరోపించారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో రక్షణ శాఖకు సంబంధించిన 369 ఎకరాలు ఉందన్నారు. ఇందులో ఎయిర్ ఫోర్స్ ఫీల్డ్ ఉందన్నారు. తాజాగా జిల్లా యంత్రాంగం ఎయిర్ పోర్ట్ కోసం 1,592 ఎకరాల భూమిని పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. స్టేషన్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉన్నందున... ఈ విషయంలో భూసేకరణ చేసి కేంద్రానికి అప్పగించాలని కోరారు.

అవసరమైతే రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధికి సహకరించాలని, ప్రధాని కూడా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాగే నేషనల్ ఎస్టీ కమిషన్ చైర్మెన్ అంతర్ సింగ్ ఆర్యాను కలిసి జైనూరులో ఆదివాసీ మహిళపై అత్యాచారం, దాడి ఘటనపై చర్చించినట్టు ఎంపీ నగేశ్ తెలిపారు. ఈ ఘటనలో పోలీసులు గిరిజనులు టార్గెట్‌గా కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఆదివాసీలపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మలి దశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటినీ, తన ఆస్తులను దానం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అయిదు దశాబ్దాలుగా అలుపెరుగని కృషి చేసిన మహనీయుడు బాపూజీ అని ముఖ్యమంత్రి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. బహు భాషా కోవిదుడైన బాపూజీ తన జీవితాంతం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సమాజం సదా ఆయన సేవలను స్మరించుకు నేందుకు వీలుగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినట్టు ముఖ్యమంత్రి తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని కాలరాసింది బీఆర్ఎస్సే..

- ఎదురు తిరగడం వల్లే రెండోసారి మంత్రి పదవి రాలేదు
- పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్ పార్టీయే..
- ఏ పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధం : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



నవతెలంగాణ-స్టేషన్ ఘన్‌పూర్

అవినీతి, అక్రమాలకు మారుపేరు బీఆర్ఎస్ పార్టీ.. పదేండ్లు అధికారంలో ఉండి ప్రజాస్వామ్యాన్ని కాలరాసి.. రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేశారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు స్థాయి మరచి పిచ్చి పిచ్చిమాటలు మాట్లాడొద్దని, ప్రజలు ఎందుకు మిమ్మల్ని తిరస్కరించారో గుర్తెరిగి మాట్లాడాలని హితవు పలికారు. మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం తనదని, ఎగిరిన వారందరూ కనుమరుగై పోయారని అన్నారు. తనకు ప్రజాశీర్వాదం ఉందని, ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థ, ఎన్నికల వ్యవస్థలపై గౌరముందని చెప్పారు. ఏ పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. వరంగల్ జిల్లా చరిత్రను కాలరాసే విధంగా వ్యవహరించొద్దని మొత్తుకున్నాను.. ఉమ్మడి జిల్లాను ఆరు ముక్కలు చేయొద్దని ఎదురు తిరిగాను కాబట్టే రెండోసారి తనకు మంత్రి పదవి రాలేదని అన్నారు. కేసీఆర్ నియంతృత్వంతో ప్రజాస్వామ్యవాదుల నోరు నొక్కారని విమర్శించారు. వారి కుటుంబమంతా కలిసి ఇష్టారీతిగా దోపిడీకి ఎగబడిందని ఆరోపించారు. కోట్లాది ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటోళ్లు ఇప్పుడు 9 నెలల పాలన పూర్తికాని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆగం చేసి, అప్పుల ఊబిలోకి నెట్టి, ఖాళీ ఖజానాను అప్పజెప్పి సమయం ఇవ్వకుండా మాట్లాడటమేంటని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని, పదేండ్ల కాలంలో 38 మంది ఎమ్మెల్యేలను, చివరికి శాసనసభ పక్షాలను కూడా చేర్చుకున్నారని అన్నారు. అప్పుడు గుర్తుకురాని ప్రజాస్వామ్యం, ఫిరాయింపుల చట్టం ఇప్పుడెలా గుర్తుకొస్తున్నాయని ప్రశ్నించారు. కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటామని, ఉప ఎన్నికలు రావు.. ఒకవేళ వచ్చినా ఆందోళన లేదని, ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లు వస్తాయో.. లేదో ఆలోచించుకోవాలన్నారు.

హాస్టళ్ల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలి

బీసీ గురుకులాలపై సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గురుకులాలు, బీసీ హాస్టళ్ల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో నాణ్యమైన విద్యా బోధన అందించి విద్యార్థుల్లో వ్యక్తిగత నైపుణ్యాలను మరింత మెరుగు పర్చుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులతో చర్చించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలనీ, అధికారులెవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. విద్యార్థుల స్టడీ సమయం, అల్పాహారం, భోజన సమయాల్లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలు , విద్యార్థుల సిలబస్ ,ప్రాక్టికల్స్ , గేమ్స్ తదితర వాటిపై ప్రతి 15 రోజులకోసారి సమీక్షలు చేయటంతో పాటు నివేదికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వచ్చేనెల ఒకటిన గురుకుల జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారులు , ఆర్సీవో ,డీసీవోలతో పాటు అన్ని కార్పొరేషన్ ఎండీ లు , ఉన్నతాధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆ సందర్భంగా



గురుకులాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేయనున్నారు .అక్కడ రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబర్ మొదటి వారంలో హైదరాబాద్‌లో జరిగే సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్సీవో, డీసీవోలు, గురుకులాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లు , రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేయనున్నట్టు తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో సక్రమంగా క్రీడా , సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళికలు వేయాలని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో పలు కంపెనీలు సీఎస్ఆర్ ఫండ్స్ కింద ఐటిఐ ,పాల్ టెక్నిక్‌లలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాయనీ, గురుకులల్లో కూడా విద్యార్థులకు వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపర్చడానికి వారి సహకారం తీసుకుని మెరుగైన శిక్షణ అందించాలని అధికారులను ఆదేశించారు. అన్ని గురుకుల పాఠశాలల్లో రోడ్డు భద్రత మీద అవగాహన కల్పించాలనీ సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి విద్యార్థి దశ నుంచే అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన గతంలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ,మౌలిక సదుపాయాలు అమలుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కమిషనర్ బాల మాయాదేవి , గురుకులాల సెక్రటరీ సైదులు , బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు , ఎంబీసీ కార్పొరేషన్ ఎమ్‌డీ అలోక్ , జాయింట్ డైరెక్టర్ సంధ్య , కార్పొరేషన్ ఎమ్‌డీలు చంద్రశేఖర్ , ఇందిరా , శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిట్లర్‌లాగే నెతన్యాహును నిలువరించాలి

ఎర్డోగన్

బెంజమిన్ నెతన్యాహు "హంతక నెట్‌వర్క్"పై చర్య తీసుకోవాలని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ అంతర్జాతీయ సమాజాన్ని కోరుతూ మరోసారి ఇజ్రాయెల్ ప్రధానిని అడాల్ఫ్ హిట్లర్‌తో పోల్చాడు. మంగళవారం న్యూయార్క్‌లోని 79వ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో, గాజాలో ఇజ్రాయెల్ ప్రభుత్వ చర్యలను ఎర్డోగాన్ ఖండించాడు. పాలస్తీనా ఎన్‌క్లేవ్ గాజాను "కాన్సంట్రేషన్ క్యాంపు"గా అభివర్ణించారు. "70 ఏండ్ల క్రితం హిట్లర్‌ను మానవత్వ కూటమి ఆపివేసినట్లే.. నెతన్యాహు, అతని హంతక నెట్‌వర్క్ ను మానవత్వ కూటమి ద్వారా ఆపాలి" అని ఎర్డోగాన్ అన్నాడు. నెతన్యాహు "తన రాజకీయ అదృష్టాల కోసం మొత్తం ప్రాంతాన్ని యుద్ధంలోకి లాగడానికి" ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించాడు.

"గాజాలో మారణహోమాన్ని నిరోధించడంలో విఫలమైనందుకు" ఐక్యరాజ్య సమితిని ఎర్డోగాన్ విమర్శించాడు. ఐక్యరాజ్య సమితి సంస్థను మరింత ప్రాతినిధ్యం వహించేందుకు, ప్రభావవంతంగా మార్చేందుకు సంస్కరణల అవసరం ఉందని పిలుపునిచ్చాడు. భద్రతా మండలి తన ఐదు శాశ్వత సభ్య దేశాల ప్రయోజనాలపై ఎక్కువ దృష్టి పెట్టిందని, అంతర్జాతీయ శాంతి భద్రతలను పరిరక్షించడంలో విఫలమవుతోందని ఆయన పేర్కొన్నాడు. అమెరికాతో సహా ఇజ్రాయెల్‌కు బేషరతుగా మద్దతిచ్చే దేశాలు పాలస్తీనియన్లపై హింసకు పాల్పడుతున్నాయని ఎర్డోగాన్ ఆరోపించాడు. గాజాలో తక్షణ, శాశ్వత కాల్పుల



విరమణ ఆవశ్యకతను, అలాగే బందీ-ఖైదీల మార్పిడిని, నిరంతరాయ మానవతా సహాయం అవసరాన్ని అతను నొక్కి చెప్పాడు.

గాజాలో మానవాళికి వ్యతిరేకంగా జరిగిన నేరాలకు ఇజ్రాయెల్ బాధ్యత వహించాలని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే)లో దక్షిణాఫ్రికా దాఖలు చేసిన వ్యాజ్యానికి ఎర్డోగాన్ తన మద్దతును పునరుద్ఘాటించాడు. టర్కీ ప్రజలు ఇజ్రాయెల్ ప్రజల పట్ల ఎలాంటి శత్రుత్వాన్ని కలిగి ఉండరని కూడా అతను నొక్కి చెప్పాడు. "మేము కేవలం వారి విశ్వాసాల కారణంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకోవడానికి ఎలా వ్యతిరేకిస్తామో అదే విధంగా మేము సెమిటిజానికి వ్యతిరేకం" అని ఆయన అన్నారు. ఇజ్రాయెల్ ప్రభుత్వ ఊచకోత విధానాలతో మాకు సమస్య ఉంది. ఐదు శతాబ్దాల క్రితం మాదిరిగానే మా సమస్య అణచివేత, దౌర్జన్యంలో ఉందని ఎర్డోగాన్ అన్నాడు.

పాశ్చాత్య నాయకులకు నచ్చని

జెలెన్‌స్కీ 'విజయ ప్రణాళిక'

బ్లూమ్‌బెర్గ్

ఈ వారం న్యూయార్క్‌లో అమెరికా, ఇతర మిత్రదేశాలకు ఉక్రేనియన్ నాయకుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ అందిస్తున్న 'విక్టరీ ప్లాన్' అంచనాలను తగ్గించాలని పాశ్చాత్య అధికారులు బ్లూమ్‌బెర్గ్‌కు చెప్పారు. జెలెన్‌స్కీ 'విక్టరీ ప్లాన్' రష్యాతో జరుగుతున్న యుద్ధంలో పురోగమనాన్ని అందించగలదనే నమ్మకంలేదని చర్చల గురించి తెలిసిన అధికారులు చెప్పారని బ్లూమ్‌బెర్గ్ మంగళవారం రాసింది. 'విక్టరీ ప్లాన్'లో ఎలాంటి "నిజమైన ఆశ్చర్యకరమైన అంశాలు" లేవు. అంతే కాదు అది గేమ్-ఛేంజర్ కాదు అని ఒక అధికారి చెప్పాడు. అది "కోరికల జాబితా"తప్ప మరేమీ కాదని మరో అధికారి చెప్పాడు. "ప్రణాళికలోని డొల్లతనం కారణంగా మాస్కో, కీవ్‌ల మధ్య సంఘర్షణ ఫలితాలకు సంబంధించి మిత్రదేశాలు తీవ్ర నిరాశకు గురైనట్టు బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది.

పశ్చిమ దేశాలు అవసరమైనంత కాలం కీవ్‌కు మద్దతు ఇవ్వడానికి ఆసక్తిగా ఉన్నాయని మరొక అధికారి పేర్కొన్నాడు. అయితే మాస్కోతో శాంతి ఎలా ఉంటుందనే దానిపై ఉక్రేనియన్ నాయకుడి నుంచి స్పష్టత అవసరమని ఆయన అన్నాడు. 'విజయ ప్రణాళిక' ప్రజలకు అందుబాటులోకి రాలేదు. అయితే ఇది నాలుగు షరతులపై ఆధారపడి ఉందని సండే టైమ్స్ నివేదించింది: ఉక్రెయిన్‌కు పాశ్చాత్య భద్రతా హామీలు, నాటో కూటమి సామూహిక రక్షణ సూత్రం వలె, రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలోకి కీవ్ చొరబాటు కొనసాగింపు. ప్రాదేశిక బేరసారాల చిప్‌గా పనిచేయడానికి, విదేశీ మద్దతుదారులచే "నిర్దిష్ట" అధునాతన ఆయుధాల పంపిణీ, ఉక్రెయిన్‌కు అంతర్జాతీయ ఆర్థిక సహాయం. మంగళవారంనాడు ఏబీసీ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, "మనం అనుకున్నదానికంటే శాంతికి దగ్గరగా ఉన్నాము" అని జెలెన్‌స్కీ పేర్కొన్నాడు. అయినప్పటికీ, అతను తన పథకం "రష్యాతో చర్చల గురించి కాదు", "ఉక్రెయిన్‌ను బలోపేతం చేయటం గురించి"అని నొక్కి చెప్పాడు.

ఆ తర్వాత రోజు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో చేసిన తన ప్రసంగంలో, ఉక్రెయిన్ నాయకుడు సంఘర్షణను "చర్చల ద్వారా శాంతింపజేయలేము"అని, మాస్కో



"బలవంతంగా మాత్రమే శాంతికి సిద్ధపడుతుంది" అని పునరుద్ఘాటించాడు. న్యూయార్క్‌లో ఉన్నప్పుడు, జెలెన్‌స్కీ తన 'విజయ ప్రణాళిక' గురించి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, కాంగ్రెస్ సభ్యులు, ఇద్దరు అధ్యక్ష పోటీదారులు - కమలా హారిస్, డోనాల్డ్ ట్రంప్‌లతో చర్చించాలని యోచిస్తున్నాడు. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఈ వారం ప్రారంభంలో రష్యా నాయకత్వం ఉక్రేనియన్ నాయకుడి చొరవను సరిగ్గా అంచనా వేయలేకపోయింది. ఎందుకంటే దాని గురించి తగినంత విశ్వసనీయ సమాచారం లేదు. మాస్కో తన సైనిక ఆపరేషన్ అన్ని లక్ష్యాలను సాధించినప్పుడు మాత్రమే సంఘర్షణ ముగుస్తుందని మంగళవారంనాడు పెస్కోవ్ పునరుద్ఘాటించాడు.

ప్రపంచ సమకాలీనం

జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో
గాజాపైనే ప్రపంచ నేతల దృష్టి

● ఇజ్రాయిల్‌పై ఆంక్షలు, చర్యలకు పిలుపు

న్యూయార్క్ : ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశాల్లో గాజాపైనే ప్రధానంగా ప్రపంచ నేతలు దృష్టి పెట్టారు. సమావేశాల్లో మాట్లాడే సందర్భంగా ప్రతి ఒక్క నేత గాజాలోని పరిస్థితుల పట్ల, అక్కడ నెలకొన్న మానవతా సంక్షోభం పట్ల తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని, సూడాన్‌లో అంతర్యుద్ధాన్ని కూడా చాలామంది నేతలు ప్రముఖంగానే ప్రస్తావించారు. అలాగే వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న వైపరీత్యాలు, నిరుపేద దేశాలు పడుతున్న ఇబ్బందులు కూడా ప్రస్తావనకు వచ్చాయి.

ఇంతకన్నా భయంకరమైన సంక్షోభం గతంలో ఎన్నడూ లేదని జోర్డాన రాజు అబ్దుల్లా వ్యాఖ్యానించారు. మానవ హక్కులను పరిరక్షించే అంతర్జాతీయ వ్యవస్థనే ఇజ్రాయిల్ దెబ్బ తీస్తోందని విమర్శించారు. ఐక్యరాజ్య సమితి ఆశ్రయాలపై, పాఠశాలలపై దాడులను, మానవతా సిబ్బందిని దాడులు చేసి హతమార్చడాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా మాట్లాడుతూ, ఆత్మ రక్షణ హక్కు కాస్తా ప్రతీకార హక్కుగా మారిందని వ్యాఖ్యానించారు.

టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ మాట్లాడుతూ, ఐక్యరాజ్య సమితి పనిచేయని ఒక సంస్థగా మిగిలిపోయిందని విమర్శించారు. ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించాలని భద్రతా మండలిని కోరారు. అవసరమైతే బల ప్రయోగంతోనైనా గాజాలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు జనరల్ అసెంబ్లీ సిఫార్సు చేయాలన్నారు.

ఇజ్రాయిల్ నేరాలకు జవాబుదారీతనం కావాలి

● ఇరాన్ డిమాండ్

టెహరాన్ : పాలస్తీనా, లెబనాన్‌ల్లో ఇజ్రాయిల్ ఊచకోతలకు పాల్పడుతున్నా అంతర్జాతీయ సమాజం మౌనంగా చూస్తూ కూర్చోవడం పట్ల ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెషికాన్ ఆందోళన వ్యక్తం చేశారు. యూఎన్ జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆయన మాట్లాడారు. పశ్చిమ దేశాల వైపు నుండి కార్యాచరణ లోపించినందున దానికి ప్రత్యామ్నాయంగా శాంతి స్థాపనకు, సమిష్టి సంక్షేమానికి ప్రాంతీయ చొరవ తీసుకోవాలని ప్రతిపాదించారు.

హింసను తక్షణమే ఆపి, గాజాలో శాశ్వత కాల్పుల విరమణకు అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవడం అనివార్యమని అన్నారు. లెబనాన్‌లో ఇజ్రాయిల్ ఆటవిక చర్యలకు తక్షణమే ఫుల్‌స్టాప్ పెట్టేలా చూడాలన్నారు. ప్రాంతీయంగా చెలరేగిన ఈ ఘర్షణలు ఇతర ప్రాంతాలకు, మొత్తంగా ప్రపంచానికి వ్యాపించకముందే జాగ్రత్త పడాలని సూచించారు.

అంతర్జాతీయ సమాజం చేతులు ముడుచుకుని కూర్చోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. 42వేల మందికి పైగా పాలస్తీనియన్ల హత్యకు జవాబుదారీతనం కావాలని డిమాండ్ చేశారు. పైగా ఇజ్రాయిల్ చర్యలను వ్యతిరేకించడాన్ని యూదు వ్యతిరేకిగా ముద్ర వేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ చట్టాలను, మానవ హక్కులను దారుణంగా ఇజ్రాయిల్ అతిక్రమిస్తోందన్నారు.

భారతీయులు లెబనాన్ విడిచి వెళ్లండి

● భారత విదేశాంగ శాఖ

బీరూట్ : గత మూడు రోజుల్లో లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం బాంబు దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల వల్ల వందలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో లెబనాన్‌ని విడిచి వెళ్లండని అక్కడున్న భారతీయులకు భారత విదేశాంగ శాఖ సలహా ఇచ్చింది. ఈ మేరకు బీరూట్‌లోని భారత రాయబార కార్యాలయం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. భారత్‌లో ఉంటున్న ప్రజలు లెబనాన్‌కు వెళ్లవద్దని కూడా సూచించింది. జాగ్రత్తగా ఉండాలని ఇప్పటికే లెబనాన్‌లో ఉన్న భారతీయుల్ని విదేశాంగ శాఖ హెచ్చరించింది. అక్కడ భారతీయులు ఇ మెయిల్ ద్వారా లేదా ఎమర్జెన్సీ ఫోన్ నంబర్ 96176860128 ద్వారా బీరూట్‌లోని భారత రాయబార కార్యాలయంలోని అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ తెలిపింది.

కాగా, ఈ వారం ప్రారంభంలో లెబనాన్‌లో పేజర్ దాడులు జరిగాయి. అనంతరం ఇజ్రాయిల్ సైన్యం దక్షిణ లెబనాన్, రాజధాని బీరూట్‌ని లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం లెబనాన్‌లో మూడు వేల మంది భారతీయులు ఉన్నారు.

స్వలింగ సంపర్కుల వివాహానికి
థాయిలాండ్‌లో చట్టం

బ్యాంకాక్ : స్వలింగ సంపర్కులు వివాహం చేసుకోవడానికి అనుమతిస్తూ థాయిలాండ్ ఒక చట్టం తీసుకువచ్చింది. 120 రోజుల్లో ఇది అమల్లోకి రానుంది. ఇక అప్పుడు వచ్చే ఏడాది జనవరిలో ఎల్‌జిబిటి దంపతులు తమ వివాహాన్ని నమోదు చేసుకోగలుగుతారు. ఆసియాలో ఈ వివాహాలను ఆమోదించిన మూడో దేశంగా థాయిలాండ్ నిలిచింది. ఇప్పటివరకు తైవాన్, నేపాల్‌లు ఆమోదించాయి. స్త్రీ, పురుషుడు లేదా గే ఎవరైనా సరే వివాహ భాగస్వామికి పూర్తి స్థాయిలో చట్టపరమైన, ఆర్థిక, వైద్య హక్కులను ఈ చట్టం కల్పిస్తోంది. వరుసగా ఏప్రిల్, జూన్ మాసాల్లో ప్రతినిధుల సభ, సెనెట్‌ల్లో ఈ బిల్లు ఆమోదం పొందింది.

లవ్ విన్స్ అనే హ్యాష్ ట్యాగ్‌తో ప్రతి ఒక్కరి ప్రేమకు అభినందనలు అంటూ ప్రధాని పెటొంగ్టర్న్ షినవత్రా ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అందరినీ కలుపుకుని పోతుంది, అన్ని వివాహాలకు ఆమోదం వుంటుందనే పేరు వున్నప్పటికీ వివాహ సమానత్వపు చట్టాన్ని ఆమోదించడానికి దశాబ్దాలుగా పోరాటం చేయాల్సి వచ్చింది. థాయి సమాజంలో మెజారిటీ ప్రజలు సంప్రదాయ విలువలకు ప్రాధాన్యతనిచ్చే వారు కావడం, ఎల్‌జిబిటి సభ్యులు తాము రోజువారీ జీవితంలో వివక్షకు గురవుతున్నామని వాపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సివిల్, కమర్షియల్ కోడ్‌ను సవరిస్తూ చట్టాన్ని తీసుకువచ్చారు. స్త్రీ, పురుషుడు అన పదాల స్థానే వ్యక్తి అని పొందుపరిచారు.

పంచాయతీరాజ్ నిధుల విడుదలలో జాప్యం

● రెండో విడత సాధించేందుకు చర్యలు తీసుకోండి :

డిప్యూటీ సీఎం భట్టికి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

15వ ఆర్థిక సంఘం కేటాయించిన పంచాయతీ రాజ్ నిధుల విడుదలలో జాప్యం జరుగుతున్నదని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు విడుదల చేయడంలో ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. వీటి కారణంగా ఎదురవుతున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ మేరకు గురువారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. రాజీవ్ గాంధీ వారసులమని చెప్పుకుంటూ కాంగ్రెస్ సర్కారు పంచాయతీ రాజ్ చట్టాలను తుంగలో తొక్కుతున్నదని విమర్శించారు. 8 నెలలుగా నిధుల్లేక గ్రామాల్లో పారిశుధ్యం కుంటుపడిందనీ, మురికికూపాలుగా మారాయని తెలిపారు. ఆర్థిక భారాన్ని మోయలేక పంచాయతీ కార్యదర్శులు మూకుమ్మడిగా సెలవులు పెట్టే దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పదవీ కాలం గడిచి 4 నెలలైనా సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు సైతం 8 నెలల గౌరవ వేతనాలు చెల్లించలేదని తెలిపారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని కోరారు. అక్టోబర్‌లో రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన రెండో విడత నిధులను సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,200 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మెటీరీయల్ కాంపోనెంట్‌కు సంబంధించిన 25 శాతం నిధులను విడుదల చేయకుండా చోద్యం చూస్తుండటం రాష్ట్రానికి శాపంగా మారిందని చెప్పారు. ఈ పథకానికి సంబంధించి సెప్టెంబర్ 30లోపు యుటిలైజేషన్ సర్టిఫికేట్‌ను కేంద్రానికి అందించని నేపథ్యంలో రెండో విడుదల నిధులు కూడా విడుదల కాని పరిస్థితి నెలకొని రాష్ట్ర ప్రయోజనాలను మరింత దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

చెప్పేది ఒకటి.. చేసేదొకటి !

యూఎన్ జనరల్ అసెంబ్లీలో బైడెన్ చివరి ప్రసంగం



న్యూయార్క్ : మనం కలిసికట్టుగా పనిచేస్తే సాధించలేనిదంటూ ఏమీ లేదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా పరస్పర సహకారానికి అమెరికానే ప్రథమ అడ్డంకి అని సులభంగా మర్చిపోవచ్చునన్నారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో అధ్యక్షుడిగా తన చివరి ప్రసంగాన్ని చేశారు. ఉక్రెయిన్ నుంచి సూడాన్, గాజా వరకు ప్రపంచవ్యాప్తంగా పలు చోట్ల రగులుతున్న ఘర్షణలు, దాడులు, దురాక్రమణలను బైడెన్ తన ప్రసంగంలో ప్రస్తావించారు.

బందీలను విడిపించడానికి, ఇజ్రాయిల్‌కు భద్రత కల్పించడానికి, గాజాను హమాస్ పట్టు నుండి విముక్తి చేయడానికి, తద్వారా గాజా ప్రజల ఇబ్బందులను పరిష్కరించడానికి గానూ గాజాలో కాల్పుల విరమణ జరగాలని, బందీల విడుదల ఒప్పందం కుదుర్చుకోవాలని బైడెన్ పిలుపిచ్చారు. ఉక్రెయిన్ ప్రజలకు బాసటగా నిలబడాలని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సభ్య దేశాలను బైడెన్ కోరారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే తన హయాంలో కీలకాంశంగా వుందని బైడెన్ చెప్పుకున్నారు. ప్రభుత్వ దేశీయ, విదేశాంగ విధానాలను విమర్శించేవారు ఎదుర్కొనే పోలీసు హింసను, అణచివేతను, మూకుమ్మడి అరెస్టులను ఈ సందర్భంగా విస్మరించారు.

ఇజ్రాయిల్‌కు ఆయుధాలు ఎగుమతి చేయకుండా మొత్తంగా ఆంక్షలు విధించాలని పెద్దఎత్తున వస్తున్న డిమాండ్‌ను బైడెన్ ప్రభుత్వం పూర్తిగా పెడచెవిన పెట్టింది. పైగా ఉక్రెయిన్, గాజాల్లో ఘర్షణలను ఎగదోసేలా ఆయుధాలను సరఫరా చేస్తూనే వుంది. అమెరికా వ్యాప్తంగా దాదాపు సగం మంది అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగులు, 61శాతం జనాభా అందరూ కూడా ఆయుధాల ఎగుమతులపై ఆంక్షలు విధించాలని ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు. అమెరికా మాత్రం ఇజ్రాయ్‌కు బేషరతుగా మద్దతును కొనసాగిస్తూ వస్తోంది. లెబనాన్‌లో కూడా భూతల దాడులు విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. లెబనాన్‌లో ప్రస్తుత ఊచకోతకు బైడెన్ ప్రభుత్వమే కారణమని పాలస్తీనా యువజన ఉద్యమం విమర్శించింది. పైగా గాజాకు ఉద్దేశ్యపూర్వకంగానే ఇజ్రాయిల్ మానవతా సాయం అందకుండా చేస్తోందని అమెరికాకు తెలుసు, అయినా కూడా ఇజ్రాయిల్ మారణహోమానికి అమెరికా మద్దతును కొనసాగిస్తోంది.

ప్రధానంగా సూడాన్‌లో నెలకొన్న దారుణమైన మానవతా పరిస్థితులను విమర్శించడానికి బైడెన్ తన ప్రసంగంలో ఎక్కువ సమయం కేటాయించారు. పైగా సూడాన్‌కు మానవతాసాయం అందించే విషయంలో అమెరికా అగ్ర భాగాన వుందని చెప్పుకున్నారు. అయితే అంతర్జాతీయంగా ఎక్కడ ఘర్షణలు తలెత్తినా వాటిలో అమెరికా జోక్యం ఎలా వుంటుందో సూడాన్ యుద్ధంలో కూడా అమెరికా సామ్రాజ్యవాద మూలాలు వున్నాయి.

దశాబ్దాల తరబడి క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలని అంతర్జాతీయ సమాజం విజ్ఞప్తి చేస్తూనే వుంది. 60ఏళ్ళకు పైగా కొనసాగుతున్న ఆంక్షల నడుమ ఆ సోషలిస్టు దేశం నలిగిపోతోంది. ఇటీవలే 73దేశాలకు చెందిన 600మందికి పైగా పార్లమెంట్ సభ్యులు క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ సంయుక్తంగా ఒక లేఖ రాశారు. 35మంది మాజీ ప్రభుత్వాధినేతలు బైడెన్‌కు విడిగా మరో లేఖ రాశారు. క్యూబాను ఉగ్రవాద జాబితా నుంచి తొలగించాలని కోరారు.

ఈ దేశాలనే కాదు, ఇంకా ఇరాన్, ఉత్తర కొరియా, రష్యా, వెనిజులా, సిరియా వంటి పలు దేశాలపై సమగ్ర ఆంక్షల రూపంలో చర్యలు తీసుకుంటూ ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్నారు. చైనా వంటి మరికొన్ని దేశాలపై నిరంతరంగా దాడులకు దిగుతూనే వుంటుంది.

ఇన్ని జరుగుతున్నా చైనాతో ఘర్షణలను ఉద్దేశ్యపూర్వకంగానే తమ ప్రభుత్వం రెచ్చగొడుతోందని అంగీకరించడానికి బైడెన్ సర్కార్ సుతరామూ ఇష్టపడదు. మానవాళి ఎదుర్కొంటున్న అత్యవసర సవాళ్ళను ఎదుర్కొడానికి పరస్పరం సహకరించుకోవడానికి తాము సిద్ధంగానే వున్నామని చెబుతూ వుంటుంది.



దంచికొడుతున్న వానలు

పుణెలో ప్రధాని మోడీ పర్యటన రద్దు

పుణె : మహారాష్ట్రలో వానలు దంచికొడుతున్నాయి. దీంతో ముంబయి సహా పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైన వేళ... శుక్రవారం వరకు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలో ప్రధాని మోడి పుణె పర్యటన రద్దయింది. ఇప్పటికే మహారాష్ట్రలోని కొన్ని జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ఇచ్చింది. ప్రధాని ఈ రోజు పూణేకు చేరుకుని అక్కడ రూ. 22 వేల 900 కోట్ల విలువైన పథకాలను ప్రారంభించి, శంకుస్థాపన చేయాల్సింది. దీంతో పాటు పుణె వాసులకు మెట్రో సర్వీస్ ప్రారంభం కావల్సి ఉంది. స్వర్‌గేట్‌ను డిస్ట్రిక్ట్ కోర్ట్‌ను కలిపే భూగర్భ మెట్రోను ప్రధాని మోడి ప్రారంభించాలని ప్లాన్ చేసుకున్నారు. దీంతో పాటు భిడే వాడాలో మరిన్ని ముఖ్యమైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించాల్సి ఉంది. పీఎం మోడీ పర్యటన కోసం, పూణే పరిపాలన నుండి ఒక ఉత్తర్వు జారీ చేయబడింది. నది వైపు ప్రాంతం, భిడే వంతెనను పార్కింగ్ కోసం సేకరించారు. దీని కారణంగా ప్రజలు భారీ ట్రాఫిక్‌ను ఎదుర్కోవలసి ఉంటుంది. అయితే భారీ వర్షాల నేపథ్యంలో ... పుణెలో ప్రధానమంత్రి మోడీ పర్యటన రద్దయింది

పూజా ఖేడ్కర్ ముందస్తు బెయిల్ పిటిషన్
విచారణ వాయిదా

ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ : ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్ పరీక్షల సమయంలో రిజర్వేషన్లను పొందడానికి నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు ఆరోపణలొచ్చాయి. ఈ ఆరోపణల మేరకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆమె ఐఏఎస్ ఎంపికను రద్దు చేసింది. అన్ని పరీక్షల నుంచి ఆమెను డిబార్ చేసింది. ఈ నేపథ్యంలో ఆమెపై నమోదైన క్రిమినల్ కేసులో అరెస్టు నుంచి మధ్యంతర రక్షణను గురువారం ఢిల్లీ హైకోర్టు పొడిగించింది. ఈ కేసులో పూజా అరెస్టుకు ముందే ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను అక్టోబర్ 4వ తేదీన విచారణ జాబితాలో లిస్ట్ చేయమని పూజా తరపు న్యాయవాది కోర్టును కోరారు. అయితే బెయిల్ పిటిషన్ విచారణను న్యాయమూర్తి చంద్ర ధరి సింగ్ వాయిదా వేశారు. కాగా, పూజా ఖేడ్కర్ తరపున న్యాయవాది యుపిఎస్‌సి చేసిన ఆరోపణలకు సంబంధించి ఫైల్ దాఖలు చేయడానికి మరింత సమయం కావాలని కోర్టును కోరారు.

పదేండ్ల రికార్డు బద్దలు

● హిమాచల్ ప్రదేశ్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు


హిమాచల్ ప్రదేశ్ : హిమాచల్ ప్రదేశ్‌ను అకాల ఉష్ణోగ్రతలు వేడెక్కిస్తున్నాయి. మే, జూన్ నెలల్లో ఉండే వేసవిలాగా హిమాచల్ ప్రదేశ్ లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రుతుపవనాల నిష్క్రమణతో రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా వేడిగా మారింది. దీంతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. పదేళ్ల రికార్డును బద్దలు కొట్టేలా ఎండలు మండిపోతున్నాయి..!

సిమ్లా, మనాలిలో 10 ఏళ్ల రికార్డు బద్దలు...

మరికొద్ది రోజులు ఇలాగే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అక్కడి వాతావరణ శాఖ తెలిపింది. నిజానికి హిమాచల్ ప్రదేశ్‌లో సెప్టెంబర్‌లో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈనెల 15 తర్వాత హిమాచల్‌లో రెండు రోజుల పాటు వాతావరణం చల్లగా మారింది. మనాలి, కిన్నౌర్, లాహౌల్ స్పితి తదితర ప్రాంతాల్లోని పర్వతాలపై మంచు కూడా కురిసింది. అయితే గడచిన కొద్దిరోజులుగా వర్షాలు తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగాయి. సిమ్లా, మనాలిలో ప్రస్తుతం ఏర్పడిన ఉష్ణోగ్రతలు పదేళ్ల రికార్డును బద్దలు కొట్టాయి.

గడిచిన పదేళ్లలో అత్యధిక ఉష్ణోగ్రత ...

సిమ్లా వాతావరణ కేంద్రం విడుదల చేసిన డేటాలోని వివరాల మేరకు ... ఈ నెల 23, 24 తేదీల్లో సిమ్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 28.4 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదైంది. ఇది గడచిన పదేళ్లలో అత్యధికం. 1994లో సెప్టెంబర్ 30న సిమ్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 28.6 డిగ్రీల సెంట్రీగ్రేడ్‌గా నమోదయ్యింది. అదేవిధంగా మనాలిలో కూడా సెప్టెంబర్ నెలలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఇక్కడ సెప్టెంబర్ 23న 27.7 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదయ్యింది.



కాంగ్రాలో ఆల్ టైం ఉష్ణోగ్రతల రికార్డు బద్దలు ...

మరోవైపు సెప్టెంబర్ నెలలో కాంగ్రాలో ఆల్ టైమ్ ఉష్ణోగ్రతల రికార్డు బద్దలైంది. ఈ నెలలో ఇక్కడి ఉష్ణోగ్రత ఎప్పుడూ 35 డిగ్రీలకు చేరుకోలేదు. అయితే తాజాగా సెప్టెంబర్ 24న ఇక్కడ 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యంత వేడిగా ఉండే హిమాచల్ జిల్లాలోనూ పరిస్థితి ఇలానే ఉంది. సెప్టెంబర్‌లో ఉనాలో 38.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ధర్మశాలలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. 10 ఏళ్ల క్రితం ఇక్కడ అత్యధికంగా 32 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

పెరుగుతున్న క్రెడిట్ కార్డు డీఫాల్టర్లు

రూ.2.6 లక్షల కోట్ల బకాయిలు తిరిగి చెల్లించడంలో యువత విఫలం



న్యూఢిల్లీ : ఇటీవల క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగిపోయింది. ఇదే క్రమంలో బకాయిలు చెల్లించలేక క్రమంగా డీఫాల్టర్లు పెరిగిపోతున్నారు. ఇది రుణగ్రహీతల బలహీన ఆర్థిక పరిస్థితులకు అద్దం పడుతోంది. ట్రాన్స్‌యూనియన్ సిబిల్ డేటా ప్రకారం.. 2023 మార్చి ముగింపు నాటికి 1.6 శాతంగా ఉన్న డీఫాల్టర్లు.. 2024 జూన్ నాటికి 1.8 శాతానికి పెరిగారు. మరోవైపు బకాయిల విలువ భారీగా పెరిగిపోతోంది. 2024 మార్చి ముగింపు నాటికి క్రెడిట్ కార్డు బకాయిలు ఏకంగా రూ.2.6 లక్షల కోట్లకు ఎగిశాయి. ఇంతక్రితం ఏడాది మార్చి నాటికి ఈ విలువ రూ.2 లక్షల కోట్లుగా నమోదయ్యింది. కరోనాకు ముందు 2019 మార్చి నాటికి బకాయిలు రూ.87,686 కోట్లుగా ఉన్నాయి. గడిచిన ఐదేండ్లలో ప్రతీ ఏడాది సగటున 24 శాతం చొప్పున పెరుగుతూ రావడం ఆందోళన కలిగించే అంశం.

"యువ మిలీనియల్స్ క్రెడిట్ కార్డు మొత్తం పరిమితిని ఉపయోగిస్తున్నారు. అనంతరం రుణాన్ని చెల్లించకుండా డిఫాల్టర్లుగా మారుతున్నారు." అని మాక్వారీ పరిశోధన విశ్లేషకుడు సురేష్ గణపతి పేర్కొన్నారు. క్రెడిట్ కార్డుల్లో నికర నష్టాలు 5-6 శాతానికి దగ్గరగా ఉన్నాయన్నారు. గడిచిన త్రైమాసికంలో ఎస్‌బీఐ కార్డు 7.5 శాతం నికర క్రెడిట్ లాస్ (ఎన్‌సీఎల్)ను చవి చూసిందన్నారు.

"రుణగ్రహీత వాయిదాల్లో తిరిగి చెల్లిస్తారనే ఆలోచనతో తొలుత పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేయడంతో డీఫాల్ట్ ప్రారంభమవుతుంది. కానీ ఈ బాకీపై కొన్ని సార్లు ఏడాదికి 48 శాతం వరకు వడ్డీనీ చెల్లించాల్సి వస్తుంది. కనీస మొత్తాన్ని చెల్లించే వరకు రుణగ్రహీత పరిస్థితి దిగజారుతుంది. ఆ తర్వాత డీఫాల్ట్ అవుతున్నారు." అని డెట్ రిలీఫ్ వేదిక ఫ్రీడ్ సీఈఓ రితేష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.


కొత్తగా 9.2 లక్షల కార్డుల జారీ..

ఈ ఏడాది ఆగస్టులో కొత్తగా 9.2 లక్షలకు పైగా క్రెడిట్ కార్డులు జారీ అయ్యాయని ఆర్‌బీఐ వెల్లడించింది. ఇంతక్రితం జులైలో 7.55 లక్షల కార్డులను అందించాయి. మొత్తం క్రెడిట్ కార్డుల సంఖ్య 10.55 కోట్లకు చేరాయి. ఈ కార్డుల జారీలో ప్రతీ ఏడాది సగటున 15.6 శాతం పెరుగుదల నమోదవుతోంది. గడిచిన ఆగస్టు నెలలో హెచ్‌డీఎఫ్‌సీ అత్యధికంగా 2.41 లక్షల కార్డులను జారీ చేసింది. ఐసీఐసీఐ బ్యాంక్ 1.45 లక్షలు, యాక్సిస్ బ్యాంక్ 1.27 లక్షలు, ఎస్‌బీఐ కార్డ్స్ 1.1 లక్షల చొప్పున కొత్త క్రెడిట్ కార్డులను జారీ చేశాయి.

కేంద్రం అప్పుల వేట

వచ్చే ఆరు నెలల్లో రూ.6.61 లక్షల కోట్లు లక్ష్యం

సెక్యూరిటీల జారీతో సమీకరణ



న్యూఢిల్లీ : అప్పుల సమీకరణపై మోడీ సర్కార్ దృష్టి పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి మార్చి కాలం ద్వితీయార్థం (హెచ్2)లో రూ.6.31 లక్షల కోట్ల రుణాలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సెక్యూరిటీలను జారీ చేయడం ద్వారా అప్పులను పొందాలని నిర్దేశించుకుంది. దీంతో రెవెన్యూ లోటును పూడ్చుకోనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. "2024-25 బడ్జెట్‌లో రూ.14.01 లక్షల కోట్ల అప్పులను తీసుకోవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 47.2 శాతానికి సమానమయ్యే రూ.6.61 లక్షల కోట్లను ద్వితీయార్థంలో మార్కెట్ల నుంచి పొందాలని నిర్దేశించుకుంది. ఇందుకోసం డేటెడ్ సెక్యూరిటీలను జారీ చేయడంతో పాటుగా సావరిన్ గ్రీన్ బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.20,000 కోట్ల అప్పులను తీసుకోవాలని నిర్ణయించాం." అని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ అప్పులను 21 వారాల్లో వేలం ద్వారా పొందనున్నట్లు తెలిపింది. ఇందుకోసం 3, 5, 7, 10, 15, 30, 40, 50 ఏండ్ల కాలపరిమితి కలిగిన సెక్యూరిటీలను జారీ చేయనుంది. రూ.14.13 లక్షల కోట్ల రుణం తీసుకోనున్నట్లు 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ఇప్పటికే తొలి అర్ధ భాగంలో 7.4 లక్షల కోట్లు (52.8 శాతం) సేకరించింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.15.43 లక్షల కోట్ల అప్పులను సమీకరించారు.

బిజినెస్

మహారాష్ట్ర ప్రభుత్వంతో మేఘా ఒప్పందం

రెండు జల విద్యుత్ కేంద్రాల నిర్మాణం



నవతెలంగాణ -హైదరాబాద్

మహారాష్ట్రలో రూ.21 వేల కోట్ల పెట్టుబడితో 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ఒప్పందం కుదర్చుకుంది. ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో గురువారం జరిగిన ఒప్పంద కార్యక్రమంలో అక్కడి జల వనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి దీపక్ కపూర్, మేఘా సంస్థ తరపున కంపెనీ ప్రెసిడెంట్ ఆర్‌వీఆర్ కిషోర్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ మాట్లాడుతూ నీటి వినియోగం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అన్నారు. కామోడ్ వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌ను ఐదేండ్లలో, ఘోస్లా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌ను మూడున్నరేండ్లలో అందుబాటులోకి తేనున్నామన్నారు.

సర్వోటెక్ పవర్ 58.5 లక్షల కన్వర్టేబుల్
వారెంట్ల జారీ

హైదరాబాద్ : ప్రముఖ ఇవి చార్జర్ల తయారీ కంపెనీ సర్వోటెక్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ తన ప్రమోటర్‌కు కన్వర్టబుల్ వారెంట్ల జారీ చేయనున్నట్లు ప్రకటించింది. సెప్టెంబర్ 23న జరిగిన బోర్డు సమావేశంలో 58.5 లక్షల కన్వర్టిబుల్‌ను జారీ చేయడానికి ఆమోదించినటు వెల్లడించింది. ఒక్కో షేర్ ధరను 167.40గా నిర్ణయించడం ద్వారా రూ.97.93 కోట్ల నగదు పొందనున్నట్లు పేర్కొంది. ఆ కంపెనీ ప్రమోటర్ అయిన సారిక భాటియాకు ఈ వారంట్లను కేటాయిస్తున్నట్లు స్పష్టం చేసింది.

హోమ్‌లేన్ చేతికి డిజైన్ కేఫ్

న్యూఢిల్లీ : ఇంటీరియర్ డెకర్ సొల్యూషన్స్ సంస్థ హోమ్‌లేన్ తన పోటీ సంస్థ డిజైన్ కేఫ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. అదే విధంగా ఇన్వెస్టర్ల నుంచి కొత్తగా 30 మిలియన్ డాలర్లు (రూ.250 కోట్లు) నిధులు సమీకరించినట్లు హోమ్‌లేన్ తెలిపింది. ఈ నిధులను హీరో ఎంటర్‌ప్రైజ్, వెస్ట్‌బ్రిడ్జ్ కాపిటల్ నుంచి పొందినట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ రెండు సంస్థల రెవెన్యూ 108 మిలియన్ డాలర్లు (రూ.900 కోట్లు)గా ఉందని అంచనా వేసింది.

బీఎస్ఈ టెక్ సూచీలో మోతీలాల్ ఓస్వాల్ ఏఎంసీ 25శాతం రాబడి

హైదరాబాద్ : మోతిలాల్ ఓస్వాల్ ఏఎంసీ తన బీఎస్ఈ టెక్ ఇండెక్స్‌పై గడిచిన ఎనిమిది నెలల్లోనే 25.3 శాతం రాబడిని అందించినట్లు తెలిపింది. ఈ ఫండ్ 2023 ఆగస్టు నుంచి 42.12 శాతం రిటర్న్‌లు ఇచ్చిందని పేర్కొంది. ఇదే కాలంలో నిఫ్టీ ఐటి సూచీ 37.29 శాతం పెరిగింది. గత ఐదేండ్లుగా తమ ఈ ఫండ్ స్థిరమైన రాబడిని అందిస్తోందని పేర్కొంది.

బసవతారకం హాస్పిటల్‌తో రెడ్.హెల్త్ భాగస్వామ్యం

నవతెలంగాణ- హైదరాబాద్

అత్యవసర వైద్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌తో రెడ్.హెల్త్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ కె కృష్ణయ్య, సీఓఓ సునీల్ టాండన్, రెడ్‌హెల్త్ వ్యవస్థాపకుడు ప్రభదీప్ సింగ్ పాల్గొన్నారు.

ఈ ఒప్పందంలో భాగంగా ఆ హాస్పిటల్‌కు అత్యాధునిక సదుపాయాలు కలిగిన అంబులెన్స్‌ను రెడ్.హెల్త్ అందించింది.

వన్ పాయింట్ వన్ సొల్యూషన్స్‌కు స్వీడిష్ కంపెనీ ఆర్డర్

హైదరాబాద్ : టెక్నాలజీ ఆధారిత బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) ప్రొవైడర్ అయినా వన్ పాయింట్ వన్ సొల్యూషన్స్ లిమిటెడ్‌కు ప్రముఖ స్వీడిష్ కంపెనీ నుంచి ఆర్డర్ దక్కినట్లు తెలిపింది. ఈ భాగస్వామ్యం గ్లోబల్ మార్కెట్లో తమ సంస్థ ఉనికిని ప్రతిబింబిస్తుందని పేర్కొంది. స్వీడన్, ఇండియా, యునైటెడ్ స్టేట్స్‌తో సహా విస్తారమైన అంతర్జాతీయ కార్యకలాపాల్లో తమ సాంకేతిక సామర్థ్యాలకు నిదర్శనమని ఆ సంస్థ సీఎండీ అక్షయ్ పేర్కొన్నారు.

మొండిబాకీల రికవరీకి
వన్‌టైం సెటిల్‌మెంట్

ఐడీబీఐ బ్యాంక్ వెల్లడి

IDBI BANK

న్యూఢిల్లీ : మొండి బాకీల పరిష్కారానికి రుణ గ్రహీతలకు వన్ టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఐడీబీఐ బ్యాంక్ తెలిపింది. 'సుగమ్ రిన్ భుగ్తాన్ యోజన' పథకంలో భాగంగా 2021 మార్చి 31 ముందు నాటికి నిరర్థక ఆస్తులను సులభంగా పరిష్కరించనున్నట్లు తెలిపింది. కష్టాల్లో ఉన్న రుణగ్రహీతకు సంబంధించిన రూ.10 లక్షల నుంచి రూ.10 కోట్ల వరకు రుణాలను అర్హత ప్రమాణాలకు లోబడి పరిష్కరించుకోవచ్చని పేర్కొంది. రుణగ్రహీతలకు సంబంధిత శాఖలో సంప్రదింపులకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆ బ్యాంక్ తెలిపింది.

మార్టిన్ నుంచి 2 ఇన్1 స్ప్రే

న్యూఢిల్లీ : దేశంలోనే తొలిసారి దోమలు, బొద్దింకల నియంత్రణకు 2 ఇన్ 1 స్ప్రేను అందుబాటులోకి తెచ్చినట్లు మార్టిన్ తెలిపింది. తమ ఈ వినూత్న ఉత్పత్తి బొద్దింకలు, దోమలు రెండిటిని 100 శాతం నాశనం చేయగలదని ఆ సంస్థ ప్రతినిధి సౌరభ్ జౌన్ పేర్కొన్నారు. దీని ప్రారంభ ధరను రూ.115గా నిర్ణయించింది.